తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

మంగళవారం 02.09.2025 | సంపుటి : 12 సంచిక : 44 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# ప్రజాస్వామ్య పరిరక్షణకై జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ



## తెలుగువాడి అభ్యర్థిత్వాన్ని బలపరచండి
## ఆత్మప్రబోధానుసారం ఓటువేయండి

- జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే మన ప్రతిష్ట పెరుగుతుంది
- రాజకీయ పార్టీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

- నేను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదు
- ప్రమాదంలో భారత ఎన్నికల ప్రక్రియ
- ఎన్నికల సంఘం అత్యున్నతమైన వ్యవస్థ
- గతంలో నా తీర్పులను సమర్థనీయమే
- ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

"జాతీయ స్థాయిలో తెలుగు ప్రజల ఉనికి ప్రమాదంలో పడింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించాం. ఇండీ కూటమి ఆలోచనను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గౌరవించి ఎన్నికల బరిలో నిలిచారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎన్నికల బరిలో నిలవడంతో ఎన్‌డీఏ కూటమికి బలమైన సవాల్ విసిరాం. ఇటీవల ఉపరాష్ట్రపతి రాజీనామా అందరికీ ఆశ్చర్యకరం. ఉపరాష్ట్రపతి రాజీనామాకు ఒత్తిడి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు. ఈ తరుణంలో ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. తెలుగు వారి గౌరవం, ప్రతిష్ట పెంపొందించేందుకు అభ్యర్థిని నిలిపాం. రాజకీయాలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అండగా నిలబడాలి. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, జగన్, కేసీఆర్, అసదుద్దీన్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను. ఎంపీలు ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని కోరుతున్నాను. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే మన ప్రతిష్ట దిల్లీ స్థాయిలో పెరుగుతుంది." - సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్1(జనంసాక్షి):** ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని చెప్పారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో కలిసి సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్‌ల్లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్డీయే అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కానీ.. తెలుగువాడికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం

మిగతా 2లో..



## 63% ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిని

**విపక్ష కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఈ నెల 9న, భారత ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే దేశంలో 63శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 27 ప్రధాన రాజకీయ పార్టీలతో ఏర్పాటైన విపక్ష కూటమి అభ్యర్థి, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డితో సోమవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) మీట్-ది-ప్రెస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు

మిగతా 2లో..

## తెలంగాణ పౌర సమాజం తరపున ఎంపీలకు లేఖలు రాస్తాం

- ఉపరాష్ట్రపతి ఎన్నిక వ్యక్తికి, విలువలకు మధ్య జరుగుతున్న పోటీ
- పార్టీ వాళ్లకే ఓటు వేయాలనే నిబంధన ఎక్కడా లేదు..!
- విలువలకు, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఓటు వేయండి
- జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా నిలబడాలని పౌర సమాజం తీర్మానం
- ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడితే నిత్యం బాధపడే వ్యక్తి జస్టిస్ బీఎస్ రెడ్డి
- రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే సదుద్దేశంతోనే అభ్యర్థిగా నిలబడ్డారు
- రౌండ్‌టేబుల్‌లో ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్ సహా ప్రముఖ వక్తలు

**హైదరాబాద్ బ్యూరో(జనంసాక్షి) :** ఉప రాష్ట్రపతి ఎన్నిక వ్యక్తికీ, విలువలకు మధ్య జరుగుతున్న పోటీ అని, ఎంపీలు ఎటువైపు నిలబడతారో ఆలోచించాలని పలువురు వక్తలు కోరారు. ఈ ఎన్నికలో ఆత్మప్రబోధానుసారం

మిగతా 2,12లో..




# వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

- హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల నోటిఫై చేయాలి
- ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాలి
- వరదల ప్రభావంపై కేంద్రానికి నివేదిక పంపాలి
- కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్
- గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి కేంద్రం నుంచి నిధులు రాకపోవడంపై ఆరా

**హైదరాబాద్(జనంసాక్షి):** గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి కేంద్రం నుంచి నిధులు రాకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించించారు. వరదల ప్రభావంపై కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో చెరువుల పరిస్థితిపైన సమగ్ర అధ్యయనం చేయాలని, విపత్తు నిర్వహణ నిధులతో చేపట్టిన పనుల వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల జరిగిన పంట నష్టం అంచనా వేసి వెంటనే నివేదిక ఇవ్వాలని, ఎస్డీఆర్‌ఎఫ్ వరదల సమయంలో బాగా పని చేసిందని అన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్?తో పని లేకుండా ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాలని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల వల్ల 1052 చోట్ల 1023 కిలోమీటర్ల మేరకు రోడ్లు దెబ్బతిన్నాయని సీఎంకు అధికారులు తెలిపారు. దెబ్బతిన్న రోడ్లపై సమగ్ర నివేదిక తయారు చేయాలని, హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల నోటిఫై చేయాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని, జంతువులు చనిపోతే రైతులకు పరిహారం ఇవ్వాలని రేవంత్ రెడ్డి చెప్పారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని,కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాల్లోనే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. కిందిస్థాయి అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విపత్తు నిర్వహణపై సమగ్ర నివేదిక చేసి కేంద్రానికి పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.




## బతుకమ్మకు అంతర్జాతీయ గుర్తింపు

**పోస్టర్ విడుదల చేసిన మంత్రులు**

**హైదరాబాద్(జనంసాక్షి):** బతుకమ్మ పండుగను అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు దక్కేలా, గిన్నిస్ రికార్డు చోటుచేసుకునేలా గొప్ప కార్నివాల్‌గా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బతుకమ్మకు జాతీయస్థాయి ప్రచారం కోసం కొన్ని విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం అని మంత్రి జూపల్లి తెలిపారు. ఈనెల 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవ ుతాయన్నారు. గిన్నిస్ బుక్ రికార్డ్స్ సాధించే లక్ష్యంతో ఈనెల 29న ఎల్బీస్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తాం అన్నారు పీపుల్స్ ప్లాజాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తాం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులంతా పాల్గొనేలా వేడుకలుంటాయి. బతుకమ్మ వేడుకల ద్వారా రాష్ట్ర పర్యాటక

మిగతా 2లో..



## 9-12 తరగతులు చదివితేనే లోకల్

**తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి**

**స్థానికత అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** స్థానికత అంశంపై సుప్రీంకోర్ట్ సంచలన తీర్పునిచ్చింది. తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థించింది. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. తెలంగాణలో వరుసగా 9 ,10, 11,12 తరగతులు చదువితేనే లోకల్ అంటూ స్పష్టం చేసింది. అయితే ఈ రూల్స్ లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంటు-ందనే షరతు పెట్టింది సుప్రీం కోర్ట్. లోకల్ రిజర్వేషన్ అంశంపై తెలంగాణకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పు నిచ్చింది. వరుసగా నాలుగేళ్లు అంటే 9వ, 10వ, 11వ, 12వ తరగతులు తెలంగాణలో చదివితేనే స్థానికుడిగా పరిగణించాలని స్పష్టంచేసింది. అయితే, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. స్థానికత అంశంలో రాష్ట్ర ప్రభు త్వం జారీ చేసిన జీఓ నెంబర్ 33కి అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి మద్దతు తెలిపింది.



తెలంగాణలో స్థానిక రిజర్వేషన్ల అంశం ఎప్పటి నుంచో వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33 ప్రకారం ఇంటర్మీడియట్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. కానీ, కొందరు విద్యార్థులు దీన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మిగతా 2లో..

## కేసీఆర్ అవినీతి మరకకు కారణం హరీశ్, సంతోష్‌లే..



- ఆయన వెనుక గోతులు తవ్వేది వారే..
- కాళేశ్వరం కుట్రల వెనక ప్రధాన సూత్రధారి హరీశ్‌రావు
- కేసీఆర్‌ను అడ్డంపెట్టుకుని వారిద్దరూ భారీగా ఆస్తులు కూడబెట్టారు
- ఆ ఇద్దరి వెనక సీఎం రేవంత్ హస్తం కూడా ఉంది
- ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. కెసిఆర్‌ను బద్నాం చేసే పనిలో హరీష్ రావు, సంతోష్‌ల పాత్ర ఉందని, వారి వెనక సిఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలం ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా అని సూటిగా ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు- రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ జనం కోసం

మిగతా 2లో..

## భారత్, రష్యాలది బలమైన స్నేహం



ఒకే కారులో షాంఘై సదస్సుకు వెళ్తున్న మోదీ,పుతిన్

- పరస్పర అవగాహనతో ముందుకు సాగుతున్నాం
- షాంఘై సహకార సదస్సులో ప్రధాని మోడీ
- ఒకే కారులో పుతిన్‌తో మోడీ ప్రయాణం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎప్పుడు కష్టకాలం ఎదురైనా భారత్,రష్యాలు పరస్పర స్నేహంతో ముందుకు సాగాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమబంధం ఇరుదేశాల ప్రజలకే కాకుండా.. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సుసంపన్నతకు చాలా అవసరమన్నారు. ఇరుదేశాల మధ్య తరచూ జరుగుతున్న ఉన్నతస్థాయి భేటీలు తమ మధ్య ఉన్న ప్రత్యేక బంధాన్ని తెలియజేస్తున్నాయన్నారు. భారత్-రష్యా సంబంధాలు కొన్ని సూత్రాల ఆధారంగా బలంగా ఉన్నాయని అభివర్ణించారు. బహుముఖ సహకారంతో తాము ముందుకువెళుతున్నట్లు- పేర్కొన్నారు. తమ బంధం రాజకీయాలకు అతీతంగా చాలా విశ్వాసపూర్వక మైందని ప్రధాని అభివర్ణించారు. భారత్-రష్యా ద్వైపాక్షిక సదస్సు తింజాయన్‌లోని రిట్జ్ కార్లటోన్ హోటల్‌లో మొదలైంది. ఇక రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని మానవాళి కోరుకుంటోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇరుపక్షాలు ఈ దిశగా అడుగులు వేస్తాయని ఆశిస్తున్నట్లు- చెప్పారు. ఇటీవల జరిగిన శాంతి ప్రయత్నాలను స్వాగతిస్తున్నామన్నారు. డిసెంబర్‌లో జరగనున్న భారత్-రష్యా సదస్సుకు పుతిన్ రాక కోసం 140 కోట్ల మంది భారతీయులు ఎదురు చూస్తున్నారని ఈ సందర్భంగా ప్రధాని మోదీ చెప్పారు.

మిగతా 2లో..

## 'ఓట్లచోరీ'పై హైడ్రోజన్ బాంబు పేలుస్తాం : రాహుల్ గాంధీ

## సీబీఐ విచారణకు భయపడేది లేదు

గోదావరి జలాలపై బాబుతో కలసి కుట్ర

ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

## బిసి బిల్లుకు మండలి ఆమోదం

కాళేశ్వరంపై సిబిఐ విచారణ నేపథ్యంలో బీఆర్‌ఎస్ సభ్యుల నిరసన

## భారీ భూకంపంతో అఫ్ఘానిస్థాన్ అతలాకుతలం


622 మంది మృతి ..1500 మందికి గాయాలు

అన్ని రకాలుగా ఆదుకుంటాం: ప్రధాని మోదీ

వివరాలు 2 పేజీలో..

## భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్ష విపత్తు


**ఆ దేశం ఇప్పటికే ఆలస్యం చేసింది: సుంకాలపై ట్రంప్**



**వాషింగ్టన్(జనంసాక్షి):** భారత్‌పై విధించిన అధిక సుంకాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికా యంత్రాంగం భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి సుంకాలపై వ్యాఖ్యలు చేశారు.భారత ప్రధాని నరేంద్ర మోదీ- రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ ముగిసిన కొన్ని గంటల సమయంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్ష విపత్తు అని పేర్కొన్నారు. అధిక సుంకాల కారణంగా భారత్‌కు అమెరికా వస్తువులను విక్రయించలేకపోతోందని ఆరోపించారు. అమెరికా వస్తువులపై దిగుమతి సుంకాలను సున్నాకు తగ్గించేందుకు భారత్ ముందుకు వచ్చిందని ట్రంప్ అన్నారు. అయితే.. అది ఆలస్యమవుతోందని పేర్కొన్నారు.

మిగతా 2లో..

# ప్రజాస్వామ్య పరిరక్షణకై జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ



పవన్‌కల్యాణ్, మాజీ సీఎంలు కేసీఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అక్బరుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి పార్టీలకతీతంగా ఓటె-య్యాలన్నారు. తాజ్ కృష్ణ హోటల్ లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి వివేక్ ,తుమ్మల,పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీ గడ్డం వంశీతో పాటు- పలువురు ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్.. సుదర్శన్ రెడ్డి పోటీతో ఎన్డీయే కూటమిలో భయం మొదలైందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసమే ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తుందని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చడం కోసం..రద్దు కోసం ఎన్డీయే పోటీ- చేస్తుందని విమర్శించారు. పీవీ, జైపాల్ రెడ్డి జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని అన్నారు రేవంత్.. సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేశారని చెప్పారు. చంద్రబాబు,కేసీఆర్, జగన్ ,పవన్, అసద్ ఆత్మ ప్రభోదానుసారం ఓటెయ్యాలన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి..అందరం ఏకతాటిపై వచ్చి తెలుగు బిడ్డను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సుదర్శన్ రెడ్డి గెలుపు దేశ రాజకీయాల్లో మలుపు తిప్పుతుందన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగ, రాజ్యాంగ రక్షణ కోసమే సుదర్శన్ రెడ్డిని నిలబెట్టామన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే దేశాన్ని కాపాడుకోగలమని చెప్పారు.

**నేను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదు :జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

భారతదేశంలో ఎన్నికల పక్రియ ప్రమాదంలో పడబోతోందని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సంఘం అత్యున్నతమైన వ్యవస్థ అని ఉద్ఘాటించారు. సోమవారం తాజ్ కృష్ణాలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. తాను ఇండియా కూటమి అభ్యర్థిని కాదని.. ప్రతిపక్షాల అభ్యర్థినని సుదర్శన్ రెడ్డి నొక్కిచెప్పారు. తాను ఏ పార్టీ సభ్యత్వం స్వీకరించనని స్పష్టం చేశారు. తనపై ఏవేవో ముద్రలు వేస్తున్నారని... అస్సలు బాధగా లేదని చెప్పుకొచ్చారు. తనపై విమర్శలు చేస్తే ఉప రాష్ట్రపతి ఎన్నికల పోటీ నుంచి వెనక్కు తగ్గనని తెలిపారు. తనను విమర్శిస్తే ఈ ఎన్నికల పోటీ- నుంచి వెనక్కు తగ్గి సైలెంట్ అయిపోతానని కొంతమంది అనుకున్నారని పేర్కొన్నారు. తనను విమర్శించే వారు తాను ఇచ్చిన తీర్పు ఒక్కసారి చదవాలని సూచించారు. కోర్టు తీర్పుల గురించి మాట్లాడేవారు వాటిని చదివి మాట్లాడాలని కోరారు. అది తన తీర్పు కాదని.. కోర్టు తీర్పు అని ఉద్ఘాటించారు. తన తీర్పును 11 మంది న్యాయమూర్తులు చదివారని... అందులో ఒక్క విషయాన్ని కూడా మార్చలేకపోయారని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సల్వా జుడంపై తీర్పు సందర్భంగా హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకుని ఆయన మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలు మసకబారుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ మాట్లాడాల్సిన అవసరముందన్నారు. ఓటు- వేసే ప్రతి పౌరుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ అభిప్రాయాన్ని కలిగి ఉంటారని అన్నారు. నేను ప్రతి ఎన్నికల్లో పాల్గొని నా ఓటు- హక్కు వినియోగించుకున్నాను. పౌరహక్కులు, సామాజిక న్యాయం, ఆదేశిక సూత్రాల గురించి నేను మాట్లాడుతాను. రాజకీయ ముళ్లకిరీటం ఎందుకు నెత్తిన పెట్టుకున్నారని కొందరూ అడుగుతున్నారు. వాళ్లందరికీ రాజ్యాంగాన్ని పట్టుకొని సమాధానం చెబుతున్నాను. ఉప రాష్ట్రపతి పదవి రాజకీయపరమైన పదవి కాదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఐదుసార్లు రాజ్యాంగంపై నేను ప్రమాణం చేశాను. రాజ్యాంగానికి లోబడి ఉండటమే కాదు, కాపాడటం నా బాధ్యతని, ఆదేశిక సూత్రాలను పాటించే వ్యక్తిని నేను అని అన్నారు. ఈ దేశంలోని ప్రజలు ముందు ఓటర్లు, తర్వాతనే పౌరులు అయ్యారు. ఓటరు లిస్ట్ చిత్తు కాగితం అని కొంతమంది అనుకుంటున్నారు. మాకు ఇష్టం ఉన్న వారి పేరు రాస్తాం, ఇష్టం లేని వాళ్ల పేర్లు రాయమంటే ఎలా అని ప్రశ్నించారు. మెజారిటీ ఉంది చట్టం చేస్తాం అంటే ఎలా..?.రాజ్యాంగం మంచి వాళ్ల చేతుల్లో ఉన్నంత వరకే దానికి రక్షణ అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

## 63శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిని

కె.విరా హత్ అలీ స్వాగతోపన్యాసం చేయగా, తెలంగాణ మీడి యా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మోడరేటర్ గా వ్యవహరించారు. సుప్రసిద్ధ పాత్రికేయులు కె. రా మచంద్రమూర్తి, ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యూ.జే అధ్య క్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబులతో పాటు జాతీయ, ప్రాంతీయ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు చెందిన జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బతుకమ్మకు అంతర్జాతీయగుర్తింపు

రంగానికి ప్రచారం కల్పిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ పండుగ గురించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి దేశవిదేశాలకు తెలిసేలా చేస్తామన్నారు. పర్యాటకశాఖ, మహిళలను భాగస్వామ్యం చేస్తూ వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. ఈసందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే పండగ నిర్వహణకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

## 9 - 12 తరగతులు చదివితేనే లోకల్

వెలువరించింది. ప్రతి రాష్ట్రం తన స్థానిక రిజర్వేషన్ల కోసం తగిన నిబంధనలు రూపొందించుకునే అధికారం ఉందని సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్రం వాదనలు వినిపించింది. అయితే రాష్ట్ర విభజన తర్వాత తమ పిల్లలు మరో రాష్ట్రంలో చదవాల్సి వచ్చిందని అభ్యర్థుల తరపున వాదనలు వినిపించారు పిటిషనర్లు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో లోకల్ కోటా పై జీవో 33 ను అమలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్నారని..దాంతో వాళ్ళ పిల్లలకు జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. రాష్ట్రప్రభుత్వం చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అయితే గతేడాది హైకోర్ట్ ఇచ్చిన తాత్కాలిక మినహాయింపుతో స్థానిక కోటా కింద ప్రయోజనం పొందిన విద్యార్థులు తమ ప్రయోజనాలను కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఎంబీబీఎస్, బీడీఎస్ యూజీ కోర్సులలో జీవో 33 ప్రకారమే స్థానిక కోటా రిజర్వేషన్లు అమలుకానున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామనడంపై ప్రైవేటు- ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా తప్పని పరిస్థితుల్లోనే రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ పిల్లల భవిష్యత్ గురించి ప్రభుత్వము కోర్టులు ఆలోచించాలని వేడుకుంటున్నారు.

## భారత్, రష్యాలది బలమైన స్నేహం

ఇక ఈ భేటీలో పుతిన్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీని ఆప్తమిత్రుడిగా అభివర్ణించారు. భారత పీఎంతో భేటీ- కావడంపై ఆయన సంతోషం వ్యక్తంచేశారు. షాంఘై సహకార సదస్సు గ్లోబెల్ సౌత్, ఈస్ట్ దేశాలకు ఓ బలమైన వేదిక అని అభివర్ణించారు. రానున్న కాలంలో జరగనున్న భారత్-రష్యా ద్వైపాక్షిక సదస్సు తమ బహుముఖ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఒకే కారులో పుతిన్‌తోమోడీ ప్రయాణం

సాధారణంగా పెద్దపెద్ద సదస్సుల్లో దేశాధినేతలు వేర్వేరు కార్ల కాన్వాయ్‌ల్లో వేదికల వద్దకు చేరుకొంటారు. కానీ, తింజియన్‌లోని షాంఘై సహకార సదస్సులో మాత్రం భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ఒకే కారులో బయల్దేరి వేదిక వద్దకు చేరుకోవడం విశేషం. ఈ విషయాన్ని స్వయంగా ప్రధాని ట్విటర్‌లో పంచుకొన్నారు.ఎస్‌సీవో సదస్సు వేదిక వద్ద ప్రొసీడింగ్స్ ముగిసిన తర్వాత.. అధ్యక్షుడు పుతిన్, నేను కలిసి ఒకే కారులో మా ద్వైపాక్షిక భేటీ- వేదిక వద్దకు చేరుకొన్నాం. ఇద్దరి మధ్య చర్చలు ఎప్పుడూ లోతుగా జరుగుతాయని పేర్కొన్నారు. ఇరు దేశాధినేతల మధ్య నెలకొన్న స్నేహబంధానికి ఈ జర్నీ గుర్తుగా నిలిచింది. షాంఘై సహకార సదస్సుకు పుతిన్ తన వాహన కాన్వాయ్‌ను తీసుకొచ్చారు. దీనిలో ఆయన వాడే ఆరస్ సెనేట్ లిమోసిన్ కూడా ఉంది. దీనికి ప్రత్యేకంగా చైనా డిఎ÷-లొమేటిక్ లైసెన్స్ కేటాయించింది. అమెరికా అధ్యక్షుడు వాడే బీస్ట్‌లా దీనిలో కూడా రష్యా (షశ) అధినేత రక్షణకు చాలా ఫీచర్లను అమర్చారు. ఈ కారు చాలా ఆకర్షణీయంగా రోల్స్ రాయిస్, బెంట్లీ- మోడల్స్‌ను కలిపి తయారుచేసినట్లు అనిపిస్తుంది. అత్యంత విలాసవంతగా ఉన్న ఈ వాహనంలో 4.4లీటర్ వీ8 పెట్రోల్-హైబ్రీడ్ ఇంజిన్ వాడారు. 2018లో పుతిన్ నాలుగోసారి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఇది విధుల్లోకి వచ్చింది. ఇది దాదాపు ఏడు టన్నుల బరువు ఉంటుందని సమాచారం. ఇది తూటా, బాంబు దాడులను తట్టుకోగలదు. వీఆర్-10 బాలిస్టిక్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న మెటీరియల్‌తో నిర్మించారు. దీనిలో రసాయన దాడి నుంచి అధ్యక్షుడిని రక్షించేందుకు అన్ని ప్రత్యేక సౌకర్యాలున్నాయి. అదనపు ఆక్సిజన్ అందించేందుకు ఏర్పాట్లు- చేశారు. అగ్ని ప్రమాదాలను నివారించే వ్యవస్థ కూడా దీనిలో ఉంది.

## కేసీఆర్ అవినీతి మరకకు కారణం హరీశ్, సంతోష్‌లే..

పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు. హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ రెడ్డి ఏమీ అనరు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నా లేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయటపెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ-ప్లాన్‌డ్‌గా సీబీఐ దర్యాప్తుకు ఆదేశించారని అన్నారు. కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారు. ఆయనకు అవినీతి మరక అంటితే బాధగా ఉంది. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఆర్థిక ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి నా తండ్రిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే నాకు బాధగా ఉండదా? కేసీఆర్‌ని నిన్న అన్ని మాటలు అంటుంటే, ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏంటి? రేవంత్.. మీకు దమ్ముంటే.. లోపాయకారీ ఒప్పందం లేకపోతే నేను పేర్లు కూడా చెప్పా.. చర్యలు తీసుకోండని సవాల్ చేశారు. ఆ ఇద్దరు, ముగ్గురు నేతలే కేసీఆర్‌పై కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీష్‌రావు, సంతోష్‌ది కీలకపాత్ర అని వెల్లడించారు. వీరిద్దరి వెనక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని.. వారిని కాపాడుతున్నారని ఆరోపించారు. .

## భారీ భూకంపంతో అఫ్గానిస్థాన్ అతలాకుతలం

కాబూల్(జనంసాక్షి):అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. పాకిస్థాన్ సరిహద్దులోని కునార్ ప్రావిన్స్‌లో రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రత నమోదైంది. ఈ ఘోర విపత్తు కారణంగా 622 మంది మరణించినట్లు- ఆ దేశ అధికారిక మీడియా సంస్థ రేడియో టెలివిజన్ అఫ్గానిస్థాన్ వెల్లడించింది. మరో 1500 మంది వరకు గాయపడినట్లు- తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. నంగర్హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు- వెల్లడైంది. 8 కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమై ఉంది. ఆదివారం అర్ధరాత్రి 11.47 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు- అధికారులు తెలిపారు. ఘోర విపత్తు కారణంగా కునార్ ప్రావిన్స్ తీవ్రంగా ప్రభావితమైనట్లు- సమాచారం. భూకంప తీవ్రతకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బాధితులకు అత్యవసర సహాయం అవసరమని పలువురు పోస్టులు పెడుతున్నారు.

## బిసి బిల్లుకు మండలి ఆమోదం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ శాసనమండలిలో సోమవార బీఆర్‌ఎస్ సభ్యుల గందరగోళం నడుమ నాలుగు బిల్లులను మండలి ఆమోదించింది. ఆ తరవాత నిరవధికంగా వాయిదా పడింది. మొదటగా బీసీ బిల్లుపై చర్చించి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్టసవరణ, పురపాలక సంఘాల చట్టసవరణ, అల్లోపతిక్ ప్రైవేటు- వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. బీఆర్‌ఎస్ సభ్యుల నిరసనల మధ్యనే మండలిలో నాలుగు బిల్లులు ఆమోదం పొందాయి. అసెంబ్లీలోకాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శాసన మండలిలో బీఆర్‌ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. చైర్మన్ పోడియం దగ్గర బీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో శాసనమండలిలో కొంత గందరగోళ వాతావరణం నెలకొంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక పేపర్లు చింపి మండలి చైర్మన్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సీబీఐ వద్దు.. రేవంత్‌కు సీబీఐ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడియం వద్ద నిరసన వ్యక్తం చేయొద్దని.. వారికి కేటాయించిన స్థానాల్లోనే నిరసన వ్యక్తం చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. అయితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల నిరసనలతో శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. శాసనమండలిలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ సభ్యులపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్ష విపత్తు

వారు కొన్నేళ్ల క్రితమే అలా చేసి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. మోదీ-పుతిన్ భేటీ నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. అమెరికాకు భారత్ ఎక్కువ వస్తువులు విక్రయించి.. తక్కువ కొనుగోలు చేస్తుందన్నారు. ఏ దేశంపై వేయనంత సుంకాలను భారత్ అమెరికాపై వేసిందని చెప్పారు. సుంకాలు తగ్గిస్తామని భారత్ ఇప్పుడు ప్రతిపాదిస్తోందని, కానీ, ఇప్పటికే ఆలస్యమైందని ట్రంప్ అన్నారు.

## 'ఓట్ల చోరీ'పై హైడ్రోజన్ బాంబు పేలుస్తాం: రాహుల్

హైదరాబాద్(జనంసాక్షి):ఓట్ల చోరీ విషయంలో ఇటీవల అణుబాంబు పేల్చామని.. త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీని తర్వాత ప్రధాని మోదీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారన్నారు. 'ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా పట్నాలో నిర్వహించిన కార్యక్ర మంలో రాహుల్ ఈ మేరకు ప్రసంగించారు. "రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు భాజపాకు అనుమతించబోం. అందుకే ఈ యాత్ర నిర్వహించాం. దీనికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మహారాష్ట్రలో, కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగిందని ఆధారాలు సహా చూపించాం. ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే. ఈ వ్యవహారంలో త్వరలోనే హైడ్రోజన్ బాంబు పేల్చనున్నాం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'ఓటరు అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా 'ఇండియా' కూటమి నేతలు పట్నాలో నిర్వహించిన 'గాంధీ సే అంబేద్కర్' మార్చ్‌ను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే ప్రసంగించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

# తెలంగాణ పౌర సమాజం తరపున ఎంపీలకు లేఖలు రాస్తాం

ఓటు వేయాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య భవిష్యత్తు దృష్ట్యా వ్యక్తిగత నిజాయితీ కలిగిన అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా నిలబడాలని, తెలంగాణ పౌర సమాజం తరపున పార్లమెంట్ సభ్యులందరికీ లేఖలు సైతం రాస్తామని తీర్మానించారు. విలువలు, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఓటువేయాల్సిన తరుణమిదని గుర్తుచేశారు. పార్టీవాళ్లకే ఓటు వేయాలని నిబంధన రాజ్యాంగంలోనూ ఎక్కడా లేదని, కాబట్టి విలువలు గౌరవించే జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం తెలుగు బిడ్డ జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి మద్దతుగా, అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు ఎంఎం రహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వక్తలు, మేధావులు హాజరై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తనకు వ్యక్తిగతంగా చాలా పరిచయం కలిగినవారని, ఆయన ప్రజల పక్షాన పనిచేశారని అన్నారు. సల్వాజుడుం అనే ప్రైవేటు సైన్యాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసి ఆదివాసీలను లెక్కలేని విధంగా హత్యచేశారని చెప్పారు. మహిళలను, అక్కడున్న ప్రజలను బట్టలు విప్పించి చెప్పుల దండలు మెడలో వేసి ఊరేగింపు కార్యక్రమాలు సైతం చేశారని, ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. దీనిపై అవగాహన లేకుండా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాత్రం విలువలు దిగజారి మాట్లాడడం బాధాకరమన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల వ్యక్తిగత వివరాలు సేకరించి, తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్న కేంద్ర ప్రభుత్వం.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి విషయంలో మాత్రం సల్వాజుడుంను ముందుకు తీసుకురావడం విడ్డూరమన్నారు. ఈ ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణ కోసం సాగుతున్నాయని, అందుకే కొద్దిరోజులుగా విలువల మధ్య చర్చ కొనసాగుతోందన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో గెలుపోటములు పక్కనబెడితే జస్టిస్ సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగానే రాజ్యాంగం, విలువల మధ్య చర్చ తారాస్థాయికి చేరిందన్నారు. రాజ్యాంగం గురించి దేశ ప్రజలకు చెప్పాలనే సదుద్దేశంతోనే ఆయన బరిలో నిలిచారని వివరించారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, ఓటు వేయనివారి దగ్గరకు కూడా వెళ్తూ రాజ్యాంగం గురించి చెప్తున్నారని అన్నారు. ఇది రాజ్యాంగం పట్ల ఆయన నమ్మకం, బాధ్యతను తెలియజేస్తోందని, పౌర సమాజంలో అందరూ ఏకమై రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని విలువలను కాపాడుకోవాలని అన్నారు.



**ప్రజా హక్కులను కాపాడే బాధ్యత సుప్రీంకోర్టుదే..**

**- జస్టిస్ చంద్రకుమార్**

ఈ దేశ ప్రజల హక్కులను కాపాడేది సుప్రీంకోర్టు మాత్ర మేనని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఉన్నత న్యాయ స్థానాల తీర్పులు ఈ విధం గా ఉండాలని ఓ రాజకీయ నాయకులు చెప్పగలరా? అలా చెప్పే అర్హత అతనికి ఉందా? అని ప్రశ్నించారు. రాజ్యాంగానికి భిన్నంగా ఏ ఆర్డినెన్స్ తెచ్చినా, ప్రాథమిక హక్కుకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తే వాటిని కొట్టివేసే హక్కు సుప్రీంకోర్టుకు ఉందని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత సుప్రీంకోర్టు జడ్జిల మీద ఉందని అన్నారు. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య ఏ ఘర్షణ వాతావరణం నెలకొన్నా పరిష్కరించే బాధ్యత సుప్రీంకోర్టుదేనని చెప్పారు. ఆర్టికల్ 32 ప్రకారం ఏ వ్యక్తి ప్రాథమిక హక్కుకు భంగం కలిగినా, ఎన్కౌంటర్ జరిగినా జీవించే హక్కు భంగం కలిగినా కాపాడే బాధ్యత సుప్రీంకోర్టుకు ఉందన్నారు. ప్రభుత్వాలు కూడా కోర్టు ముందర కక్షిదారి అని, ఓ కక్షిదారు కోర్టు తీర్పును తప్పు పట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. కోర్టు తీర్పుల వల్ల ఎంతోమంది రాజకీయ నాయకులు జైలుకెళ్లారని, ఆ ఇంగిత జ్ఞానం కూడా లేకుండా మాట్లాడటం సరైనది కాదన్నారు. రాజ్యాంగంపై గౌరవం ఉన్నవారు ఎవరు కూడా ఇలాంటి కామెంట్స్ చేయరని, సుదర్శన్ రెడ్డి ఓటు హక్కును అడ్డుకోవడం కోసమే అమిత్ షా కామెంట్లు చేశారని మండిపడ్డారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని చెప్పగలరా? చదువు లేనివారికి తుపాకులు ఇచ్చి చంపడం దారుణం కాదా? ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసి వారి చేతులకు తుపాకులిచ్చి హత్యలు చేయించడం కరెక్టేనా అంటూ కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టారు. సీబీఐ, ఈడీ కేంద్ర దర్యాప్తుల సంస్థలను చివరికి ఎన్నికల కమిషన్‌ను కూడా బిజెపి ప్రభుత్వం తమ గుప్పెట్లో పెట్టుకొని దేశ ప్రజలను ఇబ్బందులు పెడుతున్న దుస్థితి నెలకొందన్నారు.

**జస్టిస్ సుదర్శన్ రెడ్డి జనజీవన స్రవంతిలోనే ఉన్నారు**

**- దేవులపల్లి అమర్, సీనియర్ సంపాదకులు**



అర్బన్ నక్సలైట్ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సీని యర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ ఘాటైన విమర్శలు చేశారు. జనజీవన స్రవం తిలో ఉన్న ఆయనకు బిజెపి మద్దతు ఇవ్వా లని, గెలుపోటములు తర్వాత విషయమని అన్నారు. అమిత్ షా మాటలతో న్యాయ వ్యవస్థ పరువు పూర్తిగా దిగజార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు నక్సలైట్లు ఎప్పుడో ఖతమయ్యేవారని రాజ్యాంగ ద్విసభ్య ధర్మాసనం తీర్పుపై ఈ దేశ హోంమంత్రి విమర్శలు చేయడం దారుణమన్నారు. సుప్రీంకోర్టులో బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు ఇచ్చిన రిటైర్డ్ జడ్జిలకు వెంటనే రాజ్యసభ సభ్యులుగా పదువులు కల్పిస్తున్నారని తెలిపారు. నిజాయితీగల తీర్పు రాజ్యాంగ రక్షణకు సుప్రీంకోర్టు ఉంటుందన్నారు. చత్తీస్‌గడ్‌లో స్పెషల్ పోలీస్ వ్యవస్థను తెచ్చి ఎలాంటి విద్యార్హత లేకుండా వందలాది మందిని హత్య చేశారని, ఆదివాసీ గిరిజన మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టారని అన్నారు. రామచంద్ర గుహ నందిని సుందర్ సుప్రీంకోర్టుకు వెళితే తప్ప ఈ చారిత్రాత్మకమైన తీర్పు వచ్చిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిలబడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని సమర్థించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



**చట్టబద్ధమైన అధికారం ఉండాలి**

**- ప్రొఫెసర్ కోదండరాం**



ఆనాడు సల్వాజుడుం పేరిట అమానవీయ ఘటన కు పాల్ప డ్డారని, అందుకే రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు తీర్పు ప్రకటించిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రస్తుతం సాంప్రదాయం పునాదుల మీద, బలప్ర యోగం ఆధారంగా అధికారం చెలాబడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రెండు అధికారాలకు సమాజం పట్ల బాధ్యత లేదన్నారు. ఇలాంటి బాధ్య తను గుండాయిజంతో నాడే అంబేద్కర్ పోల్చారని చెప్పారు. చట్టబద్ధమైన అధికారం నిలబడాలని, అప్పుడే జవాబుదారీతనం ఉంటుందన్నారు. సల్వా జుడుం తీర్పులోనూ చట్టబద్ధమైన అధికారాన్నే ఉటం కించారని వివరించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం విషయంలో ఘర్షణ ఏర్పడుతున్నప్పుడు మనం ఎటువైపో తేల్చుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. విలువలకు సమాజంలో బలం చేకూ ర్చా ల్సిన అవశ్యకత ఉందని, రాజ్యాంగ విలువల ప్రకా రం అధికారం నడవాలని కోరుకునేవారు కచ్చితం గా ఒకవైపు నిలబడాలని అన్నారు. మౌనంగా ఉండకూడదన్నారు. ప్రస్తుతం రాజ్యాంగానికే ప్రమాదం ఏర్పడుతున్న కఠిన పరిస్థితుల్లో సుదర్శన్ రెడ్డివైపు సమాజం నిలబడాలని కోరారు.

**రెండు సిద్ధాంతాల మధ్య పోటీ**

**- కే.రామచంద్ర మూర్తి, సీనియర్ సంపాదకులు**

భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో రెండు సిద్ధాంతాల మధ్య పోటీత్వత్వం నెలకొందని కె రామచంద్రమూర్తి అన్నారు. భారత ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి సోషలిస్ట్ భావాలు కలిగిన వ్యక్తి అని, ఆయన పనిచేసిన విధానం రాజ్యాంగానికి కంకణబద్ధులై ఉండి దళిత గిరిజన ఆదివాసి ప్రజల హక్కులను కాపాడడానికి ఎంతో ప్రయత్నం చేశారని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా రాజ్యాంగ బద్ధంగానే తీర్పులు ఇస్తుందని, అమిత్ షా వ్యాఖ్యలు సరైనవి కావాన్నరు. ఎంపీలందరూ అంతరాత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని, సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

## సీబీఐ విచారణకు భయపడేది లేదు

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికను ఆదివారం ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వ, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఈ కేసును సిబిఐకి అప్పగిస్తామని అన్నారు. అయితే ఈ విషయంపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ మండిపడ్డారు . 'ఎక్స్' వేదికగా ఆయన సిఎం రవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సెటర్లు వేశారు. తెలంగాణలో కరెన్సీ మేనేజర్(సిఎం) కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగిస్తారట.గతంలో రాహుల్ గాంధీ దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలను అంతం చేసే సెల్స్ అని అన్నారు. మిస్టర్ గాంధీ మీకు తెలుసా.. మీ సిఎం ఏం చేస్తున్నారో..? ఇలా ఎంత బెదిరించినా.. భయపడేది లేదని.. రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం చేస్తాం. ప్రజలపై, న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉందని కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.దీంతో పాటు గతంలో రాహుల్ చేసిన పోస్ట్‌కి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఆయన జత చేశారు. ఇదిలావుంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ సాకుతో చంద్రబాబు, మోదీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి భారీ కుట్ర పన్నుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కేవలం కేసీఆర్, బీఆర్‌ఎస్ మీదనే దాడి జరగడం లేదన్న కేటీఆర్.. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి మన గోదావరి జలాలను ఆంధ్రకు తరలించే కుతంత్రాలకు ఆ ముగ్గురు తెరతీశారని మీడియా వద్ద విమర్శించారు. తెలంగాణ గొంతుకగా ఉన్న కేసీఆర్, బీఆర్‌ఎస్‌లను లేకుండా చేసి తెలంగాణపై తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టు-కునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీ-ఆర్ మండిపడ్డారు. మోదీ, చంద్రబాబు ఎజెండా మేరకు బనకచర్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టారన్నారు.

# మహిళల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

- మహిళా సంఘాలకే చేప పిల్లల పెంపకం బాధ్యతలు
- మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ
- కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ప్రజాభవన్ లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల వారు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పరిస్థితిని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 46 వేల చెరువులు చేప పిల్లల పెంపకానికి 122 కోట్లు విడుదల చేశామని డిప్యూటీ- సీఎం తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తామని ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారి తో సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయించి ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమకూర్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో మహిళల చేత పెద్ద ఎత్తున వ్యాపారం చేయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించి మొదటి సంవత్సరంలో అందరి అంచనాలను

తలకిందులు చేస్తూ 21,600 కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. హైటెక్ సిటీ పక్కన శిల్పారామం వద్ద విలువైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చి ఆర్థికంగా వారిని ప్రోత్సహిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లో ఏర్పాటు ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. రాష్ట్ర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని ప్రపంచంతో పోటీ పడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జిడిపి పెరుగుదలకు దోహదపడుతుందన్న నమ్మకతో ఉన్నామని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు స్వయం సహాయ సంఘాల సభ్యులను గాలికి వదిలేశారు ప్రజా ప్రభుత్వం రాగానే వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు- తెలిపారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుంది అన్నారు. కార్యక్రమంలో క్రీడలు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు- సాయికుమార్, సీఈఓ దివ్య పాల్గొన్నారు.

# హరీష్‌ను సమర్థిస్తూ కెటిఆర్ ట్వీట్



హైదరాబాద్, సెప్టెంబర్1 (జనంసాక్షి) : ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కవితకు బిగ్ షాక్ ఇచ్చారు. కవితకు కౌంటర్ ఇస్తూ.. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ట్వీట్‌ను కేటీఆర్ ట్వీట్ చేశారు. డైనమిక్ లీడర్ హరీష్‌రావు ఇచ్చిన మాస్టర్ క్లాస్ అంటూ.. పేర్కొన్నారు. నీటిపారుదల గురించి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు.. కేసీఆర్ ప్రియశిష్యుడు హరీష్ ఇచ్చిన పాఠం ఇది అంటూ.. ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కవిత చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో హరీష్ రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే.. మాజీ సీఎం కేసీఆర్ కేటీఆర్, మధుసూదనాచారీ, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీష్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలతో సమావేశం అయ్యారు. దానితో పాటు- బీఆర్ఎస్ మీడియా వాట్సాప్ గ్రూప్స్ నుంచి కవిత పీఆర్వోను బీఆర్ఎస్ తొలగించింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు- వార్తలు బీఆర్ఎస్ శ్రేణుల్లో నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొత్త పార్టీకి కవిత రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు- వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ మేరకు బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కాగానే కవిత కొత్త పార్టీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు- సమాచారం. అయితే.. రేపు కవితపై బీఆర్ఎస్ పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందా అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# నోటీసులపై మరో వారం గడువు కోరాం: కడియం

హైదరాబాద్, సెప్టెంబర్1 (జనంసాక్షి) :మాకు మరో వారం రోజుల గడువు ఇవ్వండి అని ఫిరాయింపు ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. కడియం శ్రీహరి తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్ నుంచి తమకు నోటీసు వచ్చింది వాస్తవమేనని అన్నారు. సెప్టెంబర్ 2వ తేదీలోగా నోటీసుకు సమాధానం ఇవ్వాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే ఈ గడువు సరిపోదని, ఈ గడువు తర్వాత కూడా తమకు అదనంగా మరో వారం రోజుల సమయం ఇవ్వాలని కోరగా అందుకు స్పీకర్ సమ్మతించారని ఆయన చెప్పారు. ఈ గడువులో తాము సమాధానం ఇస్తామని కడియం తెలిపారు. పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. రాజ్యాంగంలోని పదవ షెడ్యూలు ప్రకారం ఫిరాయించిన ఎమ్మెల్యేల శాసనసభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ ఒకవైపు స్పీకర్‌కు నోటీ-సు ఇవ్వడం, మరోవైపు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సమాధానం తెలియజేయాలంటూ నోటీసు పంపించారు.

# ప్రయివేట్ ఫామ్‌హౌజ్‌కు ధన్‌ఖడ్

- అధికారిక నివాసం ఖాళీచేసినట్లు వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ దాదాపు ఆరు వారాల తర్వాత తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. ఈ క్రమంలోనే దక్షిణ ఢిల్లీలో ఛతర్‌పుర్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌కు మారారు. మాజీ ఉపరాష్ట్రపతిగా ఆయనకు అధికారిక నివాసం కేటాయించే వరకు తాత్కాలికంగా అక్కడ ఉంటారని అధికారులు తెలిపారు. ఆ ఫామ్‌హౌస్ ఐఎన్ఎల్‌డీ నేత అభయ్ చౌతాలాకు చెందినదిగా తెలుస్తోంది. ఆరోగ్య కారణాలు చూపుతూ.. జులై 21న జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి ప్రజాజీవితానికి దూరంగా ఉంటున్నారు. ఆయన ఇప్పటివరకు పార్లమెంట్ హౌస్ సమీపంలోని ఉపరాష్ట్రపతి భవనంలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన తన సమయాన్ని కుటుంబ సభ్యులతో గడుపుతున్నారని, టేబుల్ టెన్నిస్ ఆడుతున్నారని, యోగా సాధన చేస్తున్నారని ధన్‌ఖడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇటీవల ఆయన మాజీ ఎమ్మెల్యే పింఛనుకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ధనఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1993 ఎన్నికల్లో కిషన్‌గఢ్ నుంచి కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. ఆ సమయంలో రూల్స్ కమిటీకీ సభ్యుడిగానూ పనిచేశారు. నిబంధనల ప్రకారం.. రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యేలు రూ.35వేల పింఛనుకు అర్హులు. వయసు ఆధారంగా ఆ మొత్తంలో పెంపు ఉంటు-ంది. 70 ఏళ్లు దాటిన మాజీ సభ్యుడికి 20 శాతం, 80 ఏళ్లు దాటితే 30 శాతం అదనపు పింఛను అందుతుంది. దీంతో 74 ఏళ్ల ధన్‌ఖడ్‌కు రూ.42 వేలవరకు పింఛను లభించనుంది.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం !

**అప్రమత్తంగా ఉండాలని ఐఎండి హెచ్చరిక**

విశాఖపట్నం, సెప్టెంబర్1 (జనంసాక్షి) : బంగాళాఖాతంలో రాబోయే 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం ఐఎండీ వెల్లడించింది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలకు భారీ నుంచి అతిభారీ వర్ష సూచన ఉన్నట్లు- పేర్కొంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసింది. ఇదిలావుంటే ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని తమ్మిలేరు జలాశయానికి వరదనీరు పోటెత్తుతుందని తమ్మిలేరు జలాశయం ఇరిగేషన్ ఏఇ లాజర్ బాబు తెలిపారు. సోమవారం ఏఇ లాజర్ బాబు మాట్లాడుతూ ... తమ్మిలేరు జలాశయం ప్రస్తుత నీటిమట్టం 348.8 ఉండగా, ఇన్‌ఫ్లో 1800 క్యూసెక్కులు ఉండగా 3000 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు- తెలిపారు. తమ్మినేని జలాశయం పరీవాహ ప్రాంతాలు ధర్మాజీగూడెం గొల్లపూడిలోపుడి బలివే, ఏలూరు జలాశయం చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రాష్ట్ర విద్యా పాలసీ కమిటీ మెంబర్‌గా ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 01 ( జనం సాక్షి ) : రాష్ట్ర విద్యా పాలసీ కమిటీ మెంబర్ గా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో చైర్మన్ సహా మొత్తం ఏడుగురు సభ్యులు ఉన్నారు. ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు ఈకమిటీకి చైర్మన్ గా ఉన్నారు. సభ్యులుగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామ కృష్ణారావు, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి బాలకిష్ట రెడ్డి ఉన్నారు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ యోగితా రాణా సభ్య కన్వీనర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020,రాష్ట్ర నిర్దిష్ట విద్యా అవసరాలు, ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ కమిటీ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించనుందని, తెలంగాణ రైజింగ్ 2047 కోసం మార్గదర్శక పత్రంగా తెలంగాణ విద్యా విధానాన్ని రూపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కమిటీ జాతీయ విద్యా విధానం నిబంధ న లను అధ్యయనం చేయడం, వాటిని తెలంగాణ సందర్భానికి అనుగుణంగా మార్చడం లాంటివి రాష్ట్ర విద్యా పాలసీలో చేర్చుతుందని,ఆవిష్కరణ, వ్యవస్థా పకతలో డిజిటల్ మార్పుపై ప్రత్యేక దృష్టి సారించనుం దని అన్నారు. పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వృత్తి, నైపుణ్యం,వృత్తివిద్యలో సంస్కరణలను సూచించడం, సమానత్వం, క్వాలిటీ ఎడ్యుకేషన్ నిర్ధారించడం వంటి సూచనలను కమిటీ చేస్తుందని అన్నారు.

# వరంగల్‌లో తొలి బతుకమ్మ వేడుకలు

- వరంగల్‌లో టూరిజం శాఖ తొలి బతుకమ్మ వేడుకను విజయవంతం చేస్తాం...
- పోస్టర్ ఆవిష్కరణలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ..



వరంగల్ ప్రతినిధి, సెప్టెంబరు1 (జనంసాక్షి): ఆడబిడ్డల పోరుగడ్డ... వరంగల్ లో టూరిజం శాఖ ఆధ్వర్యంలో తొలి బతుకమ్మ వేడుకలు నిర్వహించడం స్వాగతనీయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రాణిరుద్రమ, సమ్మక్క, సారక్క, చాకలి ఐలమ్మ, హజారే మంగమ్మ వంటి ధీనవనితలు వచ్చి నేల ఓరుగల్లు అని ఆమె పేర్కొన్నారు. అటువంటి వరంగల్ జిల్లాలో టూరిజం శాఖ నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలను మొదటిసారిగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం ప్రశంసానీయమని అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, సాంస్కృతిక విభాగం సంచాలకులు మామిడి హరికృష్ణ, బతుకమ్మ పండుగ నిర్వాహకురాలు దిల్లీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పోస్టరును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. పూలతో దేవున్ని కొలిచే ఈ పండుగ ప్రపంచంలో మరెక్కడా లేని ప్రత్యేకత అని చెప్పుకొచ్చారు. బతుకమ్మ కేవలం ఒక పండుగ కాదని, ఇది తెలంగాణ ఆత్మగౌరవ వేడుక అని సురేఖ వివరించారు. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండే, సమాజాన్ని, కుటుంబాలను కలిపే పండుగ అని చెప్పారు. ప్రకృతి, పర్యావరణం, పూలతో మన బంధాన్ని ప్రతిబింబించేలా సంబరాలు చేస్తామన్నారు. ప్రతి తెలంగాణవాసి గుండెల్లో పూల పరిమళంలా నిలిచేలా ఉత్సవం చేస్తామన్నారు. మహిళలకు అత్యంత ప్రత్యేకమైన ఈ పండుగలో, ఎంగిలి పూలతో ప్రారంభించి తొమ్మిది రోజులు తీరొక్క పువ్వుతో బతుకమ్మ పేర్చి ఘనంగా జరుపుకుంటారన్నారు. బాధలను మరిచి, బంధువులతో కలిసి పాటలు పాడుతూ, కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహంగా సాగే పండుగ బతుకమ్మ అని అన్నారు. బతుకమ్మ పండుగను పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.

# 2025 రైతునేస్తం పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

- సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు పంపండి

హైదరాబాద్ (జనంసాక్షి) : 'రైతునేస్తం' 21వ వార్షికోత్సవ సందర్భంగా సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త 'పద్మశ్రీ' డాక్టర్ ఐ.వి. సుబ్బారావు పేరిట వ్యవసాయ, అనుబంధ రంగాలలో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులతోపాటు అగ్రి ఇన్నోవేషన్స్‌ను అవార్డులతో త్వరలో జరగబోయే వార్షికోత్సవ వేడుకలో ఘనంగా సత్కరించనుంది.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకునే వ్యవసాయ, అనుబంధ రంగాల శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, అగ్రి ఇన్నోవేషన్స్, రైతులు 'రైతునేస్తం' వెబ్‌సైట్ https://rythunestham.in/awards నుండి అప్లికేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, దాన్ని పూరించి, దానికి వారి పరిశోధనా వ్యాసాలను, సాగు అనుభవాలను జతపరచి సెప్టెంబర్ 15 వ తేదీలోగా 'ఎడిటర్, రైతునేస్తం, 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004. ఫోన్: 9676 79 77 77 (లేదా) 'రైతునేస్తం', డో.నెం. 8-198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మం॥ఎ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522 017, ఫోన్: 97053 83666 చిరునామాలకు పంపగలరు లేదా editor@rythunestham.in కు ఇ-మెయిల్ చేయవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాలవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే. ఈ 21వ వార్షికోత్సవం త్వరలో ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడుతుందని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మెన్, పత్రిక ఎడిటర్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

# స్తంభించిన జాతీయ రహదారి

**ఐదు గంటలపాటు ఖమ్మం-వరంగల్ రహదారిపై రాస్తారోకో**

**యూరియా బస్తాల కోసం రోడ్డు ఎక్కిన రైతన్నలు**



మరిపెడ సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : మరిపెడ మండలంలో ఆగ్రహం చెందిన రైతులు సరిపడా యూరియా సరఫరా చేయడం లేదని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ని పెట్రోలు బంకు ముందు వరంగల్ ఖమ్మం హైవే పై రైతన్నలు రోడ్డెక్కారు. ఉదయం 10 గంటల నుండి 2:30 వరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియా సకాలంలో అందడం లేదని ఫైర్ అయ్యారు. యూరియా కొరత ఉందని పడిగాపు లు గాసినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వ నికి చలనం లేదు అన్నారు,సకాలంలో పంటలకు యూరియా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే యూరియా కొరత ఏర్పడింది అన్నారు, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే యూరియాను రైతుల కు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు, రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలం అయ్యిందని మండిపడ్డారు, కేసీఆర్ హయాంలో కూడా యూరియా కొరత లేకుండా చేశారు, ఇప్పుడు ఎందుకు కొరత ఏర్పడింది అని వాపోయారు, ప్రజా పాలన లో యూరియా బస్తాలు దొరకక రైతన్న లు ఉదయం నుండి షాపు లా ముందు లైన్ లో ఉంటే ఒక్క బస్తా కూడా దొరికే పరిస్థితి లేదు. యూరియా కొరత వలన రైతులు నిద్ర హారాలు మాని తిండి తిప్పలు బంద్ చేసి సొసైటీల దగ్గరే లైన్ లో నిలబడి అక్కడే ఉంటున్నారని అర్ధరాత్రి దాకా ఉన్న ఒక బస్తా యూరియా దొరికే పరిస్థితి లేదని వారన్నారు. ఈ సీజన్లో రైతులకు సరైన సమయంలో అందించలేని యూరియా ఇంకెప్పుడు అందిస్తరనీ రైతన్నలు వాపోయారు, రైతన్న లకు యూరియాను సరఫరా చేస్తే రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి రైతుల కు ఎందుకు వస్తదని ఆవేదన వ్యక్తం చేశారు,భారిగా రైతుల ధర్నాతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచి సుమారు 3 నుండి 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ లు వచ్చి రైతులకు సర్ది చెప్పి ధర్నా విరమింప చేశారు, అనంతరం పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు.

# కెసిఆర్ మీద ఈగ వాలినా రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కెసిఆర్ పై ఈగ వాలిన రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా స్టేషన్‌ఘనపూర్ నియోజ కవర్గ కేంద్రంలో నల్లజెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు గర్వకారణం అని, గోదావరి జలాలను ఎత్తిపోతల పద్ధతిలో పైకి ఎత్తి, లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే చరిత్రను కేసీఆర్ సృష్టించారని అన్నా రు. కేసీఆర్ కృషి వలన రైతుల బతుకుబాట మారింద ని, కానీ కాంగ్రెస్ పార్టీ కావాలనే కుట్రలు పన్ని, ప్రాజెక్ట్‌కి చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం చేస్తోందని,ఎలా అయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ను చంపి బనక చర్ల ప్రాజెక్ట్ ను బ్రతి కించి ఆంధ్రాకు నీళ్ళు తరలించే కుట్ర జరుగుతోందని అన్నారు. సీబీఐకి కేసు అప్పగించి, ఎలా అయినా కేసీఆర్ ని జైలులో పెట్టాలని కాంగ్రెస్ చూస్తోందని, కెసిఆర్ పై ఈగ వాలిన ఉరికిచ్చి కొడతామన్నారు. రైతులకు సాగునీరు, యూరియా అందించడం లేదని వేలేరు నుండి గండి రామారం రిజర్వాయర్ వరకు ఆదివారంరోజున పాదయాత్ర చేశామని,ఆ పాదయాత్ర తో కడియం శ్రీహరి గుండెల్లో గుబులు పుట్టి, మళ్లీ ఇంకో నాటకానికి తెరలేపారని అన్నారు. ఈ 20 నెలల కాలంలో దేవాదులపై ఒక్క తట్టెడు మట్టీ కూడా తీయ లేదని, రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడు తుంటే, కడియం శ్రీహరి తననియోజకవర్గంలో యూరి యా కొరత లేదని అంటున్నాడని, ఇది ప్రజలను పట్టిం చుకోని పాలనకు నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లపాలనలో ఎప్పుడూ రైతులకు యూరియ కొరత రాలేదని, కానీ ఇప్పుడు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతుల కోసం పోరాటం ఆగదు అని డాక్టర్ రాజయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు పార్టీప్రతినిధులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

- కంటెయినర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్1 (జనంసాక్షి) : మహబూబ్‌నగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున అడ్డాకుల మండలం కాటావరం స్టేజి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటెయినర్ లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను అఫ్రస్ ఉన్నిసా (70), హసన్ (35), ఎల్లమ్మ (45)గా గుర్తించారు. క్షతగాత్రులను 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## కాళేశ్వరం అవినీతికి కవిత వ్యాఖ్యలే నిదర్శనం

**ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్1 (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగినట్లు- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఒప్పుకొన్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అవినీతి జరిగినట్లు- కవిత చెప్పకనే చెప్పారన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీసీ ఘోష్ నివేదికను బలపరుస్తున్నట్లు-గా కవిత మాట్లాడారు. నిన్న అసెంబ్లీలో చర్చను ఆమోదించినట్లు- మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నాం. కారకులు ఎవరనే విషయం పక్కన పెడితే కాళేశ్వరంలో స్కామ్ జరగడం నిజం. కేసీఆర్ సీఎంగా, హరీశ్ ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు స్కామ్ జరిగిం ది. యూరియా కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంటే ఎందు కు భారత రాష్ట్ర సమితి నాయకులు రాలేదు. బీసీల విషయంలో గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది' అని చామల ఆరోపించారు.

# ఆటతో ఆరోగ్యం, భవితవ్యం



ప్రతి సంవత్సరం ఆగస్టు 29న మనం జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటాం. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఈ దినోత్సవం దేశవ్యాప్తంగా క్రీడా స్ఫూర్తిని ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. అయితే ఈ రోజును కేవలం ఒక క్రీడా వీరుడికి నివాళులర్పించే రోజుగానే కాకుండా క్రీడలు మన జీవితంలో ఎంత ముఖ్యమో విశ్లేషించుకునే రోజుగా భావించాలి. ప్రత్యేకించి, విద్యార్థులకు క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదు, జీవిత పాఠాలు నేర్పే ఒక గొప్ప పాఠశాల.

మేజర్ ధ్యాన్ చంద్ అసాధారణమైన ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. బడి పిల్లల నుండి కళాశాల విద్యార్థుల వరకు ప్రతి ఒక్కరూ ఆయన జీవితం నుండి నేర్చుకోవాలి. జీవితం కేవలం బడి పుస్తకాలలోనో, పరీక్షల మార్కులలోనో లేదు. ఒక క్రీడాకారుడు మైదానంలో ఎదుర్కొనే సవాళ్లు, ఆటుపోట్లు, గెలుపు, ఓటమి వంటివి జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పుతాయి. ధ్యాన్ చంద్ వారసత్వాన్ని గౌరవించాలంటే, మనం ఆటకు ఒక గంట సమయాన్ని కేటాయించాలి. క్రీడలు కేవలం శరీరాన్ని దృఢంగా ఉంచడం మాత్రమే కాదు, వాటి వల్ల మానసిక, సామాజిక ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి.

**ఆట: గెలుపోటములకు మించినది**

ఆట అంటే కేవలం గెలుపోటముల లెక్క కాదు. అది మనలోని పోరాట స్ఫూర్తికి ప్రతీక, మన రక్తాన్ని ఉరకలేసే ఒక ఉద్వేగం. ప్రతి ఆటగాడికి మైదానం ఒక యుద్ధభూమి, విజయం ఒక గమ్యం. కానీ గమ్యానికంటే ముఖ్యం ఆ గమ్యం వైపు సాగే ప్రయాణం. ప్రతి బంతి, ప్రతి అడుగు, ప్రతి స్వేదపు చుక్క ఆ ప్రయాణానికి సాక్ష్యం. అది ఒక పాఠం, ఒక నైపుణ్యం, జీవితానికి అద్దం పట్టే ఒక అనుభవం. నేడు ప్రపంచం మెచ్చిన నాయకులు మైదానంలోనే పుట్టారు. కష్టాలను ఓర్చి, పరాజయాలను స్వీకరించి, విజయానికి బాటలు వేసే గుణం మైదానంలోనే అలవడుతుంది. ఆట అనేది కేవలం కండరాల పందెం కాదు, అది మనసు, ఆత్మ, సంకల్పంల సమగ్ర సంగమం. విజయం తాలూకు ఆనందం కన్నా, ఓటమి నుంచి నేర్చుకునే పాఠం మరింత విలువైనది. క్రీడాకారుడి అసలైన బలం అతని కండరాల్లో కాదు, పరాజయాన్ని ఎదుర్కొనే అతని ధైర్యంలో ఉంటుంది. క్రీడలు నిశ్శబ్దంగా మనలోని నాయకత్వాన్ని, క్రమశిక్షణను పెంచుతాయి. ఇవి జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను ఎలా స్వీకరించాలో నేర్పి, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయి.

**శారీరక ఆరోగ్యానికి క్రీడల ప్రాముఖ్యత:**

శారీరక ఆరోగ్యానికి క్రీడలు కేవలం ఒక హాబీ కాదు, అది మన శరీరానికి ఒక పెట్టుబడి. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల మన శరీరం, మనసు రెండూ ఆరోగ్యంగా ఉంటాయి. నేటి ఆధునిక జీవనశైలిలో, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యలకు సరైన పరిష్కారం క్రీడలే. క్రీడలు ఆడేటప్పుడు గుండె వేగంగా కొట్టుకోవడం, వేగంగా ఊపిరి తీసుకోవడం వల్ల గుండె కండరాలు బలపడతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. ఇవి శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. స్థూలకాయం నేటి ప్రధాన సమస్యల్లో ఒకటి. క్రీడలు అధికంగా క్యాలరీలను ఖర్చు చేయించడం ద్వారా శరీరంలో అదనపు కొవ్వును కరిగిస్తాయి. దీనివల్ల బరువు అదుపులో ఉండి, శరీరం నాజూగ్గా, దృఢంగా మారుతుంది. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఎముకలు, కండరాలు బలపడతాయి. పరుగెత్తడం, దూకడం, బరువులు ఎత్తడం వంటి క్రీడలు ఎముకల సాంద్రతను పెంచి, కండరాలకు శక్తినిస్తాయి. దీనివల్ల వృద్ధాప్యంలో కూడా శరీరం చురుగ్గా ఉండేందుకు సహాయపడుతుంది. శారీరక శ్రమ చేయడం వల్ల మన శరీర వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. క్రీడలు తెల్ల రక్త కణాలను చురుగ్గా పనిచేసేలా చేసి చిన్న చిన్న అనారోగ్యాల నుండి రక్షణ కల్పిస్తాయి.

**మానసిక ప్రశాంతతకు క్రీడలు:**

క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి కూడా అత్యంత అవసరం. నేటి వేగవంతమైన ప్రపంచంలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలకు సరైన చికిత్స క్రీడలే. క్రీడలు ఆడేటప్పుడు మెదడులో ఎండోర్ఫిన్స్ అనే 'ఫీల్-గుడ్ హార్మోన్స్' విడుదలవుతాయి. ఈ రసాయనాలు ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి మనసుకు ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయి. ఆటల ద్వారా వచ్చే శారీరక శ్రమ, మనసును సమస్యల నుండి దూరం చేసి, తాత్కాలికంగా వాటిని మర్చిపోయేలా చేస్తుంది. క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీరం అలసిపోయి మంచి నిద్రకు దారితీస్తుంది. మంచి నిద్ర మెదడుకు, శరీరానికి విశ్రాంతినిచ్చి, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్రీడలో నైపుణ్యం సాధించడం, లక్ష్యాన్ని చేరుకోవడం, లేదా జట్టులో భాగంగా విజయం సాధించడం మనలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతాయి. చిన్న విజయాలు సాధించినప్పుడు కలిగే సంతృప్తి, మనం ఏదైనా చేయగలమనే నమ్మకాన్ని ఇస్తుంది.

క్రీడలు - సామాజిక నైపుణ్యాలు: జట్టులో ఆడటం వల్ల సహకారం, సమన్వయం, కమ్యూనికేషన్ వంటి లక్షణాలు అలవడతాయి. క్రీడాకారులు ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం, కష్ట సమయాల్లో అండగా నిలబడటం నేర్చుకుంటారు. దీనివల్ల స్నేహాలు బలపడతాయి, ఒంటరితనం తగ్గుతుంది. క్రీడల్లో విజయం సాధించాలంటే కఠినమైన శిక్షణ, నియమాలను పాటించడం, సమయపాలన అవసరం. ఈ లక్షణాలే వ్యక్తిగత జీవితంలో కూడా స్థిరత్వాన్ని, నిలకడను పెంచుతాయి.

**సవాళ్లను ఎదుర్కోవడం:**

ప్రతి క్రీడాకారుడు మైదానంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటాడు. గట్టి ప్రత్యర్థిని ఎదుర్కోవడం, వ్యూహాలు మార్చుకోవడం, ఒత్తిడిలో సరైన నిర్ణయాలు తీసుకోవడం వంటివి క్రీడలో భాగం. ఇలాంటి పరిస్థితులు మనలోని ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. క్రీడలు ఓటమిని ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తాయి. పరాజయం తరువాత, నిరాశ చెందకుండా, తప్పులను సరిదిద్దుకుని మళ్లీ ప్రయత్నించే గుణం అలవడుతుంది. ఈ లక్షణమే జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలను తట్టుకునే శక్తిని ఇస్తుంది.

మొత్తంగా క్రీడలు కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, అవి మానసిక చికిత్సకు ఒక సాధనం. ఒత్తిడిని తగ్గించి, నిద్రను మెరుగుపరచి, ఆత్మవిశ్వాసాన్ని పెంచి సామాజిక బంధాలను బలోపేతం చేస్తాయి. కాబట్టి, ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకుంటే వారు ఆరోగ్యకరమైన మనసుతో, ప్రశాంతమైన జీవనాన్ని గడపగలుగుతారు. కేవలం గెలుపోటముల కోసమే కాకుండా, ఆరోగ్యకరమైన, ఆనందకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో క్రీడలను ఒక భాగంగా చేసుకోవాలి.



కింజరాపు అమరావతి
8247286357

# మహాకవే! నమోస్తుతే




స్పందన అనేది మనిషికి జీవనాడి. లోకంలో సాధారణంగా మనుషులు తమ జీవనోపాధి కోసం నిత్యం ఏదో ఒక పని చేస్తుంటారు. అయితే అందులో కొందరు రాణిస్తారు, మరికొందరు రాణించలేరు. దానికి కారణం వారు తాము చేస్తున్న పనిని సృజనాత్మకంగా కాకుండా మొక్కుబడి తంతుగా యాంత్రికంగా చేయటమే అందుకు కారణం. అలాగే నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే మనుషులు కాస్త తీరిక దొరికినప్పుడు ఆ సమయాన్ని లోకాభిరామాయణంతో కాలక్షేపం చేస్తారు. కానీ నిరంతర అధ్యయన, అధ్యాపనలతో సామాజిక చైతన్యంతో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, భావి భారత పౌరులైన విద్యార్థులకు తమదైన బాణీలో కొత్త ఆలోచనలతో విద్యాబోధన చేయాలని తపిస్తుంటారు. తను చూసింది, చదివింది, నేర్చుకున్నది నిరంతరం పిల్లలకు అందించాలని తపన పడుతుంటారు. ఈ విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం పట్ల కనీస అవగాహన లేని కొంతమంది, ప్రభుత్వ ఉద్యోగులలో ఎవరికీ లేనన్ని సెలవులు ఉపాధ్యాయ వర్గానికి ఉన్నాయని అప్పుడప్పుడు తమ అక్కసును వెళ్లగక్కుతుంటారు. కానీ వాస్తవానికి అది విద్యాతత్వశాస్త్రాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఉందన్న విషయం వారికి తెలియదు. ఒక శాస్త్రవేత్త ఒక కొత్త విషయాన్ని కనుగొన్నప్పుడు, ఒక పురాతత్వవేత్త ఒక చారిత్రక ఆధారాన్ని వెలికి తీసినప్పుడు ఎలా ఆనందిస్తారో అలాగే భాషా పండితులు, తాము చెప్పే పాఠ్యాంశాలకు సంబంధించిన మౌలికమైన కవుల రచయితల పరిసరాలను చూసినప్పుడు అంతే ఆనందిస్తారు.

ఈ నేపథ్యంలో అందుకు ఉదాహరణగా అన్నట్లు పాలమూరు జిల్లాకు చెందిన 22 మంది భాషా పండితులు ప్రముఖ తెలుగు పండితులు, పాఠ్య పుస్తక రచయితలు, ప్రవచనకర్తలు పల్లెర్ల రామమోహన రావు, కట్టా గిరిజా రమణ శర్మ నాయకత్వంలో ఏప్రిల్ 24, 25

తేదీలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కవులకొండగా పేరొందిన మడికొండ, వరంగల్లు, దాశరథి సోదరుల జన్మస్థలమైన చిన్న గూడూరు, తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుని జన్మస్థలం పాలకుర్తి, భక్తకవి పోతన జన్మస్థలమైన బమ్మెర, విరియాల మల్లన్న వేయించిన గూడూరు శాసనాన్ని, వాల్మీకి క్షేత్రంగా భాసిల్లుతున్న వల్మిడి గ్రామాన్ని సందర్శించారు. విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలకు వెళ్లినప్పుడు ఎంత ఉత్సాహంతో ఉంటారో, ఈ పాలమూరు పండితులు అంత శ్రద్ధాసక్తులతో ఆయా ప్రదేశాలను సందర్శించారు. అంతేకాదు తాము ఆయా ప్రదేశాలలో పొందిన అనుభూతిని అనుభవాలను అక్షరీకరిస్తూ "మహాకవే! నమోస్తుతే" పేరుతో గ్రంథాన్ని వెలువరించారు. చాలామంది సామూహికంగా చూసి వెళుతుంటారు గాని వాటిని భవిష్యత్తు తరాలకు భద్రపరిచి అందించాన్న ధ్యాస ఉండదు. కాగా నాటి ఏనుగుల వీరాస్వామి యాత్ర చరిత్ర స్ఫూర్తిగా ఇటీవల తెలుగులో ట్రావెలాగ్ ఒక ప్రక్రియ గా సాహిత్య చరిత్రలో చోటు చేసుకుంటుండడం ఒక శుభ పరిణామం.

ఈ నేపథ్యంలో గ్రంథ విషయానికి వస్తే చూసింది ఒక ప్రదేశం అయినా దర్శించే దృక్పథం భిన్నం కనుక అనుభూతి తల్లి వేరుగా ఆయా పండితులు వివిధ కోణాలలో వ్యాసాలను రాశారు. సిద్ధాంతి రాజశేఖర్ తన అనుభవాన్ని గురించి రాస్తూ "వరంగల్ పెద్దలు మా పట్ల చూపిన ఆదరణను గమనిస్తే తల్లి పుట్టింటి కి వెళ్లిన మేనకోడలు, మేనళ్ళులను చూసుకున్నట్లుగా" అనిపించిందని రాశారు. అలాగే పోతన పద్యాలను అదే ధ్యాసగా, శ్వాసగా చదువుతున్న పల్లెర్లను గురించి రాస్తూ ఆయనలో బమ్మెర పోతన ఆవహించాడని అనిపించినట్లు చెప్పారు. కాగా పల్లెర్ల ఇప్పటికే పోతన నాద సుధ, భాగవత నీతి పద్యములు అన్న రచనలను వెలువరించి తాజాగా భాగవతము- ఛంద శిల్పమును శోధిస్తుండడం కాకతాళీయం అని చెప్పవచ్చు. కాళోజి ఇంట్లో అడుగుపెట్టిన తిరుపతమ్మ "అవునా! వారి గదిలో కూర్చున్నామా? ఇది నిజమా!" అని అనుభూతి చెందారు. వాల్మీకి గుట్టను గురించి రాస్తూ అనిత కుమారి గారు ప్రకృతి అందాల మధ్య పరవశించిపోయాము అంటూ భావుకతతో చెప్పారు. మరో రచయిత పి.గిరిధర్ "నేటి విద్యార్థుల మానసిక ప్రవర్తనను, యాంత్రికత నుండి సహజ స్థితికి తేవాలంటే ఇలాంటి యాత్రలు అవసరం" అని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యువ మిత్రులు నరేష్ తమ సాహిత్య యాత్రను జైత్రయాత్రగా అభివర్ణించారు. ఒకే పాదులో భక్తి, విప్లవం మొలకెత్తినట్లు పాలకుర్తి బమ్మెరలను దర్శించడం అదృష్టం అన్నారు. అక్కడ పుట్టిన చిగురు కొమ్మయిన చేవ అన్నట్లు దేవగిరి రామన్న గారి మనవడు,మనుమరాలు భోజన సమయంలో పద్యాలు చదవడం, హరిహరుల ప్రదక్షిణకై సహజసిద్ధంగా ఏర్పడిన సొరంగ మార్గం అలౌకిక ఆనందాన్ని కలిగించాయని కట్టా అనిత తమ అనుభూతిని జ్ఞాపకం చేసుకున్నారు. శ్రీమతి అనిత, గిరిజా రమణులు దంపతులుగా రావడం దేవతార్చనలకు బృందం తరపున ప్రతినిధులుగా బాధ్యతలను నిర్వహించారు. ఎండనకా, ధూపనకా సాగిన ప్రయాణంలో ఎన్నో మధురానుభూతులను మూటగట్టుకుని బయలుదేరామని డాక్టర్ మాడ పుష్పలత గారు తమ అభిప్రాయాన్ని "సోది" రూపంలో వినసొంపుగా చెప్పారు. యాత్ర యావత్తు ఆద్యంతం ఏదో అనుభూతి అంటూ పుష్పలత గారు బమ్మెర మూడు అక్షరాలు, పోతన మూడు అక్షరాలు కాని దర్శించిన అనుభూతిని వర్ణించడానికి అక్షరాలు సరిపోవని అభివ్యక్తం చేశారు. పాలకుర్తి గుట్ట ఏ ఆకారంలో ఉందో అందులో నెలకొన్న సోమేశ్వరుడు కూడా అదే ఆకారంలో ఉండటం చూసి ఏమి నా భాగ్యము అంటూ స్వామిని అభిషేకించినట్లు సాహితీ మూర్తి కమలేకర్ శ్యాం ప్రసాద్ రావు నుతించారు. సభాపతి చంద్రమౌళి సుస్వర వేద పఠనంతో అభిషేక అర్చనాది క్రతువులలో అలరిస్తూ, సాహితీ సుగంధ తరువుల సహవాసాన్ని పొందిన మా మనసులు పరిమళించాయని తమ అనుభవాన్ని వ్యక్తం చేశారు. ఇలా అందరి వ్యాసాల్లోనూ వారి యాత్ర స్మృతులను ఎన్నింటినో వ్యక్తపరిచారు. వ్యాస విస్తరణ భీతి చేత అందరినీ ఉటంకించలేకపోతున్నాను. వారి మధురానుభూతులను కర్పూరరాశిగా కుప్పబోశారు. అవి వెదజల్లుతున్న సుగంధ ద్రవ్యాల పరిమళాలు ఎన్నో!. అనారోగ్యంతో ఉన్నా అమ్మ మీద భారం వేసి ఆసక్తితో వచ్చిన కట్టా గిరిజా రమణ శర్మ జ్ఞానపథం శీర్షికన రాసిన వ్యాసంలో అమ్మలగన్నయమ్మ తానే మిగతా గ్రంథం నడిపించింది అంటూ చారిత్రక, సాంస్కృతిక, ప్రదేశాలను వాటి ఆనవాళ్లను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, వాటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, ఫోటో వీడియో చిత్రీకరణ తదితర వ్యవహారాలన్నీ ఆయనే నిర్వహించారు. వరంగల్ లోని రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాష నిలయంలో అంపశయ్య నవీన్, డి. సాంబమూర్తి, బన్న అయిలయ్య, నాగిళ్ల రామశాస్త్రి, వీ.ఆర్ విద్యార్థి, ప్రభృతుల సందేశాలను అనుభవాలను వినడం గొప్ప అనుభూతిగా వివరించారు. మొత్తం 184 పుటలు గల గ్రంథంలో వారు సాహితీ యాత్రలో ఆలపించిన పద్యాలు, గేయాలు, కవితలు, పత్రికలలో వచ్చిన వార్త కదంబం, చివరన వివిధ ప్రదేశాలలో దిగిన ఫోటోలను అచ్చు వేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని భాషా పండితులకు ఈ గ్రంథం ఒక చక్కని కరదీపిక కాగలదు. భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యాభిమానులకు వీరి యాత్రాస్మృతి విలువైన పురస్కృతి అని చెప్పవచ్చు.

దీని స్ఫూర్తిగా మరెంతోమంది భాషాభిమానులు ఇలాంటి యాత్రలకు పూనుకుంటారని ఆశిద్దాం. అందుకు ముందడుగు వేసిన పాలమూరు పండితులకు అభినందనలు..



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# తెలంగాణ కవిత్వం: సంప్రదాయ స్వరాలు, నవ్య ప్రయోగాలు




కొండపల్లి గోపాలరావు సంప్రదాయరీతిలో రచనలు చేసిన పండితకవి. హరి రామలింగశాస్త్రితో కలిసి జంటగా రచనలు చేయడం వీరి కవిత్వంలో సహసృజన సంప్రదాయాన్ని సూచిస్తుంది. బ్రతుకు అనే గేయం వీరి భావనవ్యత (సూక్ష్మ భావవ్యక్తీకరణ) సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ కవిత సంప్రదాయాన్ని ఆధారంగా తీసుకున్నప్పటికీ, వ్యక్తిగత అనుభూతులను సహజమైన భాషలో ప్రతిపాదించడం దీని ప్రత్యేకత. బెల్లంకొండ చంద్రమౌళి (ఖమ్మం) సంప్రదాయ కావ్యరీతిని, ఆధునాతన కవిత్వ పద్ధతులను సమన్వయపరిచిన కవి.వీరి రచనలలో పూర్వకవుల అలవాటు అయిన ఛందో బద్ధత ఉన్నప్పటికీ, భావనలో సమకాలీన దృక్పథం ప్రతిబింబిస్తుంది. ఇక దాశరథి కృష్ణమాచార్యులు కవి తెలంగాణ జాతీయోద్యమ కవిత్వంలో అభ్యుదయ ధోరణి ప్రతినిధి. ప్రారంభంలో తలనిండా పూదండ వంటి భావగేయాలను రాసినా, అనంతర కాలంలో ఉద్యమ స్ఫూర్తి ప్రధానమైన కవిత్వం వైపు పయనించారు. వీరి స్వతంత్ర బాణీ, సంస్కృత పదబంధాలు, సుదీర్ఘ సమాసాలు, వాడుక భాషా పదాల సమ్మేళనం ద్వారా ఆకట్టుకుంటుంది. "ప్రణవంలో త్రివర్ణాలు" అనే కవితలో సంప్రదాయ దేవతల స్థానంలో ప్రజలను నిలిపి నమస్సులు పలకడం, ఒక నూతన సంకేత రూపకల్పన. అక్షరాలను సంకేతాలుగా ఉపయోగించారు. ఉదాహరణ కు అ అంటే అంధకారం, ఉ ఉడుపులు, మ మండే కాగడా ం వీరి రూపకాల సృజనాత్మకతకు ఉదాహరణ. మాత్రాఛందస్సు, ముక్తఛందం రెండింటినీ సమర్థంగా ఉపయోగించారు. సిండికేట్లు, ఉగ్రవాద దగ్నబాధ, బిచ్చెపుగుండె, అడవిజడ, వెన్నెలజ్వాల, దాబుసరీ సమాజం, హిస్సావు, గ్రూపులు ట్రూపులు వంటి పదప్రయోగాలు, వీరి కవిత్వానికి కాలానుగుణ సామాజిక సందర్భాన్ని ఇస్తాయి. వీరి కవిత్వం ఉద్యమస్ఫూర్తి, ప్రకృతి అనుభూతి, భావుకతల సమ్మేళనం.మారుగొండ నరసింహదాసు పురాణ ఇతివృత్తాలను గ్రహించి, సమకాలీన సామాజిక దురాచారాలను విమర్శించారు. మాసశతకం, భజనకీర్తనల ద్వారా సంప్రదాయస్ఫూర్తిని కొనసాగించారు. ఇంకోక రు చదలవాడ నాగరత్నమ్మ (వరంగల్) భావకవితా పద్ధతిలో, మాత్రాగణబద్ధతతో, దేశీయ పలుకుబడి ఆధారంగా రచనలు చేసిన కవయిత్రి. శ్రీ రత్నగీత ఖండకావ్యం వీరి ప్రాధాన్యకృతి.ఇది పాటల రూపంలో పాడుకోవడానికి అనువుగా,భక్తి భావోద్రేకం తో రూపుదిద్దుకుంది.

**తెలంగాణలో సాహిత్యసేవకులు**

తెలంగాణలో సాంస్కృతిక వికాసానికి తోడ్పడిన ప్రముఖులలో భాగి నారాయణమూర్తి ఒకరు. విద్యార్థి దశ నుంచే గేయఖండకావ్యాల రచన ప్రారంభించి, భక్తికవితా పద్ధతి నుండి అభ్యుదయ కవితా రీతుల వరకు విస్తృతంగా సృజించారు. వీరి రచనల్లో ధ్వని ప్రధానత ప్రత్యేక లక్షణం.ప్రతీ గీతం అంతర్గతంగా సామాజిక స్పృహను మేల్కొలుపుతుంది. వీరి రచనల్లో ఆరాధన, స్వాహా, ఛివక్కు వంటి గేయాలు విస్తృతంగా ప్రసిద్ధి చెందాయి. సమాజంలో నెలకొన్న అన్యాయం, అల్లర్లు, అసమానతలను నిరసిస్తూ, సామరస్యాన్ని బోధించే ఖండికలు వీరి రచనల్లో అధికంగా కనిపిస్తాయి. వీరు వాడిన రూపకాలలో "పంటకు వచ్చిన పైరు", "నీరుదిగని నీలం", "తుమ్మపూల తురాయి" (కరువు నొప్పి సూచనగా) వంటి నూతన దృశ్యకవితా ప్రయోగాలు ఉన్నాయి."తేనెలు పిండే తెలంగాణ, నెత్తుట ముంచెత యెదరా?" అనే ప్రశ్నారూపకంలో ప్రాంతీయ వనరుల దోపిడీపై ప్రతిఘటనను, సామాజిక ప్రతిస్పందనను స్పష్టంగా చూడవచ్చు. మరో కవి పుల్లయ్య సెట్టి కార్తిక (మహబూబ్‌నగర్) సాహిత్యపోషకుడిగా, సాహిత్య నిర్మాతగా పేరు పొందారు. రసిక జనమనోరంజనం అనే గేయసంపుటి వీరి ప్రధాన కృతి. ఇందులో శృంగారరస ప్రధానమైన జావళీలు మరియు మంగళహారతులు సుమారు 46 వరకు ఉన్నాయి. ప్రతి జావళీ చివరలో కర్త పేరు సూచించడం, ఆ కాలపు సాహిత్య సంస్కారాన్ని ప్రతిబింబిస్తుంది. తెలుగులో ప్రత్యేకంగా లభిస్తున్న జావళీ సాహిత్యంలో రసిక జన మనోరంజనం ఒక విలువైన సంపుటిగా విమర్శకులు గుర్తించారు. ఇది సంగీతరసికుల ఆనందానికి, శృంగారరస అభివ్యక్తికి, మరియు గేయరూప సౌందర్యానికి సాక్ష్యంగా నిలుస్తుంది.

**సాహితి మేఖల భావకవులు-భార్గవరావు సిరిప్రెగడ, మల్లయ్యకవి పల్లె**

తెలంగాణలో సాహితి మేఖలకు చెందిన భావకవులలో ప్రముఖులైన భార్గవ రావు సిరిప్రెగడ (నల్లగొండ) సంప్రదాయ కవితా పద్ధతులను అనుసరించి రచనలు చేసినవారు. వీరి ఖండ కావ్యాలలో స్వప్నసుందరి (1939), మధురపథము ముఖ్యమైనవి. ఇతివృత్త పరంగా వీరి కవిత్వం సంప్రదాయబద్ధమైన నిర్మాణాన్ని కలిగి ఉంది.భాషా వినియోగంలో సంస్కృతపదాల ప్రాబల్యం అధికం. సుందరోహ్వాకరంబతా, నందగగనయానం, తుషారమంజరులు, మందానందవాయూర్మికలు వంటి సుదీర్ఘ సమాసాలు వీరి కవిత్వానికి ప్రత్యేక శైలి మరియు గాంభీర్యాన్ని అందించాయి. వీరి రచనల్లో సమత్వ (సౌందర్య సమతుల్యత) మరియు ఓజోగుణం (ఉత్సాహభరిత శక్తి) రెండూ ప్రతిఫలిస్తాయి. సంప్రదాయ రీతులను కొనసాగించిన మరో కవి మల్లయ్యకవి పల్లె (నల్లగొండ). వీరి రచనల్లో శంభులింగ శశికళ, రామచంద్ర నక్షత్రమాల ప్రధానమైనవి. వీటిలో సీసపద్య నిర్మాణం (నియమిత ఛందోబద్ధతతో కూడిన కవిత్వరూపం) స్పష్టంగా కనిపిస్తుంది. సీసపద్య శైలిలో భావప్రకటన చేస్తూ, పౌరాణిక ఇతివృత్తాలను, సాంప్రదాయ సాహిత్యపద్ధతులను కాపాడటంలో మల్లయ్యకవి ప్రత్యేక ప్రతిభను ప్రదర్శించారు.

**సాధనసమితి, ఇతర ప్రముఖ భావకవులు**

బూర్గుల రంగనాథ రావు సాధనసమితి సభ్యులుగా, అలాగే ఆంధ్ర సారస్వత పరిషత్ (హైదరాబాద్) స్థాపకులలో ఒకరిగా బూర్గుల రంగనాథరావు తెలుగు సాహిత్య చరిత్రలో ముఖ్యమైన స్థానం సంపాదించారు. వీరి గేయాలు లయాత్మకతతో పాటు వాడుకభాషలో సరళతను కలిగి ఉన్నాయి. ప్రధాన ఇతివృత్తాలు ప్రేమ మరియు దేశభక్తి. వీరి రచనల్లో "యాది", "శ్రుతియించె", "కాలాహి" వంటి ప్రయోగాలు భాషా వైవిధ్యాన్ని, భావప్రత్యేకతను చాటుతాయి. సాంప్రదాయ భావనకు ఆధునికతను జోడిస్తూ వీరు గేయరచనలో ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు.గార్లపాటి రాఘవరెడ్డి (వరంగల్) మార్మిక ఛాయవాద కవిత్వం పట్ల ఆకర్షితుడైన గార్లపాటి రాఘవరెడ్డి సావిత్రి (ఖండకావ్యం), రతివిలాసం (ఖండకావ్యం) వంటి రచనలతో ప్రసిద్ధి చెందారు. వీరి రచనాశైలి విలక్షణతతో కూడినది. సంస్కృత పదాలను దేశీయ పదాలతో సమతూకంగా మేళవించడం వీరి భాషా శక్తికి నిదర్శనం. గేయరచనలో మాత్రాచందస్సు మరియు మిశ్రగతి భేదం వినియోగం వీరి సాహిత్య నైపుణ్యాన్ని సూచిస్తుంది.సుకరనేని రాజమౌళి (వరంగల్) విజయవిలాసం, చిత్రాంగద పరిణయం వంటి కావ్యాల నుండి ఆయా ఘట్టాలను తీసుకొని ప్రత్యేక కావ్యాలుగా రూపొందించారు. వీరి కవిత్వంలో పూర్వకవుల ప్రభావం స్పష్టంగా కన్పిస్తుంది. పద్యరచనలో ప్రౌఢత, శబ్దాలంకారాల సమృద్ధి ప్రధాన లక్షణాలు.రాజయ్య పరమారాధ్యులు (కరీంనగర్) ప్రజాకవిగా ప్రసిద్ధులు. సిద్దిపేట మహిళల కోరిక మేరకు బతుకమ్మ పాటలు రచించడం వీరి సామాజిక అనుబంధాన్ని తెలియజేస్తుంది. వీరి రచనల్లో వాడుకభాషా సరళతే ప్రధాన లక్షణం. వాక్యారంభంలో "యెవడు", "యేది" వంటి పదరూపాల వినియోగం వీరి శైలికి ప్రత్యేకతను అందించింది.

**ప్రజాకవులు, సంస్కరణాభిలాషులు, సంగీత-సాహిత్య కవులు**

రాజయ్య పరమారాధ్యులు (కరీంనగర్) వీరు ప్రజాకవిగా ప్రసిద్ధి.వీరు మత్స్యపురాణం ఆధారంగా సులభ శైలిలో రచనలుబీ పరుశరామ విజయం (యోగాన నాటక బాణీ), బతుకమ్మ పాటలు, వీరచద్ర విజయం (నాటకం), మల్లికార్జున చరిత్ర (హరికథ) రచనలు చేశారు.దీనిలో వాడుకభాష ప్రాధాన్యంబీ వాక్యారంభంలో "యెవడు", "యేది" వంటి పదరూపాల వినియోగం ఉంది.రాజేశ్వరరావు అట్లూరి (వరంగల్) స్వాతంత్ర్య చైతన్యపు తొలి కవులలో ఒకరుబీ సంస్కరణాభిలాషి.వీరిది విశిష్టాద్వైత ధోరణి.వీరు రాజకీయాలు లేదా ఉద్యమాలతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, సమకాలీన సంఘటనలకు స్పందించి కవిత్వం రాశారు.రామానుజరావు పందరి (మెదక్) గారు సంగీతం-సాహిత్యం సమతూకానికి సమాన ప్రాధాన్యం ఇచ్చారు.వీరు "మేటి తాళగాని మెప్పుకు సరి అయిన పాత్రల గమనించి కవిత నల్లగల్లు కవి" అని ప్రశంసించబడ్డారు.పోట్లపల్లి రామారావు (వరంగల్) రచనలలో వాడుక మాటలు, దేశిపదాల అధిక వినియోగం ఎక్కువ గా ఉంటుంది.వీరి గేయాలు అన్ని మిశ్రగతిలో ఉంటాయి.లక్ష్మీకాంతకవి మేడేపల్లి (హైదరాబాద్) కాల్పనిక కవిత్వ ధోరణిలో కవిత్వం రాశారు.వీరి రచన నా కవసము (ఖండకావ్యం).లక్ష్మీ నరసింహ రాజు అంబలి (వరంగల్)ఆశుకవి. వీరు పాండిత్యాన్ని పండిత శుశ్రూషతో పెంపొందించుకున్నాడు.వీరి రచనలు అర్జునాభ్యుదయం, కర్ణాభ్యుదయం ం ప్రౌఢ సంప్రదాయ ధోరణిబీ రామరాజభూషణుని ప్రభావం.వీరు పద్యరచనలో శ్లేష, చమత్కారంబీ వచనంలో వ్యవహార రీతికి దగ్గరగా భాషగా రచనలు చేశారు.వీరి రచనల లో మాండలికాలు, అందమైన పలుకుబడులు కనిపిస్తాయి.వానమామలై వరదాచార్యులు (వరంగల్) పద్యం, గేయం, నాటిక, నాటకం, వచనకవితఈ ఐదు ప్రక్రియలలోనూ ప్రతిభ కనబర్చిన బహుముఖ కవి.వీరు పదమూడేళ్ల వయసులోనే కవిత్వం ప్రారంభించారు.వీరి రచనలలో మత సామరస్యం, జాతీయ భావన, సమసమాజ స్థాపన పట్ల గాఢ తపన కనిపిస్తుంది. తెలంగాణలో "దొరల" అఘాయిత్యాలు, వారి దాష్టీకం, అమాయక ప్రజల జీవన దుస్థితి ం ఈ అంశాలను మణిమాలలో సహజంగా చిత్రించారు.వీరి సామాజిక విమర్శ మణిమాల. అలాగే సాంప్రదాయిక నాటకం వైశాలిని, వీరి రచనలు సంప్రదాయ శైలికి ప్రాధాన్యం, కానీ పదబంధాలలో లలితత్వం కనిపిస్తుంది. భాషా-శైలిలో మాధుర్యగుణం, లలిత పదబంధాలు ఉన్నాయి.సంస్కృతపదాలతో పాటు ప్రజా భాషలోని తెలుగు మాటలు రచయిత వాడారు. వీరి రచనలలో మాదువిక్ష, ఆకాశపు గడియారం, రేడియో మోరలు, జోషి, ఆటమ్ము బాంబులు వంటి పదాలున్నాయి.

**తెలంగాణ ఆధునిక సాహిత్య ప్రవాహం**

తెలంగాణ కవులలో సంప్రదాయరీతిని అనుసరించిన కవులలో ఒకరు గోపాల రావు కొండపల్లి. వీరు హరి రామలింగశాస్త్రితో కలిసి జంటగా రచనలు చేశారు. వీరి రచనలలో బ్రతుకు గేయం సంప్రదాయం, భావనవ్యతి కలిపిన గేయం.చంద్రమౌళి బెల్లంకొండ (ఖమ్మం) సంప్రదాయ రీతిలోనూ, ఆధునిక కవిత్వ శైలిలోనూ ప్రతిభ కనబరిచారు.అభ్యుదయ ధోరణి కవులలో దాశరథి కృష్ణమాచార్యులుస్వతంత్ర బాణీతో కవిత్వం రాశారు.వీరు మొదట భావగేయాలు (తలనిండా పూదండ) రాశారు.తరువాత అభ్యుదయ కవిత్వం వైపు మళ్లారు.వీరు సంస్కృత పదబంధాలను వాడుక పదాలను సమానంగా వాడారు.కవితలో వినూత్న సంకేతాలు (ఉదాహరణ -ప్రణవంలో త్రివర్ణాలు) ఉపయోగించారు.వీరి రచనలలో మాత్రాఛందస్సు, ముక్తిచ్ఛందం,



డా. ఐ. చిదానందం
తెలుగు ఉపన్యాసకులు
వెల్దండ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి - 8801444335

## ఏ విలువల కోసం?

కమండలం మంత్రదండం
మంత్రజలంతో శాపాలు!
ఇవేగా మీదగ్గర ఉన్నవి!
ఒక్కముక్క సైన్స్ తెలీదు!

ఆ సాధనాలన్నీ సైన్సే
అది'శాపశాస్త్రం'అనగల
ఉద్దండ పిండాలు మీరు!
ఆ ధైర్యం మీకేసొంతం!

దేశం ఏ మూల వెతికినా
ఏమున్నది గర్వకారణం!
రాజుదైవాంశ సంభూతుడు
బ్రాహ్మణో మమ దేవతా!

సూద్రదళితుల్ని భయపెట్టి
చాకిరీలు చేయించుకోవాలి!
అందుకే ఎక్కడా లేనట్టి
అబద్ధాలాన్నీ మీ సొంతం!

మన దేశానికి జరిగిన నష్టం
విదేశీ దండయాత్రలతో కంటే
స్వదేశీ మనువాదం తోనే!
ఇప్పటికీ అదే ప్రధాన శత్రువు

పాలకులరా!ఇంక ఆపండి!
ప్రపంచం చూసి నవ్వుతోంది!
ఇంత చారిత్రక మోసం
భారతీయులకే ప్రత్యేకం!

మనిషి 'స్పే స్'లో విహరించి
తిరిగి వచ్చిన కాలం యిది!
మీ ధూపదీపాదులు కట్టిపెట్టి
వాస్తవంలోకివచ్చిచూడండి!

తిండి గుడ్డ నీడ విద్య వైద్యం
ఉద్యోగాలసంగతి చూడండి!
గుళ్ళనిర్మాణం భజనలు...
ఏ విలువలకోసమోచెప్పండి!



-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# కృష్ణ మండలంలోని అసైన్డ్ భూములను రక్షించండి

- జిల్లా కలెక్టర్‌కు బిజెపి వినతి పత్రం

**కృష్ణ, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా లోని కృష్ణ నది పరివాహక ప్రాంతం కృష్ణ మండలం పరిధిలోని మురహరి దొడ్డి, గురజాల తదితర గ్రామాల్లో ఆక్రమణకు గురి అవుతున్న అసైన్డ్ భూములను రక్షించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ కృష్ణ మండలం బిజెపి నాయకులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కు వినతి పత్రం సమర్పించారు. 1988లో ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించిన అసైన్డ్ భూముల్లో గతంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. గురజాల గ్రామంలో సర్వే నెంబర్ 24, మురహరి దొడ్డి గ్రామంలో సర్వే నంబర్ 169 లోని ప్రభుత్వం భూమిని 1997 అప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై డబ్బు పరపతి ఉపయోగించుకొని ఉమ్మడి ఆంధ్రకు చెందిన మండవ లక్ష్మీనారాయణ మాజీ ఐజి పోలీస్ అధికారి అక్రమ దారులు ఉపయోగించి రికార్డులన్నీ తారుమారు చేశారనీ అన్నారు. అసలు ఈ ప్రాంతానికే చెందనీ స్థానికేతురులైన తన బినామీల పేరిట పట్టాలు ఇప్పించారనీ తెలిపారు. స్తానికేతురులైన వీరి బినామీలు అక్రమంగా యజమాన్య హక్కు ను కల్పించుకొని చట్ట విరుద్ధంగా



ఈ ప్రభుత్వ భూమిని అనుభవిస్తూ, అసలైన నిరుపేద రైతుల పొట్ట కొట్టి, కోట్లకు కోట్లు కూడగట్టుకున్నారనీ ఆరోపించారు. ఇదే కాకుండా ఓ అగ్రవర్ణాల కులస్తుడైన ఓసి, స్థానికేతరుడైన ఆంధ్రకు చెందిన యు పవన్ కుమార్ అనే వ్యక్తికి ఒకే మండలంలో రెండు వేరు, వేరు గ్రామాల్లో ప్రభుత్వ భూమి పొందడం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు, చట్ట విరుద్ధం వారు కనీసం కాస్తూలో కూడా లేరనీ కేవలం రికార్డులో మాత్రమే అక్రమంగా వారీ పేరు పొంది ఉన్నారు. అక్రమ వలస దారులకు స్థానిక పోలీసులు వత్తాసు పలకడమే కాకుండా తిరిగి అన్యాయానికి గురైన బాధిత రైతులపైనే అక్రమ కేసులు బనాయించి రైతులను జైలుకు పంపిస్తున్నారనీ మండి పడ్డారు. వీళ్లైతే జైలుకు పంపించడం, లేదంటే ఎమ్మార్వో ముందు బైండోవర్ చేసి నిజమైన రైతులను కాస్తు నుంచి తప్పించుటకు స్థానిక కృష్ణ పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులే మాజీ ఐజి బినామిలకె వత్తాసు పలుకుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ పోలీస్ అధికారుల చర్యలను మెము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకుని అతి త్వరలో నిజమైన అర్హులైన ఆ నిరుపేద రైతులకు యజమాన్య హక్కు పట్టాదారు పాసు బుక్కులు జారి చేయాలని తగు న్యాయం చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు జి బలరాం రెడ్డి, బిజెపి ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లే నరసప్ప , జిల్లా నాయకులు మజ్జిగ సురేష్, వాకిటి మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి దండు, రాఘవేంద్ర, కరిమని తిమ్మన్న, ఉపాధ్యక్షుడు డికె. కిష్టప్ప, నాయకులు వడ్ల మారెప్ప, గుంతల హన్మంట్రాయ, సి. మహదేవ్, కట్ల తాయప్ప, జే నర్సింగప్ప, కే. ఆంజనేయులు, శక్తి సింగ్, బి. శంక్రప్ప, చిట్టి సురేష్, బి. శశిధర్, బుర్ర తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టం రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి




**చేర్యాల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ వద్ద తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో వరి, పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కత్తుల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాల వల్ల వరి,మొక్కజొన్న,పత్తి, కంది,మొదలగు పంటలు మొత్తం దెబ్బతిని రైతులందరూ నష్టపోయారు. అందువల్ల నష్టపోయిన రైతులకు వెంటనే క్షేత్రస్థాయిలో మండల వ్యాప్తంగా అధికారులు పంటలను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేల పరిహారం వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, ఎల్లవ్వ, మల్లవ్వ, లక్ష్మి, రమేష్, నర్సింలు, కనుకయ్య, మల్లేశం, ప్రశాంత్, రవి, పంట నష్టపోయిన రైతులు పాల్గొన్నారు.

## సురవరం ఆశయాలను కొనసాగిస్తాం




**మానవపాడు, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** సురవరం ఆకాశమంత ఎత్తుకు ఎదిగి అస్తమించడని సంస్కరణ సభలో పాల్గొన్న వక్తలు అన్నారు. సోమవారం ఉండవెల్లి మండలం.. కంచుపాడు గ్రామంలో సురవరం విజ్ఞాన కేంద్రంలో ఈ సభ ఏర్పాటు చేశారు. వామపక్ష ముఖ్య నాయకులు చాడ వెంకటరెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, అలంపూర్ మాజీ శాసనసభ్యుడు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్, హాజరయ్యారు. సురవరం ఖ్యాతిని నేటి తరానికి తెలిసేలా రేవంత్ సర్కార్ సూచనలు తీసుకుంటుందని సంపత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సురవరం కుటుంబ సభ్యులు, మరియు ఉండవెల్లి మండలం సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు సురవరం లోకేశ్వర్ రెడ్డి, మరియు వేరువేరుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్య చారి, మాజీ సర్పంచు శేషన్ గౌడ్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చైర్మన్లు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీజీపిఎస్‌సి గ్రూప్ 1, 2, 3, 4 ఆర్‌ఆర్‌బి, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలకు శిక్షణను సోమవారం కలెక్టర్ ప్రారంచారు. ఈ సందర్భంగా అభ్యర్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీజీపి ఎస్ సి గ్రూప్స్ పరీక్షలు, ఆర్‌ఆర్‌బి బ్యాంకింగ్, పరీక్షల కు పోటీపడే నిరుపేదల కోసం ఉచితంగా శిక్ష ఆనందిస్తున్నదన్నారు. నైపుణ్యం గల శిక్షకుల సహాయంతో నాణ్యమైన స్టడీ మెటీరియల్ సైతం అభ్యర్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ అధ్యాపకులు చెప్పే విషయాల పై పూర్తి పట్టు సాధించాలన్నారు. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించే అలవాటుతో పాటు తమ జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే పోటీ పరీక్షల్లో రాణించగలుగుతారని ఏదైనా విషయాలలో సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. అన్ని పోటీ పరీక్షలకు కామన్‌గా ఉండే జర్నల్ నాలెడ్జ్, కరెంట్




అఫైర్స్‌పై అభ్యర్థులు పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ ఎకనామి, పోలిటి, మెంటల్ ఎబిలిటీ టి అంశాలను క్షుణ్ణంగా చదవాలని అభ్యర్థులకు సూచించారు. ఈ శిక్షణలో అభ్యర్థులు అన్ని రంగాలలో నైపుణ్యం సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆకారపు జగదీష్, ఏ డి సర్వే ఇనేష్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీ లించి సిబ్బంది హాజరు రిజిస్టర్ మందుల స్టాక్ రిజిస్టర్ ను చూశారు. ఓపి, జనరల్ వార్డులను పరిశీలించి వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రి సేవలను గురించి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణ, బెడ్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి

**కాప్రా, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూములు కాపాడాలంటూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ నాయకులు బూడిద ప్రేమ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన



మాట్లాడుతూ చిన్న చెర్లపల్లిలో సర్వేనెంబర్ 288లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గతంలో కాప్రా ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. కానీ అక్రమ నిర్మాణాలు ప్రభుత్వ భూమి చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని వెంటనే అట్టి భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని ఆయన డిమాండ్ చేశారు. 48 గంటల్లో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని లేని పక్షంలో తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తారని ఆయన అన్నారు. వెంటనే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ స్పందించి చిన్న చెర్లపల్లి లోని సర్వే నెంబర్ 288 లోని ప్రభుత్వ భూమిని కాపాడి అక్రమార్కులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని బూడిద ప్రేమ్ కుమార్ గౌడ్ కోరారు.

## కడ అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకుండా పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**కొడంగల్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** కడ అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకుండా పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కడ అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ కడ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల బడ్జెట్ ను కేటాయించి నీధులు మంజూరు చేయడం జరిగింది అన్నారు. మంజూరైన పనులకు ప్రొసీడింగ్స్ ఇచ్చినప్పటికీ పనులు మొదలు పెట్టకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం కాకుండా జాప్యం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి పనులు చేసే క్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలతో పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో చేపట్టవలసిన మోడ్రన్ టాయిలెట్‌ల నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కేజీబీవీ లలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సౌకర్యవంతగా ఉండేందుకు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో



ముందస్తుగానే ఇరిగేషన్, విద్యుత్తు, మిషన్ భగీరథ, అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పనులకు పూనుకోవాలని కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీలో చేపట్టే పనులు నాణ్యతతో ఆదర్శంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్‌ఇ శ్రీనివాస్ రెడ్డి , ఇఇ సత్యనారాయణ రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఇఇ రవి కుమార్, జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్ , మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ లతో పాటు ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించాలి

- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే. రామస్వామి




**చేవెళ్ల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే.రామస్వామి అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంలో చేవెళ్ల మండల పరిధిలోని న్యాలట గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 240 లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇల్లు లేని నిరుపేదలకు పంచాలని తాసిల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామన్నగూడ, న్యాలట సింగప్పగూడ గ్రామాలలో చాలామంది నిరుపేదలకు ఇండ్లు లేవు 240 సర్వే నెంబర్ లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో కొంతమంది నిరుపేదలకు ప్లాట్లు చేసి ఇచ్చారు కానీ కొంతమంది భూ బకాసురులు ఆ భూమిని కబ్జా చేశారు కొంతమంది రాజకీయ నాయకులు ప్లాట్లను క్రయవిక్రయాలు చేశారు. కాబట్టి ప్రభుత్వము అధికారులు చొరవ తీసుకొని కబ్జాకు గురి అయిన ప్లాట్లను ఆ గ్రామాలలో ఉండే నిరుపేదల అందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, ఎన్ఎఫ్ఐ డబ్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, గీతా పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణ గౌడ్ రామన్నగూడ గ్రామ శాఖ కార్యదర్శి పాపయ్య, ఏఐటియుసి మండల అధ్యక్షుడు శివ, నన్ చేరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్క రించాలని, ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్లో ఉంచరాదని, ప్రజలకు తక్షణమే న్యాయం అందించి పోలీస్ వ్యవస్థ పై నమ్మకం భరోసా కలిగేలా విధులు నిర్వర్తిం చాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ప్రతి సోమ వారం జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా సోమవారం ఉదయం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 7 మంది ఫిర్యాదులను. ఎస్పీ పరిశీలించి సంబంధిత పోలీ స్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి



ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తగిన సలహాలు సూచనలు చేశారు.. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫైర్ నమోదు చేయాలని తదుపరి కేసు విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూ తగదాలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత రెవెన్యూ అధికా రులతో కలిసి సమన్వ యంతో పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తప్పకుండా రసీదు, ఎఫ్ ఐ ఆర్ కాఫీ ఇవ్వాలని పోలీసు అధికా రులకు తెలిపారు. జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా భద్రత కల్పించాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.

## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగిన అండర్ 17 వుడ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ పోటీలలో మొదటిస్థానంలో బంగారం పథకం విజయం సాధించిన రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇబ్రహీంపట్నంలో వాసవి జూనియర్, ఒకేషనల్ కళాశాల క్రీడాకారులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి బంగారు పతకాలతో క్రీడాకారులను సన్మానించారు. తదుపరి క్రీడాకారులతో మాట్లాడుతూ చెడు వన్యాసాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి విద్య సంస్థల చైర్మన్ మదారం రమేష్, సీనియర్ అధ్యాపకులు సుధాకర్, సురేష్, తెలంగాణ వుడ్ బాల్ కో . ఆర్డినేటర్ రహమత్, క్రీడాకారులు కిరణ్, రాజేష్, మహేష్ , చరణ్, ధ్రువ చరణ్, అబ్దుల్ రెహమాన్, చంద్ర శేఖర్, జావిద్,సమీర్, రామ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కోటకొండలో గణేష్ నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయాలి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** కోటకొండ గ్రామంలో ప్రతిష్ఠించిన భారీ వినాయక విగ్రహాల నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. నారాయణపేట జిల్లా కేంద్రం తర్వాత కోటకొండ గ్రామంలో వినాయక మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు బాలస్వామి వివరించారు. ప్రస్తుతం కోటకొండలో 25 అత్యంత భారీ విగ్రహాలు ప్రతిష్టించామని, వాటి నిమజ్జనం సందర్భంగా ఇబ్బందులు కలగకుండా క్రేన్ సౌకర్యం కల్పించాలని జిల్లా అధికారులను కోరారు. 15 నుంచి 20 ఫీట్ల ఎత్తుగల వినాయక విగ్రహాలు 25 ఉన్నాయని, అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, నిమజ్జనానికి తరలిస్తామని పేర్కొన్నారు. అయితే అత్యధిక బరువు ఉండటం కారణంగా వాటి



నిమజ్జనం సందర్భంలో తొక్కిసలాట జరిగి , ప్రాణాపాయ స్థితి నెలకొనే ప్రమాదం ఉందని అధికారులకు వివరించారు. కోటకొండలో ప్రతి ఏడాది వినాయక మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయని.. ఏడాదికి ఏడాది మరింత శోభాయమానంగా మండపాలను ముస్తాబు చేసి విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా గ్రామం నుంచి చెరువు వరకు నిమజ్జనానికి తరలించే మార్గంలో రోడ్డు గుంతలమయమై, శిథిలావస్థకు చేరిందని, వాటికి మరమ్మతులు చేయాలని కూడా కోరారు. అదేవిధంగా గ్రామంలోని వినాయక మండపాలన సందర్శించాలని కలెక్టర్ మరియు ఎస్పీలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. వీటన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు బాలస్వామి వివరించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లా మాజీ అధ్యక్షులు పగుడాకుల శ్రీనివాసులు ,ఎంగలి నవీన్, ఎంగలి సిద్ధూ , బొక్కి సాయిలు, కొత్తపల్లి తిరుపతి యాదవ్, కోటకొండ గణేష్ ఉత్సవ సమితి నాయకులు గుండెగారి కాశీనాథ్, తీగలి రాజు, కమ్మరి మహేష్, చుక్క గోవిందు, బొల్లు రాము, చర్లపల్లి అంజి, కించే కుమార్, ఎదురింటి కనకప్ప తదితరులు కలెక్టర్ ఎస్పీలను కలిసిన వారిలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
02 సెప్టెంబర్ 2025

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో యూరియా కోసం మరోసారి రైతులు రోడ్డెక్కారు. యూరియా కోసం తెల్లవారుజాము నుంచే ఎరువల విక్రయ కేంద్రం దుకాణం దగ్గర బారులు తీరారు. తీరా అదికారులు వచ్చి యూరియా లేదని చెప్పడంతో పాత బస్టాండ్ దగ్గర బైటాయించి రాస్తారోఖో నిర్వహించారు. అదికారుల నుంచి స్పందన లేకపోవడంతో అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారిపై బాటాయించి రాస్తారోఖో చేపట్టారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డిలు, మాజి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రైతలకు మద్దతుగా నిలిచారు. రైతులను అడిగి సమస్యను తెలుసుకున్నారు. రైతులు పొలాల వద్ద పనులు వదులుకొని యూరియా కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లాలో యూరియా కొరత ఉందని అధికారులకు చెపుదామని బయలుదేరామని.. అంతలోనే పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వద్దకు ర్యాలీగా వచ్చి నిరసన తెలుపుతున్నారని సమాచారం రావడంతో ఇక్కడికి వచ్చామన్నారు. రైతులు పొలాలు, ఇళ్ల వద్ద పనులు వదులుకొని యూరియా పంపిణి కేంద్రాల వద్ద పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం గత 10..15 రోజుల క్రితం అదికారులు టోకెన్ లు ఇచ్చారు కాని యూరియా సరఫరా చిత్తశుద్ధి పెట్టలేదని మండిపడ్డారు. పంట వేసిన 15 రోజుల్లో యూరియా వేయాల్సి ఉంటుందని.. కానీ పంట వేసి నెల రోజులు అవుతున్న ఇప్పటి వరకు వేయలేదని, దీంతో రైతులు పంట నష్టపోతారని అన్నారు. మొదటి విడత అందించే యూరియాకె ఈ సమస్య ఉంటే... మరి రెండవ విడతకు ఇవ్వడం కష్టమేనన్నారు. జిల్లాకు వస్తున్నా యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నట్లు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. లక్షలు పెట్టుబడులు పెట్టి రైతులు పంట వేస్తె యూరియా లేక నష్టపోయే పరిస్థితి ఉందని వాపోయారు. యూరియా కొరత లేకున్నా రాజకీయం చేస్తున్నారని అంటున్నారని మాజి మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. అదికారులు, ప్రజప్రతినిధులు యూరియా కేంద్రల వద్దకు వస్తే వారికి వాస్తవాలు తెలుస్తాయన్నారు. యూరియా అవసరం లేకున్నా రైతులు వస్తున్నారు.. రాజకీయం చేస్తున్నారని అనడం సబబుకాదని హితువు పలికారు. ఆంధ్రాలో కేంద్ర మంత్రులు మాట్లాడి యూరియాను తీసుకువచ్చారని.. ఇక్కడ కేంద్ర మంత్రులు.. ఎంపీ లు ఉన్నారు కదా ఎం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదే నిర్లక్ష్యం ప్రభుత్వం.. అధికారులు ప్రదర్శిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## తాత్కాలిక మరమ్మతుల ద్వారా రవాణాను పునరుద్ధరించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** టేక్మాల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో భారీ వర్షాలు వరద ఉధృతికి దెబ్బతిన్న రోడ్డు మరియు పంట పొలాలను సంబంధిత పంచాయతీరాజ్ ఈ .ఈ నరసింహులు, రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడటం వల్ల ప్రకృతి విపత్తుల నేపథ్యంలో భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని రోడ్లు కల్వట్లు కోతకు గురై రవాణా స్తంభించిందని యుద్ధ ప్రాతిపదికతాత్కాలిక మరమ్మతులు చేపట్టి రవాణాను పునరుద్ధరించే పనిలోఉన్నామన్నారు. శాశ్వత మరమ్మతులు,పంట నష్టాన్ని కూడా అంచనా వేస్తున్నామని నివేదికలు ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు.

# ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందించాలి

- మాత శిశు సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా వర్షాకాలం దృష్ట్యా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు సంచార వైద్య వాహన సేవలు అందుబాటులో ఉండాలని ముఖ్యంగా మాత శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ తెలిపారు. సోమవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ లోని మినీ సమావేశ మందిరంలో పీఎం జన్మన్ సంచార వైద్య వాహన వైద్య అధికారులకు మరియు ఇతర సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ మాట్లాడుతూ, వర్షాకాలంలో గిరిజన ప్రాంతాలకు వెళ్ళే రోడ్లు కట్ అయ్యి రవాణాకు ఇబ్బంది అవుతుంది, కావున గర్భవతులను ప్రసవ తేదికంటే పదిరోజుల ముందుగా అచ్చంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో గల బర్త్ వెయిటింగ్ హోమ్‌లో ముందస్తుగా చేర్చాలని తెలియజేశారు. క్రమం తప్పకుండా ఫీవర్ సర్వే నిర్వహించాలని, అవసరమైన వారికి రక్త నమూనాలను సేకరించి టీ డయాగ్నొస్టిక్ హబ్‌కు పంపాలని వైద్యాధికారులకు సూచించారు. ముఖ్యంగా దోమ కాటు వ్యాధుల, కలుషితమైన నీరు, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు నివారణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్, అచ్చంపేట డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ తారసింగ్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, డిపిఎంఓ మధుమోహన్, ఏఎస్ఓ మల్లికార్జున్, వైద్యాధికారులు, నర్సింగ్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్




**జడ్చర్ల, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** కంట్రిబ్యూటరీ పెన్షన్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ జడ్చర్ల మండల అధ్యక్షులు కారింగి కృష్ణ డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలో వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ జడ్చర్ల పాఠశాలలో జరిగిన నిరసన కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జడ్చర్ల మండల అధ్యక్షుడు కారంగి కృష్ణ మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసిందని, వాగ్దానం మేరకు నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎటువంటి లాభం లేదని రిటైర్మెంట్ అయ్యాక కేవలం నాలుగు, ఐదు వేలు మాత్రమే పింఛన్ వస్తుందని అందువల్ల ఈ నష్టదాయకమైన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. నూతన పెన్షన్ విధానానికి సంబంధించిన పిఎఫ్ ఆర్డిఏ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ఇచ్చిన హమ్మి మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్దరించాలని లేనియెడల ఉపాధ్యాయ ఐక్య కార్యాచరణ కమిటి ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్సులు మన్యం, శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, శివ కుమార్, శ్రీనివాస్ ఆర్య, శంకర్ బాబు, నజీర్, గౌసియా బేగం, శారద, సుమతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

- యూరియా కొరతను తీర్చాలని కలెక్టర్ కు సిపిఎం వినతి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్




**సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూరియా కొరతను వెంటనే తీర్చాలని జిల్లాలో రైతులకు సరిపడా యూరియాను వెంటనే సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో యూరియా కొరతను తీర్చాలని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కు సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. జిల్లాలోని చౌటకూర్, పుల్కల్, అందోల్, వట్టిపల్లి, కొండాపూర్, సదాశివపేట, మునిపల్లి, సంగారెడ్డి, కంది, నారాయణఖేడ్, కల్హేర్ ,సిర్గాపూర్, నిజాంపేట్ మండలాల్లో యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలు పట్టడం లేదని అన్నారు.. రైతుల సంక్షేమ కోరే వాళ్ళైతే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని అన్నారు.. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత ఏర్పడిందని అన్నారు.. ఎరువుల దుకాణాల దగ్గర రైతులు పడిగాపులు కాస్తుంటే ప్రభుత్వాలకు చీమకుట్టినట్టు లేదని అన్నారు. యూరియా కొరతను వెంటనే తీర్చాలని జిల్లాలోని రైతులకు సరిపడాను యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈ కృష్ణ సిపిఎం నాయకులు రమేష్ గౌడ్, సురేష్, మహేష్, మైపాల్, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

- జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 36 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా, కలెక్టరేట్ కార్యాలయం సమావేశమందిరంలో లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు ,పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ,అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి ,డి ఆర్ ఓ పద్మజరాణి లకు విన్నవిస్తూ ఫిర్యాదులను సమర్పించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికివచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా రెవిన్యూ -16 , పౌరసరఫరాలశాఖ 03, డి ఆర్ డి ఓ 04, వివిధ శాఖలకు సంబంధించి 21 మొత్తంగా 44 ఫిర్యాదులు అందాయి. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి గడువులు నిర్దేశించి, ప్రజలకు త్వరితగతిన స్పందించాలన్నారు. ప్రజలకు అండగా నిలబడటం ప్రజావాణి ఉద్దేశమని, ప్రజల సమస్యలను తీర్చడమే పరమ కర్తవ్యమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగికి జీవన భద్రత కల్పించాలి

- నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఉపాధ్యాయులు



**మఖ్తల్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఉద్యోగికి జీవన భద్రత కల్పించాలని మక్తల్ మండలంలోని మంతన్ గోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగి భవిత పట్ల బాధ్యత పడకుండా తప్పించుకునే క్రమంలోనే సిపిఎస్ పెన్షన్ విధానం 2004 లో ముందుకు వచ్చిందని ఈ విధానం వల్ల ఉద్యోగికి సర్వీసు అనంతరం భద్రత లేదు. ఉద్యోగిపై ఆధారపడ్డ కుటుంబానికీ భద్రత లేదు. తన శక్తిని, శ్రమను జీవితాంతం కూడా, ప్రభుత్వానికి, తద్వారా ప్రజలకు కేటాయించిన ఉద్యోగికి తన ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సిన పెన్షన్ అతని హక్కు. ఆ హక్కు ని సాధించుకునే క్రమంలో భాగంగా సిపిఎస్ ని రద్దుచేసి, తక్షణమే ఓపిఎస్ ను పునరుద్ధరించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగికి రావాల్సిన పెన్షన్ ను ప్రభుత్వం 2004 కి ముందులా బాధ్యతగా ఇవ్వాలి. ఇప్పటికే దేశంలో పలు రాష్ట్రాల్లో ఓపిఎస్ విధానం అమల్లో ఉంది. కనుక తెలంగాణలో కూడా సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను వెంటనె పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్ సి నాయకులు సూర్యచంద్ర, వెంకటేష్, అశోక్, గజిటెడ్ ఉపాధ్యాయులు అమీరుద్దీన్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మీ నర్సింహా చారి, సునంద, పరమేశ్వరి, మమత తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించరాదు




**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** శాంతి భద్రతల దృష్ట్యా మహబూబ్ నగర్ జిల్లాలో నేటి నుంచి నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్‌ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని వెల్లడించారు. నిషేదితమైన ఆయుదాలు, కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, తుపాకుల ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం అన్నారు. ఈ సమయంలో లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా నిషేధించడం జరిగిందని.. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు హెచ్చరించారు.

# ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలను నిలబెట్టేది సీపీఆర్

- సీపీఆర్ చేయడం వల్ల బ్రతికే అవకాశలు ఎక్కువ
- హెూప్ న్యూరో అత్యవసర వైద్య నిపుణులు డాక్టర్ రాజేష్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ప్రతి వ్యాధికి కొన్ని ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్స్ ఉంటాయి అవి పాటిస్తే ఒకరి జీవితాన్ని కాపాడవచ్చు. మరి అలాంటప్పుడు అటువంటి ప్రధమ చికిత్సా ప్రక్రియను తెలుసుకోవడం ఎంతో అవసరమని ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలను నిలబెట్టే సీపీఆర్ గురించి అవగాహన అవసరమని సంగారెడ్డి హెూప్ న్యూరో కార్డియాలజీ హాస్పిటల్ అత్యవసర వైద్యులు రాజేష్ అన్నారు. హెూప్ న్యూరో కార్డియాలజీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యా సంస్థల్లో సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు సుమారు లక్షల మందికి సిబిఆర్ విధానం ద్వారా అవగాహన కల్పించాలని లక్ష్యంతో సదస్సులు నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని దిగ్వాల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు సిపిఆర్ విధానం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ...ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలను నిలబెట్టేది సీపీఆర్ పద్ధతే అన్నారు. గుండె సమస్య వచ్చినప్పుడు సీపీఆర్ చేయడం వల్ల బ్రతికే అవకాశఆలు ఎక్కువగా ఉంటాయని ఆయన అన్నారు. ఊపిరి ఆగి ప్రాణం పోవడానికి సెకండ్ కూడా పట్టదు. కాబట్టి ఎటువంటి ఎమర్జెన్సీ అయినా వచ్చినప్పుడు వెంటనే ప్రథమ చికిత్స తీసుకోవడం ఎంతో ముఖ్యం. ఇలా చేయడం వలన మనిషి బ్రతికే అవకాశాలు పెరుగుతాయన్నారు. నేటి సమాజంలోఎంతోమంది చిన్నపిల్లల నుంచి మధ్య వయసు ,వృద్ధుల వరకు సంబంధం లేకుండా హార్ట్ ఎటాక్ తో మరణిస్తున్నారని అన్నారు.ఒక వ్యక్తికి హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న వ్యక్తులు ఆయనను పరిశీలించి నిర్ధారణ చేసుకున్న తర్వాత సిపిఆర్ విధానాన్ని అవలంబించాలన్నారు. అది ఏ విధంగా చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిపిఆర్ విధానంపై అవగాహన ఉన్నవారు గుండె నొప్పి వచ్చిన వ్యక్తిని కాపాడి అంబులెన్స్ లో కానీ అందుబాటులో ఉన్న ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో బూత్కూర్ తలారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు హెూప్ న్యూరో ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సన్నధాన్యం బోనస్ డబ్బులు చెల్లించాలి

- సకాలంలో యూరియా రైతులకు అందించాలి
- కలెక్టరేట్ ముందు ధర్నా అనంతరం వినతి పత్రం



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** ములుగు జిల్లాలోని రైతాంగానికి యూరియా కొరత నివారించాలని, సన్నధాన్యం బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని ములుగు జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అనంతరం కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు అంజద్ భాషా ఆధ్వర్యంలో సోమవారం నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ పాషా మాట్లాడుతూ, ములుగు జిల్లాలోని సన్నధాన్యం బోనస్ డబ్బులు సుమారు 33 వేల క్వింటాల డబ్బులు యాసంగి సందర్భంగా కొనుగోలు చేసిన సన్నధాన్యం బోనస్ డబ్బులు నాలుగు నెలలు గడిచిన నేటి వరకు రైతులకు చెల్లించకుండా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడమే నిదర్శనం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కావాలని యూరియా కొరత సృష్టించి సకాలంలో రైతులకు యూరియా ఎరువులు అందించకుండా, ఆయా పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చట్టం చేయకుండా యూరియా కొరత సృష్టించి రైతులు వ్యవసాయాన్ని భూమిని వదిలి పెట్టేటట్టుగా వ్యవహరించి రైతులను నిరాశకు గురిచేస్తూ మోసం చేస్తుందన్నారు. రైతులు ప్రకృతి దాడిని, ప్రభుత్వ దాడిని ఎదుర్కొంటూ వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకుపోతున్నారన్నారు. కావాలని బిజెపి ప్రభుత్వం కేవలం 11 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే యూరియా ను అందించి ఆయా షాపుల్లో బ్లాక్ మార్కెట్ను సృష్టించి రైతులను దగా చేస్తుందన్నారు. కావున ములుగు జిల్లాలోని సన్నధాన్యం బోనస్ డబ్బులు యూరియాను కొరతను నివారించి రైతులను జిల్లా అధికారులు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని లేనిచో స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెబుతారని ఆయా ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ నిరసన వినతిపత్రం కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు. బానోతు నారాయణ సింగ్, రాజు నాయక్, మంకిడి రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ములుగు వ్యవసాయ మార్కెట్లో అధికారుల మాయాజాలం

- పత్తి కొనుగోళ్లలో అధికారుల గోల్ మాల్
- దళారుల నుంచి క్వింటాలుకు రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు
- పరికరాల కొనుగోళ్లలోనూ అక్రమాలు
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్
- టూమెన్ కమిటీతో కొనసాగుతున్న విచారణ



**ములుగు ప్రతినిధి, సెప్టెంబరు 01(జనంసాక్షి) :** ములుగు వ్యవసాయ మార్కెట్ లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారానే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. రైతులు పండించిన పత్తి కొనుగోళ్ల లో అధికారులు పలు అక్రమాలకు పాల్పడ్డారనే విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన సీరియస్ గా తీసుకొని విచారణకు ఆదేశించారు. విచారణ అధికారులుగా ములుగు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డిపో మేనేజర్ రాంపతి తో టూమెన్ కమిటీని ఏర్పాటు చేసి విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏళ్ల తరబడి వ్యవసాయ మార్కెట్ కు పాలకవర్గం లేకపోవడంతో అధికారులదే ఇష్టారాజ్యం అయింది. రైతులు పండించిన దానికంటే పత్తిని అదనంగా కొనుగోలు చేసినట్లు రికార్డులో నమోదు చేసినట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల నుండి కొనుగోలు చేసిన పత్తిని దళారులు మార్కెట్ కు తీసుకు వచ్చి విక్రయించడంలో క్వింటాల్ పత్తికి రూపాయిలు 200 నుండి 300 వరకు తీసుకొని కొనుగోలు చేశారని విమర్శలు ఉన్నాయి. 2019 నుండి రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు చేపడుతుంది. ములుగు జిల్లాలో 2019 -2020 లో 9489 మంది రైతుల నుండి 2,22,974 క్వింటాల పత్తి క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. 2020 -2021లో 5659 మంది రైతుల వద్ద నుండి 1,36,781 క్వింటాళ్ల పత్తి సీసీఐ ద్వారా కొనుగోలు చేశారు. 2022, 2023 రెండు సీజన్లలో రైతులకు ప్రైవేటు వ్యాపారుల వద్ద ప్రభుత్వ ధర కంటే ఎక్కువగా లభించడంతో సీసీఐ కొనుగోలను నిలిపివేశారు. 2023-2024 సంవత్సరంలో 557 మంది రైతుల నుండి 1,76,128 క్వింటల పత్తిని కొనుగోలు చేశారు. గత సీజన్లో 8,574 మంది రైతుల నుండి 2336 గంటల పత్తిని కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు సమయంలో కేంద్రాలలో వినియోగించే వ్యవసాయ పరికరాలు ఎలక్ట్రానిక్ కాంటాలు, మాయిశ్చర్ మిషన్లు, ప్యాడి క్లీనర్లు టార్పలీన్ కవర్లు, కొనుగోలులో సైతం పలు అక్రమాలకు పాల్పడ్డట్టు తెలుస్తుంది. అధికారుల విచారణలో నిజానిజాలు వెలవడనున్నాయి.

### కలెక్టర్ ఆదేశం మేరకు విచారణ చేపడుతున్నాం

ములుగు ఆర్డీఓ, డిఎం సివిల్ సప్లై ములుగు వ్యవసాయ మార్కెట్ లో పత్తి కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని విచారణకు ములుగు జిల్లా కలెక్టర్ తమను ఆదేశించినట్లు ఆర్డీవో వెంకటేశ్వర్లు, డిఎం రాంపతి తెలిపారు. కొద్ది రోజులుగా విచారణ చేపడుతున్నామని మరో 10 రోజుల్లో ఎంక్వయిరీ రిపోర్టును కలెక్టర్ కు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు.

## ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రిలో 50 శాతం రాయితీతో

# జర్నలిస్టులకు చికిత్స అందించాలి

- జిల్లా కలెక్టర్‌కు టిఎస్ జేయు వినతి



**భూపాలపల్లి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్ట్ కుటుంబాలకు జిల్లాలోని అన్ని ప్రైవేటు,కార్పోరేట్ ఆస్పత్రులు,డయోగ్నస్టిక్స్ సెంటర్ లలో 50శాతం రాయితీ పై వైద్య సేవలు అందించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ టిఎస్ జేయు(తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్) జిల్లా నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిఎస్ జెయు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్‌లు మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రింట్స్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎలాంటి జీతభత్యాలు లేకుండా పనిచేస్తూ అహర్నిశలు ప్రజాసేవకు పాటుపడుతున్నారని అన్నారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమం,అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడం,ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్తూ పరిష్కరించేందుకు అలుపెరుగని కృషి చేస్తున్నారని తెలియజేశారు.ఈ సందర్భంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఎవరైనా అనారోగ్యం బారిన పడితే చాలా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్ట్ కుటుంబానికి జయశంకర్ భూపాలపల్లిలోని అన్ని ప్రైవేటు,కార్పోరేట్ ఆస్పత్రులతో పాటు డయోగ్నస్టిక్స్ సెంటర్లలో 50%శాతం రాయితీతో వైద్య సేవలు అందించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ తరుపున కలెక్టర్ కు విన్నవించుకోవడం జరిగిందని వారు తెలిపారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జెయు జిల్లా ఉపాధ్యక్షులు వలి,గట్టు రవీందర్,జిల్లా సహాయ కార్యదర్శి క్యాతం వెంకటేశ్వర్లు,జిల్లా సంయుక్త కార్యదర్శులు కడపాక రవి,బొచ్చు భూపాల్, బొల్లెపెల్లి జగన్,మారపెల్లి చంద్రమౌళి,యాంసాని రాజు, ప్రచార కార్యదర్శి కారుకూరి సతీష్, క్యాతం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీదారుల దరఖాస్తుల లో పేర్కొన్న సమస్యల పై క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 50 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 09, భూ సమస్యలు 08, ఉపాధి కల్పనకు 05, పెన్షన్ 05, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 23 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పరివాహక మండలాలైన వాజేడు, వెంకటాపురం, ఏటూరు నాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల పరిధిలోని గ్రామాల అధికారులు, ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా పారుతున్న గోదావరి కారణంగా ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని, ఈ నెల 6 తేదీ వరకు జిల్లా లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అందరు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా లో చెరువులు, కుంటల వద్దకు ప్రజలు పశువులను మేతకు తీసుకుపోవద్దని, చేపల వేటకు వెళ్ళవద్దని, ప్రవహిస్తున్న నీటిలో ఈత కొట్టరాదని అన్నారు. జిల్లాలోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న ముందస్తు చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. వర్షాకాలం, వరదల దృష్ట్యా తక్షణ సహాయం కొరకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమయమైయ్యే ప్రాంతాల సమస్య కు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**పరకాల, సెప్టెంబర్ 1 (జనం సాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేతకావడం లేదని, ఆ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టే రోజులు దగ్గరపడ్డాయని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.సోమవారం నియోజక వర్గంలోని ఆత్మకూర్, దామెర, గీసుగొండ మండలాల సమన్వయ కమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో జరిగిన గ్రామ పార్టీ సమావేశాలపై గ్రామాల వారీగా వారు సమీక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, తప్పుడు కేసులు పెట్టే ఎవ్వరినీ వదలబోమని అన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఓటేశామా అని ప్రజలు బాధపడుతున్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 90శాతం బీఆర్ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా వచ్చే స్థానికసంస్థ ఎన్నికల్లో ముందుకుసాగి విజయ కేతనం ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు.ఈ సమావేశంలో ఆత్మకూర్, దామెర, గీసుగొండ మండలాల సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కళా ఉత్సవ్ రాష్ట్రస్థాయి పోటీలకు

# కరీమాబాద్ విద్యార్థి ఎంపిక



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** వరంగల్ నగరంలోని 40 డివిజన్లోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జిల్లా విద్యాశాఖ నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఖిలా వరంగల్ మండలంలోని జేఎస్ఎమ్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలలో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు ఇందులో విజువల్ ఆర్ట్స్ త్రీడి విభాగంలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి టి అక్షయ్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అదేవిధంగా డాన్స్ గ్రూప్లో వైశాలి మరియు అక్షయ తృతీయ స్థానం సాధించారు. క్లాసికల్ డాన్స్ లో సింధుశ్రీ ద్వితీయ స్థానం సాధించినది. గైడ్ టీచర్ కర్ణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు మంచి ప్రతిభను చూపారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఏ.ఎం.ఓ సుజన్ తేజ, ఉల్లాస్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, జిల్లా సైన్సు అధికారి శ్రీనివాస్, ఖిలా వరంగల్ మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు ప్రశాంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను, గైడ్ టీచర్ కరుణ కుమారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రావూరి మాధవి మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్1 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ప్రతి ప్రజావాణి దరఖాస్తును పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు., మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలి అని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ సమీక్షిస్తూ, అధికారులు వరద సమయంలో తీసుకున్న తగు చర్యలను ప్రశంసిస్తూ, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనంగా, వరద నష్ట నివేదికలు సిద్ధం చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచడం, ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక సర్వేను త్వరితగతిన పూర్తి చేయడం, వనమహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయడం, ప్రభుత్వ బడులను ఎప్పటికప్పుడు పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో




**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 01(జనం సాక్షి):** ప్రజలు గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంకు చెందిన కొండ యాకమ్మ తన ఆధార్ కార్డు నెంబర్ ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తప్పుగా పడినదని సవరణ చేయాలని కోరారు. సీరోలు మండలం కాంపెల్లి గ్రామానికి చెందిన రాంపెల్లి రవి తను మన ఊరు - మన బడి కింద రెండు సంవత్సరాల క్రితం ఎలక్ట్రికల్ పని చేసినానని ఆ పనికి సంబంధించి ఇప్పటివరకు ఎం.బి రికార్డు కాలేదని కావున అట్టి పనిని ఎంక్వరీ చేసి ఆ పనిని ఎం.బి లో రికార్డ్ చేయగలరని కోరారు. నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన నాయిని శ్రీపాల్ రెడ్డి తను దీర్ఘకాలిక జబ్బుతో బాధపడుతున్నానని, తనకు వృద్ధ్యాప్య పించను ఇప్పించగలరని కోరారు. ప్రజావాణి లో వివిధ శాఖలకు సంబంధించి 133 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్.పిసీ ఈఓ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, డి.సి.ఓ వేంకటేశ్వర్లు, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, బిసి మైనారిటీ డెవలప్మెంట్ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, సర్వే ల్యాండ్ అధికారి నరసింహ మూర్తి, డి.పి.ఓ హరిప్రసాద్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, జిల్లా ఉపాధి అధికారి రజిత, మెప్మా అధికారి విజయ, ఎల్.డి.యం యాదగిరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరింటెండెంట్ మదన్ మోహన్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న

# గౌరారం వాగు

- కొత్తూరు మోట్లగూడెం, బొంబాయిగూడెం గ్రామాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు...



**మంగపేట సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన జోరు వానకు గౌరారం వాగు ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని కొత్తూరు మోట్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల గౌరారం వాగు ఉధృతంగా ప్రవహించడంతో బొంబాయిగూడెం, కొత్తూరు మోట్లగూడెం గ్రామాలకు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే మండల కేంద్రంలో గౌరారం వాగు పైనున్న బ్రిడ్జి వద్ద వరద ఉధృతి ప్రమాదకరంగా వెళ్లడంతో వెంటనే స్పందించిన అధికారులు ప్రజలెవరు అటువైపు వెళ్ళకుండా వాగులో దిగకూడదని, చేపల వేటకు కూడా వెళ్లకూడదని గ్రామస్తులకు తెలిపారు.

# సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వృద్ధురాలు ధర్నా!

- తన భూమి తనకు ఇప్పించాలని డిమాండ్
- మద్దతు తెలిపిన సిపిఎం పార్టీ




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** తన భూమి తనకే ఇప్పించాలని అభ్యర్థిస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఒక వృద్ధురాలు ఆందోళనకు దిగింది. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చాపిడి సోంబాయి అనే 90 సంవత్సరాల వృద్ధురాలు ఆందోళన చేసింది. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆమెతోపాటు ఆమె ఇద్దరు కూతుర్లు, మనమరాలు ధర్నా చేశారు. ఈ ఆందోళనకు సిపిఎం పార్టీ సిర్పూర్ నియోజకవర్గ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ మద్దతు తెలుపుతూ ఆందోళన చేశారు. గతంలో రెవెన్యూ రికార్డుల్లో చింతలమాని పెల్లి మండలంలోని డబ్బా గ్రామంలో గల సరేనంబర్ 14 లోని తన భూమిని రెవెన్యూ అధికారులు చనిపోయినట్టుగా పేర్కొని, ఆ భూమిని వేరే వారి పేరు మీద పట్టా చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూమిలో గతంలో మాజీ ఎమ్మెల్యే ఒక సామాజిక వర్గానికి భవనాన్ని మంజూ చేసినట్లు సిపిఎం నాయకులు ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. గత ఆగస్టు నెల 4 వ తేదీన ఇదే విషయమై సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేయగా న్యాయం చేస్తామని అప్పట్లో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల వృద్ధురాలికి హామీ ఇచ్చారు. మళ్లీ ఆగస్టు 31వ ఎమ్మెల్సీ దండే విట్టల్ ఈ కమ్యూనిటీ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణానికి పూజ చేసినట్లు సిపిఎం నాయకులు ఆనంద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ భూమిలో నిర్మాణాలను ఆపేయించి, అట్టి స్థలాన్ని వృద్ధులైన చాపిడి సోంబాయికి రిజిస్ట్రేషన్ చేయించి ఉన్నత అధికారులు అప్పగించాలని వారు కోరుతున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల వృద్ధురాలికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# ప్రజావాణిలో 70 దరఖాస్తులు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 70 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం ఇచ్చిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖాధికారులు జాగ్రత్తగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియచేస్తూ దరఖాస్తులు ఇస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు చేసిన వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటిని శాశ్వత పరిష్కారం దిశగా తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. దరఖాస్తులు పరిష్కారం కాకుండా ఎక్కువకాలం పెండింగ్‌లో ఉంచితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి దరఖాస్తుకు సమాధానం ఇవ్వడం, అవసరమైన సమాచారం ప్రజలకు అందించడం, సమస్య పరిష్కారం దిశగా స్పష్టమైన రిపోర్టులు సమర్పించడం ప్రతి అధికారి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
02 సెప్టెంబర్ 2025

# "స్థానిక" పొత్తులపై ప్రధాన పార్టీల చర్చ..!

- కాంగ్రెస్ "లెఫ్ట్" దోస్తీనా..
- బిఆర్ఎస్ ఒంటరిగా బరిలోకి..
- బిజెపి, టిడిపి, జనసేన జట్టు కట్టేనా..

**కోదాడ, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. సెప్టెంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ రానున్నది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42% సీట్లు కేటాయిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటన చేసిన తరువాత రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. పోటీకి అన్ని పార్టీలో కదలిక మొదలైంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని బట్టి, ఆయా పార్టీల మధ్య పొత్తులకై సిద్ధపడుతున్నాయి. అధికార పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. తమ పాలన గురించి ప్రజాభిప్రాయం తేలనుంది. అధికారం చేపట్టిన ఆరు నెలలకు ముందస్తు ఎన్నికలకు వెళితే అధికార పార్టీకి కలిసొచ్చేది. ఇప్పుడు ప్రజా నాడి ఎలా ఉందో అర్థం కాదు.

ప్రభుత్వం మెజార్టీ గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేయడానికి వ్యూహాలకు పదును పెడుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల నుండి జత కట్టిన లెఫ్ట్ పార్టీలతో దోస్తీనా చేసి మెజార్టీ



గ్రామపంచాయతీలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పొత్తులో భాగంగా తమ పార్టీ బలంగా ఉన్న జిల్లాలో ఎక్కువ గ్రామపంచాయతీలలో పోటీ చేయుటకు లెఫ్ట్ అగ్ర నాయకత్వం పావులు కదుపుతుంది. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న కింది స్థాయి కేడర్ పొత్తుల్లో తమ సీట్లు కోల్పోతే పరిస్థితి ఏమిటి ! వారిలో ఒకరకంగా ఉత్కంఠ నెలకొంది. అధికార పార్టీకి ఈ సమస్య తలనొప్పిగా మారింది..

ముఖ్యమంత్రి ప్రతి మీటింగ్ లో మీరు మమ్మల్ని గెలిపించారు, మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత నాది అంటూ వస్తున్నారు.. దీంతో క్యాడర్ ముఖ్యమంత్రిపై నమ్మకం పెట్టుకుంది. ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగనుంది. పదేండ్లు అధికారంలో ఉండి, సంస్థాగతంగా పట్టు సాధించింది.. ఈ ఎన్నికలలో మెజార్టీ గ్రామ పంచాయితీలు కైవసం చేసుకుంటేనే వచ్చే శాసనసభ ఎన్నికలలో గెలుపు సునాయాసంగా ఉంటుందిని అగ్ర నాయకత్వం అంచనా వేస్తుంది. ఈ మధ్యకాలంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఫామ్ హౌస్ లో పార్టీ ప్రతినిధులు, కుల సంఘాల నాయకులతో విస్తృతంగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా కేంద్రాలలో భారీ సభలకు ఏర్పాట్లకు సిద్ధమైంది. బిజెపి టిడిపి, జనసేన కూటమిగా ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. బిజెపికి 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉన్నారు . ఉత్తర తెలంగాణలో సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి స్థానిక సంస్థల ఎన్నికలను ఉపయోగించుకోవాలని బిజెపి ప్రయత్నిస్తుంది. దానికనుగుణంగా గ్రామీణ ప్రాంతాలలో కేడర్ ఉన్న టిడిపి మరియు జనసేనతో జతకట్టే అవకాశాలు ఉన్నాయి.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్గొండ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కాగా సోమవారం మొత్తం 99 ఫిర్యాదులు రాగా, అందులో జిల్లా అధికారులకు 30 ,రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉన్నందున వీధి కుక్కలపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓలు వెంటనే పంచాయతీ కార్యదర్శులతో ఈ విషయం పై సమావేశం నిర్వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు హాస్టళ్లు, పాఠశాలలు తనిఖీ చేయాలని చెప్పారు. దర్తి ఆబా జనజాతీయ యోజన తదితర పథకాల కింద చేపట్టిన యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ప్రత్యేక అధికారులు మండలాలను సందర్శించినప్పుడు ఏదైనా చిన్న చిన్న పనులు మంజూరు చేయవలసి వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామ రావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను జిల్లా అధికారులు చొరవ తీసుకొని యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ లో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని శాఖల్లో ఎక్కువ రోజుల నుండి ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. అలాంటి శాఖల అధికారులు పెండింగ్ ఫిర్యాదులపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సోమవారం భూములకు సంబంధించి 41 ఫిర్యాదులు, ఎంపీడీవోలకు 13, మున్సిపల్ కమిషనర్లకి 8, ఇతర అధికారులకు 14 ఫిర్యాదులు, మొత్తం 76 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించెందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ పిడి వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసీఓ పద్మ, డిఈఓ అశోక్, డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డిఎస్ఓ మోహన్ బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయి గౌడ్, సంతోష్ కిరణ్, శ్రీనివాసరాజ్, శ్రీలత రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలపై విస్తృత ప్రచారం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం

**నల్గొండ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** మున్సిపల్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల ఫై పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆమె సంబంధిత అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓ లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు వీధి కుక్కల పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని, దీని ద్వారా వారి తల్లిదండ్రులకు సమాచారం వెళుతుందని, అలాగే విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. దీంతో పాటు, గ్రామీణ ప్రాంతాలలో హోర్డింగులు ఏర్పాటు చేసి ప్రజలకు వీధి కుక్కల వల్ల కలిగే నష్టాలు, వీధి కుక్కల స్టెరిలైజేషన్, వాక్సినేషన్, దత్తత తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. గత వారం దేవరకొండ డివిజన్ లో వీధి కుక్కల వ్యాక్సినేషన్ ,దత్తత కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడం పట్ల ఆమె దేవరకొండ డివిజన్ అధికారులు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని అభినందించారు. ఇదేవిధంగా అన్ని మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో కుక్కల వ్యాక్సినేషన్ తో పాటు, స్టెరిలైజేషన్, కుక్కలను దత్తత తీసుకునే విషయంపై



ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఇందుకుగాను కుక్కల ప్రేమికులతో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో "యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం " ఏర్పాటుకు తక్షణమే అంచనాలను రూపొందించి ప్రణాళిక తయారు చేసి పంపించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ను ఆదేశించారు. పంచాయతీ శాఖ ద్వారా అన్ని గ్రామీణ ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల మున్సిపల్ అధికారులతో అనుసంధానం చేసుకొని కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్, దత్తత లకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు సైతం వారి మండలాలలో చెత్త, చెదారం, డంపింగ్ యార్డులు గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేయించాలని, అలాగే కుక్కలను గుర్తించి వాటికి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ ,దత్తత పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో మూడు సంవత్సరాల బాలుడు కుక్క కాటుకు గురై మరణించిన సంఘటన లాంటిది నల్గొండ జిల్లాలో జరగడానికి వీలులేదని, ఆ విధంగా అధికారులు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తుల పరిశీలనలో వెనుకబడిన తహసీల్దార్లు దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి ఆర్డీఓ లకు పంపించాలని, నల్గొండ, చండూరు ,మిర్యాలగూడ , దేవరకొండ ఆర్డీఓ లు వారితో ఉన్న దరఖాస్తులన్నింటిని ఆన్ లైన్ ద్వారా డీఆర్ఓ కు పంపించాలని చెప్పారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, తదితరులు మాట్లాడారు.

## రేపు సీఎం రేవంత్ రెడ్డి చంద్రుగొండ పర్యటన



**చంద్రుగొండ, ఆగస్టు 1 (జనం సాక్షి) :** ఈ నెల 3న చంద్రుగొండ మండలంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన జరగనుందని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలియజేశారు. సోమవారం చంద్రుగొండ లోని బెండలపాడులో నిర్మించిన ఇందిరమ్మ పరిశీలన, హెలిపాడ్ సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో చంద్రుగొండ మండలం బెండలపాడు లో అత్యధికంగా 337 ఇల్లు మంజూరు చేసి వడివిడిగా నిర్మానం చేపట్టి మొదటి స్థానంలో నిలవగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఈనెల మూడున పర్యటించనున్నారని తెలిపారు. సుమారు లక్ష మందితో చంద్రుగొండ మండల పరిధిలోని దామరచర్లలో సభను ఏర్పాటు చేసి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల హృదయాలను గెలుచుకొని మరోమారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కానున్న మొదటి సభగా ఆయన పేర్కొన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గం లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో చేయని అభివృద్ధిని చేసి చూపిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని ఆయన తెలిపారు. సభ ఏర్పాట్లను రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇన్చార్జి తుంబూరి దయాకర్ రెడ్డితో కలిసి పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలకుండా అన్ని రకాల ఏర్పాట్లను చేసే విధంగా దగ్గరుండి పనులను ఎమ్మెల్యే జారే పర్యవేక్షిస్తున్నారు. ఉదయం చంద్రుగొండ మండల పరిధిలోని బెండలపాడు లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, జిల్లా అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో డిఎస్పి అబ్దుల్ రెహమాన్, సీఐ, జిల్లా మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, బొర్రా సురేష్, ఫజల్ భక్ష్, తుమ్మలపల్లి సురేష్, సారేపల్లి శేఖర్, కిరణ్ రెడ్డి, సుంద్రు విజయ్, కృష్ణవేణి, బుంగ శ్రీను, ఇమ్రాన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** బీబీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం చారిత్రాత్మకమని, డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దాని ప్రకారం అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పాస్ చేయించడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి, టీపీసీసీ అధ్యక్షులుకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఈనెల 3వ తేదీన మూసాపేట మండలానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్లు తెలిపారు. వేముల శివారులోని ఎస్ జిడి ఫార్మా వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన రెండో యూనిట్‌న్ ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో టీజీఎంఎస్సీ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణాయాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రామారావు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, నాయకులు ఎస్పీ వెంకటేశ్, ఆనంద్ గౌడ్, సీజే బెనహర్, గంజి అంజనేయులు, అరవింద్ రెడ్డి సాయిబాబా, పయాజ్, అజమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



# చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- అట్టహాసంగా 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు
- మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** చదువుతోపాటు విద్యార్థులు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాయికోడు మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నారు. మునిపల్లి మండల స్థాయిలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు మండల విద్యాశాఖ అధికారి భీమ్ సింగ్ అధ్యక్షత లింగంపల్లిలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఓడినవారు నిరాశపడకుండా గెలుపు కోసం ప్రయత్నించాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులతో మండలంలోని 146 మంది విద్యార్థి విద్యార్థినులకు సొంత ఖర్చుతో స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా మండలంలోని పి ఈ టి అందరికీ స్పోర్ట్స్ ట్రాక్ డ్రెస్సులు కూడా అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్సూద్ పటేల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖయ్యూం, వ్యాయామ ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, గీత, సుధాకర్ రెడ్డి, సురేందర్, స్వాతి, వీణ, రాజశేఖర్, కాంప్లెక్స్ హెచ్.ఎం తుకారం , లింగంపల్లి వైస్ ప్రిన్సిపాల్ రజిత , శంకర్ బాబు, ఆనంద్ రాజ్ , సుధాకర్ ,గంధం సరస్వతి ఫౌండేషన్ అధ్యక్షులు గంధం మల్లికార్జున్ పాల్గొన్నారు.

### వాలీబాల్ పోటీల విజేతలు..

వాలీబాల్ పోటీలలో అండర్ 17 బాలికల పోటీలో జడ్పీహెచ్ఎస్ కంకల్, జడ్పిహెచ్ఎస్ ఖమ్మం పల్లి, అండర్ 17 బాలురు టీజిఆర్ఎస్ లింగంపల్లి, జెడ్పిహెచ్ఎస్ మునిపల్లి, అండర్ 14 బాలికలు కేజీబీవీ తాటిపల్లి, జెడ్పిహెచ్ఎస్ కంకోల్, అండర్ 14 బాలురు టీజిఆర్ఎస్ లింగంపల్లి, జెడ్పిహెచ్ఎస్ మునిపల్లి విద్యార్థులు విజయం సాధించారు.

# మహిళా భద్రత గౌరవానికి పోలీస్ శాఖ కృషి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** పని ప్రదేశంలో ఆత్యాచార, వేధింపుల నిరోధక చట్టంకు సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం మహిళా పోలీస్ అధికారులకు,మహిళా రక్షణ విభాగం సిబ్బందికి, మహిళా శిశు సంక్షేమం వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ పాల్గొని సలహాలు, సూచనలు అందించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వేదింపులు, సమస్యలపై పోలీసు మహిళా సిబ్బంది స్పందించి సహాయ సహకారాలు అందించాలన్నారు. వేధింపులపై దైర్యంగా పిర్యాదు చేసి వాటి నిర్మూలనకు పాటుపడాలని అన్నారు. మహిళా పోలీస్ యూనిఫాం ధరించి రోడ్డుపై కనిపిస్తే ఆకతాయిల మదిలో భయం కలుగుతుందని అన్నారు. మహిళా సాధికారిత, మహిళా శక్తి, చట్టాల అమలులో మహిళల పాత్ర, పని ప్రదేశంలో వేధింపులను నిరోధించడంలో బాగా పని చేయాలని సూచించారు. మహిళా ఉద్యోగులు పని ప్రదేశంలో వివిధ రకాల వేధింపులకు గురవుతున్నట్లు అనేక సందర్భాల్లో మీడియాలో




ప్రచురితమైనదని, కేసులు నమోదవుతున్నాయని అన్నారు. వీటిని నిర్మూలించడంలో మహిళలు శక్తివంతంగా ఉండాలని, ధైర్యంగా ఫిర్యాదు చేసి వేధింపులను అరికట్టాలని కోరారు. సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్ ప్రకారం జిల్లా పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి అధ్వర్యంలో ఒక ఇంటర్నల్ కమిటీని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నందు కూడా సంభందిత అధికారుల అధ్వర్యంలో ఆఫీస్ ఇంటర్నల్ కమిటీలు, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో కమిటీ పని చేస్తుందన్నారు. ఉద్యోగ స్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, చట్టపరమైన నిబంధనలు, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ మార్గాలు గురించి అన్ని కార్యాలయాల్లో అవగాహన కల్పించి వీటిని నిరోధించాలన్నారు. మహిళా ఉద్యోగులకు చట్టపరమైన రక్షణ, న్యాయ సహాయం అందించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి దయానందరాణి, బెటి బచావో బిటి పడావో నిర్వహుకురాలు చైతన్య, ఏవో మంజు భార్గవి, ఎస్ఐలు మౌనిక, నీలిమ, బరోసా సెంటర్ లీగల్ అడ్వైజరీ జ్యోతి, కరుణశ్రీ, మహిళా ఏఎస్ఐ సైదాబి, జ్యోతి, అరుణ, కవిత, పోలీస్ స్టేషన్ రిషప్షన్ సెంటర్స్ మహిళా సిబ్బంది, షీ టీమ్స్,భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాంరెడ్డిపల్లి కేంద్రంగా జోరుగా అక్రమ ఇసుక దందా

- రాత్రి వేళలో రాజ్యమేలుతున్న ఇసుక మాఫియా
- శివన్నగూడ రిజర్వాయర్ నుండి భారీగా తరలింపు
- అధికార పార్టీ అండదండలతో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



**మర్రిగూడ, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం లోని రాంరెడ్డి పల్లి గ్రామ కేంద్రంగా అక్రమ ఇసుక దందాకు కొందరు అక్రమార్కులు తెర లేపారు .శివన్నగూడ రిజర్వాయర్ నుండి రాత్రి వేళలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాలలో పదుల సంఖ్యలో భారీగా ఇసుక ను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో యదేచ్చగా ఇసుక అక్రమ రవాణాఅవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు దారితీస్తుంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే అధికారులు ఆ పక్కకు వెళ్లట్లేదని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజల ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# చిన్న స్వీట్ షాప్‌కి రూ.141 కోట్ల ట్యాక్స్ నోటీస్




ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ ప్రాంతంలో చిన్న స్వీట్ షాప్ నడుపుతున్న సుధీర్ అనే వ్యాపారి రూ.141 కోట్ల అమ్మకాలపై ఆదాయ పు పన్ను విభాగం నుంచి నోటీస్ అందుకుని షాక్‌కు గురయ్యాడు. ఈ నోటీసులో తన పేరు, చిరునామా, పాన్ నంబర్‌తో పాటు ఢిల్లీలో ఆరు కంపెనీలను నడుపుతున్నట్లు పేర్కొనడంతో అతను కంగుతిన్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. గతంలో 2022లో కూడా తనకు సంబంధం లేని కంపెనీ అమ్మకాలపై సీజీఎస్టీ నుంచి నోటీస్ వచ్చిందని, ఆ కంపెనీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని అప్పట్లోనే అధికారులకు వివరించినట్లు సుధీర్ తెలిపాడు. మళ్లీ జూలై 10న రూ.141 కోట్ల అమ్మకాలకు సంబంధించి మరో నోటీస్ రావడంతో ఆందోళనకు గురయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొందరు ఆర్థిక, సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు తెరవడానికి, షెల్ కంపెనీలు సృష్టించడానికి లేదా పన్నులు ఎగవేసేందుకు ఇతరుల పాన్ వివరాలను చట్టవిరుద్ధంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటువంటి మోసాలు నోటీసులు లేదా రికవరీ కాల్స్ ద్వారా బయటపడతాయని వెల్లడించారు. ప్రజలు తమ పాన్ కార్డు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, క్రెడిట్ నివేదికలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేయడం ద్వారా ఇలాంటి మోసాలను నివారించవచ్చని అధికారులు సూచించారు. ఇదిలా ఉంటే, ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ పారిశుద్ధ్య కార్మికుడికి కూడా రూ.34 కోట్ల అమ్మకాలపై పన్ను నోటీస్ అందడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# 'లాండ్రోమాట్' వ్యాఖ్యలను ఖండించిన కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీ

**ముంబై, (జనంసాక్షి) :**
వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో రష్యా చమురు కొనుగోళ్లపై భారత్‌ను 'లాండ్రోమాట్'గా అభివర్ణించిన వ్యాఖ్యలను కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తీవ్రంగా ఖండించారు. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా నుంచి చమురు దిగుమతుల్లో భారత్ ఎలాంటి అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించలేదని, భారత్ ఇంధన వాణిజ్య విధానం ప్రపంచ మార్కెట్‌ను స్థిరీకరించడంతో పాటు ధరలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించిందని ఆయన స్పష్టం చేశారు. లాండ్రో మాట్ అనగా అనుమానాస్పద వస్తువుల ను చట్టబద్ధంగా కనిపించేలా చేసే ప్రక్రియని, భారత్ రష్యా చమురును శుద్ధి చేసి యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేస్తూ లాభాలు ఆర్జిస్తోందన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు నుంచే భారత్ ప్రపంచంలో నాల్గో అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతి దేశంగా ఉందని, యుద్ధం తర్వాత కూడా ఎగుమ తులు, లాభాలు దాదాపు అలాగే ఉన్నాయని పూరీ



వివరించారు. రష్యా చమురు దిగుమతులు యుద్ధం తర్వాత ఒక శాతం నుంచి 40 శాతానికి పెరిగినప్పటికీ, ఇది పాశ్చాత్య దేశాల ఆంక్షల కారణంగా తగ్గింపు ధరలతో చమురు కొనుగోలు చేయడం వల్లనేనని ఆయన తెలిపారు.
పీటర్ నవారో ఉక్రెయిన్ యుద్ధాన్ని 'మోదీ యుద్ధం'గా అభివర్ణించి, భారత్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ యుద్ధ యంత్రానికి నిధులు సమకూరుస్తోందని ఆరోపించడంపై పూరీ స్పంది స్తూ, రష్యా చమురుపై ఇరాన్, వెనిజులాలాగా ప్రత్యక్ష నిషేధం లేదని, జీ-7, యూరోపియన్ యూనియన్ విధించిన ధరల పరిమితి వ్యవస్థను భారత్ పాటించిందని అన్నారు. భారత్ చట్టబద్ధ మైన షిప్పింగ్, భీమా, సర్టిఫైడ్ వ్యాపారులు, పరీక్షిత మార్గాల ద్వారా మాత్రమే వ్యాపారం చేసిందని స్పష్టం చేశారు.

భారత్ రష్యా చమురు దిగుమతులను ఆపివేస్తే ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 నుంచి 100 డాలర్లకు చేరే ప్రమాదం ఉందని, ప్రపంచ సరఫరా ఒక శాతం తగ్గడంతో ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతాయని బ్రోకరేజ్ సంస్థ సీఎల్ఎస్ఏ నివేదికను ఉటంకిస్తూ పూరీ తెలి పారు. భారత్ ఎగుమతులు సరఫరా గొలుసును కొనసాగిస్తున్నాయని, యూరప్ కూడా భారత్ నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని, అయితే ఎగుమతి, శుద్ధి మార్జిన్లలో పెద్ద మార్పు లేదని, లాభాల సమస్యే లేదని ఆయన వివరించారు. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచ ధరలు పెరిగిన సమయంలో భారత్ తన పౌరులకు ఉపశమనం కలిగించేందుకు అనేక చర్యలు తీసుకుందని పూరీ స్పష్టం చేశారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 514 | ₹ 61.68 |
| వరంగల్ | ₹ 492 | ₹59.04 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹1,04,950 (24 క్యారెట్లు) | ₹ 96,200 (22 క్యారెట్లు)

చెన్నై
₹ 96,200 (22 క్యారెట్లు) | ₹1,04,950 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,31,000

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



- సెన్సెక్స్ 500 పాయింట్లు పైకి, నిఫ్టీ 24,600 మార్క్‌ను దాటింది

**ముంబై:** గతవారం నష్టాల బాటలో నడిచిన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం గణనీయమైన లాభాలతో ముగిశాయి. జీఎస్టీ సంస్కరణలు, అంచనాలకు మించిన జీడీపీ గణాంకాలు వంటి సానుకూల అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7.8 శాతం జీడీపీ వృద్ధి నమోదైంది, ఆర్బీఐ అంచనా 6.5 శాతం కంటే ఎక్కువగా ఉండటంతో మదుపరుల్లో ఉత్సాహం పెరిగింది. ట్రంప్ సుంకాలపై అమెరికా కోర్టు తీర్పు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేసింది. గతవారం సూచీలు భారీ నష్టాలు చవిచూపుతో కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు జరిగాయి. చైనాలో జరిగిన షాంఘై సహకార సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు, ట్రంప్ టారిఫ్ రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల మధ్య ఈ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఉదయం 79,828.99 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ మొదట్లో కొంత ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ, కీలక రంగాల్లో కొనుగోళ్లు మార్కెట్‌ను ముందుకు నడిపాయి. ఇంట్రాడేలో 80,406 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సూచీ చివరికి 554.84 పాయింట్ల లాభంతో 80,364.49 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 198.20 పాయింట్లు పెరిగి 24,625.05 వద్ద స్థిరపడింది, 24,600 మార్క్‌ను దాటింది. ఆటోమొబైల్, ఐటీ, లోహ రంగ సూచీలు రాణించాయి. మరోవైపు, రూపాయి విలువ జీవితకాల కనిష్ఠానికి చేరింది. సోమవారం ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే 11 పైసలు క్షీణించి 88.20 వద్ద ముగిసింది.

# ఉర్సులా వాన్ డెర్ లెయెన్ విమానం జీపీఎస్ జామింగ్

## రష్యా హస్తం అనుమానం



యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్ ప్రయాణిస్తున్న విమానం బల్గేరియాలోని ప్లోవ్డివ్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు సిద్ధమవుతుండగా జీపీఎస్ నావిగేషన్ జామింగ్‌కు గురైంది. ఈ ఘటన వెనుక రష్యా హస్తం ఉందని బల్గేరియన్ అధికారులు అనుమానిస్తున్నట్లు యూరోపియన్ యూనియన్ ప్రతినిధి తెలిపారు. అయినప్పటికీ, పైలట్లు పేపర్ మ్యాప్‌లను ఉపయోగించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఉర్సులా ఉక్రెయిన్‌పై రష్యా దాడులను మొదటి నుంచి తీవ్రంగా ఖండిస్తూ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను విమర్శిస్తూ, యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన ఆమె రష్యా, బెలారస్ సరిహద్దుల్లోని యూరోపియన్ యూనియన్ దేశాల నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బల్గేరియాకు వెళ్తుండగా జరిగింది. అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావే శమైన యూరోపియన్ నేతల బృందంలో ఉర్సులా ఒకరు. బల్గేరియా ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో, విమానం ప్లోవ్డివ్ విమానాశ్రయాన్ని సమీపిస్తున్న పుడు జీపీఎస్ నావిగేషన్ కోసం ఉపయోగించే ఉపగ్రహ సిగ్నల్‌లో అంతరాయం కలిగిందని తెలిపింది. రష్యా గతంలోనూ యూరోపియన్ దేశాల్లో జీపీఎస్ సిగ్నల్‌లను జామ్ చేస్తోందని పలు సందర్భాల్లో ఆరోపణలు ఎదుర్కొం ది. పోలండ్, జర్మనీ పరిశోధకుల బృందం 2024 జూన్ నుంచి ఆరు నెలల పాటు జీపీఎస్ జామింగ్‌పై అధ్యయనం చేసి, రష్యా ఈ జామింగ్ వెనుక ఉందని నిర్ధారించింది. ఈ ఘటన యూరోపియన్ యూనియన్ రక్షణ సామర్థ్యా లను, ఉక్రెయిన్‌కు మద్దతును మరింత బలోపేతం చేయాలనే నిబద్ధతను బలపరుస్తుందని యూరోపియన్ కమిషన్ తెలిపింది.


## కిమ్ జోంగ్ ఉన్ క్షిపణి కేంద్ర పరిశీలన

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ విదేశీ పర్యటనకు బయల్దేరే ముందు తమ దేశంలోని సరికొత్త క్షిపణి తయారీ కేంద్రాన్ని పరిశీలించడం సంచలనంగా మారింది. ఆదివారం బీజింగ్‌లో జరిగే మిలటరీ పరేడ్‌లో పాల్గొనేందుకు ఆయన బయల్దేరారు. అయితే, అంతకు ముందు కిమ్ ఒక క్షిపణి ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి, దాని సామర్థ్యాన్ని సమీక్షించారు. ఈ విషయాన్ని ఉత్తర కొరియా మీడియా సంస్థ కేసీఎన్ఏ వెల్లడించింది. గుర్తు తెలియని ప్రదేశంలో ఉన్న ఈ కేంద్రంలో డజన్ల కొద్దీ క్షిపణులు కనిపించాయి, ఇవి తయారీలో వివిధ దశల్లో ఉన్నట్లు తెలుస్తోంది. కిమ్ యూనిఫామ్ ధరించిన అధికారులతో సంభాషిస్తున్న దృశ్యాలను కూడా ఈ సంస్థ ప్రచురించింది. బీజింగ్‌లో రెండో ప్రపంచ యుద్ధం 80వ వార్షికోత్సవం సందర్భంగా భారీ మిలటరీ పరేడ్ జరగనుంది. ఈ కార్యక్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు కిమ్ జోంగ్ ఉన్ కూడా పాల్గొననున్నారు. ఈ యుద్ధం జపాన్ లొంగుబాటుతో ముగిసిన విషయం తెలిసిందే.

# రూ.10తో డిజిటల్ బంగారం, వెండిలో పెట్టుబడి..

## ఇన్క్రెడ్ మనీతో ఎంఎంటీసీ-పాంప్ భాగస్వామ్యం

కేవలం రూ.10తో బంగారం, వెండిలో పెట్టుబడి ప్రారంభించే అవకాశం ఇప్పుడు అందుబాటులో ఉంది. ఇన్క్రెడ్ గ్రూప్‌కు చెందిన రిటైల్ వెల్త్ విభాగం ఇన్క్రెడ్ మనీ, దేశంలోని ప్రముఖ రిఫైనరీ ఎంఎంటీసీ-పాంప్‌తో భాగస్వామ్యంతో డిజిటల్ బంగారం, వెండిలో పెట్టుబడి సౌకర్యాన్ని ప్రారంభించింది. వినియోగదారులు కనీసం రూ.10తో పెట్టుబడి పెట్టి, ఎప్పుడైనా నగదుగా లేదా 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం, వెండి రూపంలో ఇంటికి డెలివరీ చేసుకోవచ్చు. ఒక్క క్లిక్‌తో కొనుగోలు, అమ్మకం, బ్యాంకు ఖాతాలోకి తక్షణ నగదు బదిలీ సౌలభ్యం ఉంది. ఫిజికల్ బంగారం, వెండి కోరుకునే వారికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన నాణేలు, బార్ల రూపంలో రిడీమ్ చేసుకునే అవకాశం ఉంది. ఎంఎంటీసీ-పాంప్ ఉత్పత్తులు స్విస్ నాణ్యతా ప్రమాణాలతో, ప్రత్యేక సీరియల్ నంబర్, అస్సేయర్ సర్టిఫికేట్‌తో మింటెడ్ కార్డ్‌లో ప్యాక్ చేసి అందిస్తారు. చిన్న మొత్తాలతో ప్రారంభించి, క్రమంగా గణనీయమైన మూలధనాన్ని సమకూర్చుకునే అవకాశం ఉంది. ధరల ఒడిదుడుకుల నుంచి రక్షణ, సంప్రదాయ బంగారం కొనుగోలు ఇబ్బందులు లేకుండా, అధిక ఖర్చు అవసరం లేకుండా లిక్విడిటీ సౌలభ్యం ఉంది. ఇన్క్రెడ్ మనీ యాప్‌లో లైవ్ మార్కెట్ ధరలతో పారదర్శక లావాదేవీలు, రోజువారీ, వారం, నెలవారీ సిప్ సౌకర్యం అందుబాటులో ఉంది. డీమ్యాట్ ఖాతా అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్, సులభమైన ప్రక్రియగా ఈ సేవ రూపొందింది.



# ఆల్‌టైమ్ రికార్డు

## బంగారం, వెండి గరిష్ఠా ధరలు నమోదు


**తులం రూ.1.05లక్షలు, కిలో వెండి రూ.1.23లక్షలు!**

భారతదేశంలో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలకు చేరుకున్నాయి. ఎంసీఎక్స్‌లో బంగారం ధర పాత రికార్డులన్ని ంటినీ దాటి, సెప్టెంబర్ 1న ఆల్‌టైమ్ గరిష్ఠాలు నమోదు చేసింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకారం, సోమవారం 24 క్యారెట్ల బంగారం ధర రూ.2,404 పెరిగి తులానికి రూ.1,04,792కి చేరింది. మరోవైపు, వెండి ధర రూ.5,678 పెరిగి కిలోకు రూ.1,23,250కి చేరుకుంది. ఈ పెరుగుదలకు యూఎస్ డాలర్ బలహీనత, సెప్టెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అంచనాలు, ట్రంప్ సుంకాలకు సంబంధించిన అనిశ్చితి కారణాలుగా మార్కెట్ వర్గాలు తెలిపాయి. యూఎస్ సుంకాల వల్ల భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి, బంగారానికి సురక్షిత పెట్టుబడి ఆస్తిగా డిమాండ్ పెరిగిందని నిపుణులు వివరించారు. ఈ సంవత్సరం బంగారం తులానికి రూ.1.08లక్షలు, వెండి కిలోకు రూ.1.30లక్షల వరకు పెరగవచ్చని అంచనా. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 24 క్యారెట్ల బంగారం ధర రూ.76,162 నుంచి రూ.1,04,792కి పెరిగి, మొత్తం రూ.28,630 లాభం చేసింది. వెండి ధర రూ.86,017 నుంచి రూ.1,23,250కి చేరి రూ.37,233 పెరిగింది. గతేడాది బంగారం రూ.12,810 పెరగడం విశేషం. ప్రస్తుతం ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,06,030, 22 క్యారెట్లు రూ.97,200 వద్ద ట్రేడవుతోంది. ముంబైలో 24 క్యారెట్లు రూ.1,05,880, 22 క్యారెట్లు రూ.97,050. కోల్‌కతాలో 24 క్యారెట్లు రూ.1,05,880, 22 క్యారెట్లు రూ.97,050. గతవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఎదురుదెబ్బ ఇచ్చింది.

ట్రంప్ వాణిజ్య భాగస్వామ్య దేశాలపై విధించిన సుంకాలను కోర్టు చట్టవిరుద్ధంగా ప్రకటించింది. అధ్యక్ష అధికారాల దుర్వినియోగం జరిగిందని కోర్టు తీర్పు. సుప్రీంకోర్టులో అప్పీల్ చేసేందుకు అక్టోబర్ 14 వరకు అవకాశం ఇచ్చారు. దీంతో డాలర్ బలహీనపడి, పెట్టుబడ దారులు బంగారం కొనుగోళ్లు పెంచారు. ట్రంప్ సుంకాలు, వాణిజ్య యుద్ధ భయం వల్ల బంగారం సురక్షితమని భావిస్తూ కొనుగోళ్లు జరుగుతున్నాయని బులియన్ వ్యాపారులు చెప్పారు. రూపాయి పతనం కూడా ధరల పెరుగుదలకు కారణం. చైనా, రష్యా వంటి దేశాలు పెద్దగా బంగారం కొనుగోలు చేస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియకపోవడంతో అస్థిరతలు పెరిగి, పెట్టుబడులు బంగారంపై పెరుగుతున్నాయి.

# జీఎస్టీ వసూళ్లు రూ.1.86 లక్షల కోట్లు

## ఆగస్టులో ఏపీ, తెలంగాణలో గణనీయ వృద్ధి







**హైదరాబాద్, (జనంసాక్షి)**
ఆగస్టు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు రూ.1.86 లక్షల కోట్లకు చేరాయి, గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 6.5 శాతం వృద్ధి నమోదైందని కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం గణాంకాలను విడుదల చేసింది. అయితే, జులైలో రూ.1.96 లక్షల కోట్లతో పోలిస్తే ఆగస్టు వసూళ్లు కొంత తగ్గాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్టీ చరిత్రలో అత్యధికంగా రూ.2.37 లక్షల కోట్ల వసూళ్లు సాధించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధి చెందాయి, 2024 ఆగస్టులో రూ.3,298 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది రూ.3,989 కోట్లకు చేరాయి. తెలంగాణలో 12 శాతం వృద్ధితో గత ఏడాది రూ.4,569 కోట్ల నుంచి ఈసారి రూ.5,103 కోట్లకు పెరిగాయని కేంద్రం తెలిపింది. నిత్యావసర ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లను తగ్గిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు, దీపావళి నాటికి రేట్ల తగ్గింపుతో పండగ ఆనందాన్ని రెట్టింపు చేస్తామన్నారు. ఈ ప్రకటన తర్వాత ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం వెల్లడించింది, జీఎస్టీలో ఇకపై 5 శాతం, 18 శాతం అనే రెండు శ్లాబులు మాత్రమే ఉంటాయని తెలిపింది. ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం శ్లాబులు అమలులో ఉన్నాయి. సెప్టెంబరు 3-4 తేదీల్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో రేట్ల మార్పులపై నిర్ణయం తీసుకోనున్నారు. కొనుగోలుదారుల గిరాకీ బలంగా ఉన్నప్పటికీ, రేట్ల మార్పులపై అంచనాలతో కొందరు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ వాయిదా తాత్కాలికమేనని, రేట్లపై స్పష్టత వచ్చిన తర్వాత అమ్మకాలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఆగస్టు వసూళ్ల తగ్గుదలకు ఈ అంచనాలు కూడా ఒక కారణంగా కనిపిస్తున్నాయి.

### షాంపూలు, హైబ్రిడ్ కార్లు, ఎలక్ట్రానిక్స్‌పై జీఎస్టీ తగ్గింపు

కేంద్ర ప్రభుత్వం కొన్ని ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లను తగ్గించే యోచనలో ఉన్నట్లు సమాచారం. సుమారు 175 ఉత్పత్తులపై పన్ను శాతాన్ని 10 శాతం వరకు తగ్గించే అవకాశం ఉంది. షాంపూలు, టూత్‌పేస్ట్, టాల్కమ్ పౌడర్‌లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించనున్నారు. దీంతో హిందుస్తాన్ యూనీలివర్, గోద్రేజ్ వంటి కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలు పెరిగే అవకాశం ఉంది. ఏసీలు, టీవీల వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మార్పు శాంసంగ్, ఎల్జీ, సోనీ వంటి కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలపై ప్రభావం చూపనుంది. అక్టోబర్‌లో దీపావళి షాపింగ్ సీజన్ సమయంలో ఈ కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి రానున్నాయి. పెట్రోల్ హైబ్రిడ్ కార్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించే అవకాశం ఉంది, ఇది టొయోటా, మారుతీ సుజుకీ కంపెనీలకు శుభవార్తగా నిలవనుంది. ఈ కంపెనీలు తమ హైబ్రిడ్ కార్లు పర్యావరణ హితమైనవని, పన్ను తగ్గింపు కోరుతూ చాన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో ఏ ఉత్పత్తులపై పన్ను తగ్గనున్నదీ తేలనుంది. జీఎస్టీ విధానంలో సమూల సంస్కరణలు ఉంటాయని ప్రధాని మోదీ ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

# ప్రధాని మోదీ హాంగ్చీ ఎల్ లిమోసిన్‌లో ప్రయాణం

షాంఘై సహకార సదస్సు కోసం రెండు రోజుల పాటు ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన చైనీస్ లగ్జరీ కారు బ్రాండ్ హాంగ్చీ ఎల్ లిమోసిన్‌లో ప్రయాణిస్తున్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్పింగ్ కాన్వాయ్‌లోనూ ఈ మోడల్ ఉపయోగించబడుతుంది, అలాగే ఎంపిక చేసిన విదేశీ ప్రతినిధులకు కూడా ఈ కారును కేటాయిస్తారు. 2019లో జిన్పింగ్ భారత్‌లో పర్యటించినప్పుడు కూడా ఈ కారులోనే ప్రయాణించారు. హాంగ్చీ అనే పేరు మాండరిన్ భాషలో రెడ్ ఫ్లాగ్ అని అర్థం. ఈ కారు చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఫస్ట్ ఆటోమొబైల్ వర్క్స్ గ్రూపుకు చెందినది 'మేడ్ ఇన్ చైనా' ఉత్పత్తిగా ప్రసిద్ధి చెందింది. తొలుత కమ్యూనిస్ట్ పార్టీ నాయకుల కోసం రూపొందిన ఈ కారు ఉత్పత్తి 1981లో నిలిపివేయబడినప్పటికీ, 1990ల తర్వాత పునరుద్ధరించబడింది. ప్రస్తుతం హాంగ్చీ ఎల్ మోడల్ అత్యంత ప్రజాదరణ పొందినది. ఈ కారు 6 లీటర్ల వీ12 ఇంజిన్‌తో 400 హార్స్‌పవర్ ఉత్పత్తి చేస్తుంది, 8.5 సెకన్లలో 100 కిమీ/గం వేగం, 210 కిమీ/గం గరిష్ఠ వేగం చేరుకోగలదు. 5.5 మీటర్ల పొడవు, 3 టన్నుల బరువు కలిగిన ఈ కారులో విశాలమైన సీట్లు, మసాజ్, హీటింగ్, వెంటిలేషన్, ఎంటర్‌టైన్‌మెంట్ స్క్రీన్‌లతో పాటు ఆల్-వీల్ డ్రైవ్, పార్కింగ్ సెన్సార్లు, 360 డిగ్రీ కెమెరాలు, ఆటోమేటిక్ వేగ సర్దుబాటు వంటి సురక్షా ఫీచర్లు ఉన్నాయి. హాంగ్చీ ఎల్ ధర సుమారు 5 మిలియన్ యువాన్‌లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7 కోట్లు. ఇది చైనాలో తయారైన అత్యంత ఖరీదైన కారుగా గుర్తింపు పొందింది.

# ఇ20 పెట్రోల్ సురక్షితమే

## సుప్రీంకోర్టు తీర్పు, కేంద్రం స్పష్టత




20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఇ20) సురక్షితం కాదని సామాజిక మాధ్యమాల్లో జరిగిన చర్చల నేపథ్యంలో, ఈ ఇంధన వాడకాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం, వాహన ఉద్గారాలను తగ్గించడం, ఇంధన భద్రత, పర్యావరణ సంరక్షణ లక్ష్యాల కోసం ప్రభుత్వం ఈ20 పెట్రోల్ నిర్ణయం తీసుకుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్ వినియో గానికి మార్గం సుగమమైంది. ఇ20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని, డ్రైవింగ్‌ను దెబ్బ తీస్తుందనే అనుమానాలపై సహజ వాయువు, పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చింది. ఈ భయాలు నిరాధారమని, శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల విశ్లేషణల ప్రకారం ఇ20 ఇంధనం వల్ల ఇంజిన్ సమస్యలు తలెత్తవని తెలిపింది. ఇథనాల్ కలిసిన పెట్రోల్ కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని పేర్కొంది. ఇథనాల్‌లో శక్తి సాంద్రత తక్కువ ఉండటం వల్ల మైలేజీలో 2-5 శాతం స్వల్ప తగ్గుదల ఉండవచ్చని, అయితే ఇది గణనీయం కాదని వివరించింది.

లక్ష కిలోమీటర్ల పాటు సాంప్రదాయ, ఇ20 ఇంధనాలతో వాహనాలను పరీక్షించగా, పవర్, టార్క్, ఇంధన సామర్థ్యంలో గుర్తించదగిన తేడాలు కనిపించలేదని మంత్రిత్వ శాఖ తెలిపింది. అయినప్పటికీ, వాహన పరిశ్రమ నిపుణులు ఇ20 ఇంధనం వల్ల ఇంధన సామర్థ్యం 2-5 శాతం తగ్గవచ్చని, వాహన వేరియంట్ల ఆధారంగా స్వల్ప తేడాలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

పాత వాహనాల్లో ఇ20 ఇంధనం వాడకం తక్షణ ప్రభావం చూపకపోయినా, దీర్ఘకాలంలో గ్యాస్కెట్లు, రబ్బరు గొట్టాలు, ఇంధన పైపులపై కోత ప్రభావం ఉండవచ్చని నిపుణులు హెచ్చరించారు.

# రష్యా చమురు కొనుగోళ్లపై భారత్‌కు అమెరికా సుంకాలు




రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా సుంకాలు విధించినప్ప టికీ, భారత్ తన ఇంధన దిగుమతులను కొనసాగిస్తోంది. జులైలో భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా 31.4 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, మాస్కో నుంచి రూ.31,775 కోట్ల విలువైన చమురు అమ్మకాలు నమోదయ్యాయి. ఇరాక్ 17.2 శాతం, సౌదీ అరేబియా 16.1 శాతం, యూఏఈ 11.8 శాతం, అమెరికా 8.9 శాతంతో టాప్-5లో ఉన్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, మాస్కో తక్కువ ధరకు చమురు అందించడం మొదలుపెట్టింది. దీంతో భారత్‌తో పాటు ఇతర దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పెంచాయి. గతంలో రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి కేవలం 1 శాతం ఉండగా, ప్రస్తుతం అది 30 శాతాలను దాటింది. ఈ చర్యలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ, భారత్ తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసి, శుద్ధి చేసిన ఇంధనాన్ని ఎగుమతి చేస్తూ లాభాలు పొందుతోందని ఆరోపిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లలో భారత ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీ, బీపీసీఎల్‌లు ముందుండగా, రిలయన్స్, నయారా ఎనర్జీ వంటి ప్రైవేటు సంస్థలు కూడా గణనీయమైన కొనుగోళ్లు చేస్తున్నాయి. 150 కోట్ల మంది జనాభా ఉన్న భారత్‌కు చౌకైన ఇంధనం అవసరమని, దీని ద్వారా దేశ ప్రజలకు సరసమైన ధరల్లో ఇంధనం అందిస్తున్నామని భారత ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అయితే, రష్యా చమురు దిగుమతుల వల్ల ఊహించినంత లాభం లభించడం లేదని, ఏడాదికి కేవలం 2.5 బిలియన్ డాలర్ల లాభం మాత్రమే వస్తుందని సీఎల్ఎస్ఏ బ్రోకేజ్ సంస్థ అంచనా వేసింది.

# మరాఠా కోటా నిరసనలపై బాంబే హైకోర్టు ఆగ్రహం

**ముంబై:** మరాఠా వర్గానికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే నాయకత్వంలో జరుగుతున్న ఉద్యమం తీవ్రస్థాయికి చేరింది. అయితే, ఈ నిరసనలు ముంబైలో భారీ ట్రాఫిక్ జామ్‌కు కారణమవడంతో బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనకారులు సెప్టెంబర్ 2 మధ్యాహ్నం నాటికి ముంబై వీధులను ఖాళీ చేయాలని కోర్టు ఆదేశించింది. సోమవారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మరాఠా రిజర్వేషన్ ఆందోళన జరిగింది. వేలాది మంది నిరసనకారులు దక్షిణ ముంబైలోని సీఎస్‌టీ, ఫోర్ట్, చర్చ్‌గేట్ మార్గాల్లో చేరడంతో ట్రాఫిక్ స్తంభించింది. నిరసనకారులు పలు రహదారులను అడ్డుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నిరసనలు శాంతియుతంగా జరగకపోవడంతో పాటు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. మనోజ్ జరాంగే మరియు అతని మద్దతుదారులు మంగళవారం మధ్యాహ్నం నాటికి ముంబై వీధులను ఖాళీ చేయాలని స్పష్టం చేసింది. తమ డిమాండ్ నెరవేరే వరకు ముంబైని వీడబోమని మనోజ్ జరాంగే ఆదివారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
02 సెప్టెంబర్ 2025

# ఉపరాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుద్దాం

- గద్వాల అఖిలపక్ష, ప్రజాసంఘాల డిమాండ్



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ఈ నెల 9న మన దేశ ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికలో పీడిత ప్రజల పక్షపాతీ, నిష్కళంక మేధావీ , సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమర్థులని దేశ వ్యాపిత ప్రజాస్వామిక వాదులు అభిప్రాయ పడుతున్న సందర్భంలో గద్వాలలో అఖిల పక్ష కమిటీ, ప్రజా సంఘాలు సంయుక్తంగా సోమవారం టీజేఎస్ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అన్నారు. ప్రజా నాయకుడు నాగర్ దొడ్డి వెంకట్రాములు, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు డాక్టర్ ఎండీ. ఇక్బాల్ పాషాల నిర్వహణలో జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు అబ్దుల్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ న్యాయవాది వెంకటేశ్వర్లు,డీటీఎఫ్ నాయకులు ఉదయ్ కిరణ్, ప్రభాకర్ శాస్త్రి, సిపిఎం నాయకులు నర్సింహులు, ఎల్ఐసీ విశ్రాంత అధి కారి కృష్ణ య్య, సీనియర్ సిటిజెన్ ఫోరమ్ నాయకులు మోహన్ రావు, ఆర్టీసీ ఉద్యోగసంఘం నాయకులు డీ.ప్రభాకర్, బీఆర్ ఎస్వి నాయకులు కురువ పల్లయ్య, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు ధరణి హనుమంతు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధి దౌలత్, ఇన్సాఫ్ నాయకులు సాధతుల్లా, ప్రజా సంఘాల నాయకులు రంగస్వామీ, ఎర్రవల్లి రఘునాథ్ రెడ్డీ పాల్గొన్న సమావేశం కింది తీర్మా ణాల్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉపరాష్ట్రపతి గా జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థి త్వాన్ని బలపరు ద్దాం అని, కార్పొరేట్ శక్తులకు దేశ ప్రజలకూ జరుగుతున్న యుద్ధంలో ప్రజల ఓట్లతో గెలిసొచ్చి న ప్రజాప్రాతినిధులు ఎటువైపో తేల్చుకో వాలనాని,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి పార్లమెంటరీ సభ్యులుగా ఎంపికైన ఇద్దరు ఎం.పీ.లు సామాజిక బాధ్యతగా,రాజ్యాంగబద్ధ లౌకిక ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు సంఘీ భావంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని బల పరచాలనీ,పై డిమాండ్లను ఏకగ్రీవంగా ఆమోదించిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగిందని వారన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సంసిద్ధంగా ఉండాలి

- అధికారులు గురుకులాల సందర్శనను తప్పనిసరి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల పురోగతి, అమలులో ఉన్న అడ్డంకులు, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా చర్చ జరిగింది. అధికారులంతా సమన్వయంతో పనిచేసి, లక్ష్యాలను నిర్దిష్టంగా చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.అభివృద్ధి కార్యక్రమాల్లో పారదర్శకత, వేగవంతమైన అమలు మీద దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనీ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని విధిగా పాటించాలని, ఈనెల నుంచి బయోమెట్రిక్ హాజరు ద్వారానే కలెక్టరేట్ లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది జీతాలను విడుదల చేయనున్నట్లు, ఆ విధమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సమయపాలన పాటించని అధికారులు సిబ్బం దిపై కఠిన చర్యలు ఉంటాయని, తను ఆకస్మికంగా కార్యాలయాన్ని సందర్శిం చేటప్పుడు సిబ్బంది అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. గురుకులాల్లో బోధనాపద్ధతులు, వసతి, ఆహారం, ఆరోగ్య అంశాలపై సమీక్ష జరిపి, సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మండలాల ప్రత్యేక అధికారులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కావలసిన అన్ని ముందస్తు ఏర్పాట్లు విధిగా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల్లో అవసరం ఏర్పాట్లు నెలకొల్పేందుకు అధికారులు తమకు కేటాయించిన మండలాలను సందర్శించి ఎంపిడిఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

# చారిత్రాత్మక నిర్ణయంతో బీసీ శ్రేణుల్లో ఆనందం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కరీంనగర్ పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, నగర కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టపాసులు పేల్చి మిఠాయిలు పంచుతూ సంబరాలు నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచాల రాజేందర్ రావు, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డిలతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరై పార్టీ శ్రేణులతో కలిసి సంబరాల్లో పాల్గొని నృత్యాలు చేశారు. వెలిచాల రాజేందర్ రావు, పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం చెప్పింది చేస్తుందని ప్రతి కార్యకర్త గళ్ళ ఎగరేసుకొని చెప్పుకోవడానికి ఇది మరో నిదర్శనమని ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం రోజు కాంగ్రెస్ పార్టీ శ్రేణులమైన మేమంతా పండగ చేసుకుంటున్నామని, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, మాచర్ల ప్రసాద్, మడుపు మోహన్, అహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు పోరాటం



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సమ సమాజ ఆశయ సాధనకు పోరాటం సాగించాలని అనుబంధ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, విజయ్ పట్టణ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడులో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు పానుగల్ వనపర్తి గోపాల్పేట మండలాల నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో సుధాకర్ రెడ్డికి జోహార్లు అర్పించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా కంచుపాడులో జన్మించి ప్రజా పోరాటాలు ఊపిరిగా జాతీయ రాజకీయాలకు ఎదిగిన మచ్చలేని నాయకుడు అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని కడవరకు నమ్మి, పేదల పక్షాన పోరాటం సాగించారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జాతీయ పార్టీ నేతలను ఒప్పించారన్నారు. మాజీ సర్పంచ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జె. చంద్రయ్య,ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కన్వీనర్ జయమ్మ పాల్గొన్నారు.

# రూ. 20 వేలు నష్టపరిహారం అందించాలి

- మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వెలు నష్టపరిహారం అందించాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామం లోని రైతుల పంట పొలాలను పృథ్వీరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యన కురిసిన వర్షాలకు రైతుల పంటలు తీవ్రంగా నష్టపోయాయని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వెలు పరిహారం అందించాలని ప్రభుత్వానికి కోరారు. కార్యక్రమంలో వెంకట్రావు పాటిల్, టి. మల్లన్న ,ఏ. శేఖర్ ,ఏ.చంద్రప్ప, పాల్గొన్నారు.

# పుస్తక పఠనం మంచి అలవాటు

**రూమ్ టు రీడ్ రాష్ట్ర హెడ్ కేఎన్ చారి**



**చేర్యాల సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర విద్యాశాఖ సమన్వయంతో రూమ్ టు రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ రీడ్-ఎ-థాన్ కార్యక్రమాన్ని సెప్టెంబరు ఒకటో తేదీ నుండి 15వ తేదీ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చేర్యాల మండలంలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారము రోజు తెలంగాణ రాష్ట్ర హెడ్ సి కె నరసింహ చారి ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులచే ఉదయం 11 గంటల నుండి 11: 30 వరకు పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక పఠనం ఒక మంచి, గొప్ప అలవాటని, ఇది పాఠకులకు ఎంతో మేధాశక్తిని పెంపొందించుతుందని అన్నారు. దీనిని ప్రతి పాఠశాలలో ప్రతిరోజు ప్రతి విద్యార్థితో పాటు ఉపాధ్యాయులందరూ పుస్తక పఠనం గావించాలని అన్నారు. ఈ కార్యక్రమము ప్రపంచంలో 27 దేశాల్లో ,మనదేశంలో 14 రాష్ట్రాల్లో అమలు చేస్తు న్నామని అన్నారు. సిద్దిపేట జిల్లాలో ప్రస్తుతం 30 పాఠశాలల్లో అమలు చేస్తున్నామని అందులో భాగంగా చేర్యాల మండలంలో ఏడు పాఠశాలల్లో అమలుపరుస్తున్నామని తెలిపారు. ఈ విధమైన రీడింగ్ వల్ల యువకుల్లో, విద్యార్థుల్లో శ్రవణ, జీవన నైపుణ్యాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది కేఎన్ చారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు లు ఎలుకట్టే ఐలయ్య,ఉపాధ్యాయులు ఎస్ కృష్ణమూర్తి, టి పద్మ, ఏవిజయ్ కుమార్, జి ప్రకాష్ రెడ్డి, సిహెచ్ యాదగిరి, కే స్వర్ణ కుమార్, జి శ్రీధర్, ఎం శ్రీనివాసరావు, బీ ధనలక్ష్మి, ఎండి ఉమర్, మంజుల పాల్గొన్నారు.

# ఘోష్ కమీషన్ నివేదికను నిరసిస్తూ బిఆర్ఎస్ ఆందోళన



**చేర్యాల సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** చేర్యాల పట్టణంలో ని గాంధీ చౌరస్తా దగ్గర మ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశం మేరకు గోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ పై అసెంబ్లీలో చర్చకు తావివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాని కి వ్యతిరేకంగా బిఆర్ఎస్ చేర్యాల పట్టణ, మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు, ముస్త్యాల నాగేశ్వర రావు, అనంతుల మల్లేశం, రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాలనర్సయ్య, మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణా కర్, జిల్లా సభ్యులు అంకు గారి శ్రీధర్ రెడ్డి, గార్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుండి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, టిఆర్ఎస్ పార్టీ, పార్టీ ముఖ్య నేతలపై బురద చల్లే రాజకీయంలో భాగమే గోష్ కమిషన్ అని, కేంద్ర బిజెపి పార్టీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు నివేదికల ద్వారా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు తప్ప ప్రజలకు మంచి చేద్దామనే ఆలోచన లేదు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ మంగోల్ చంటి ,ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పూర్మ వెంక ట్ రెడ్డి, యూత్ ఇన్చార్జి శివ గారి అంజయ్య, పట్టణ కార్యదర్శి బురగోని తిరుపతి గౌడ్, మండల కార్యదర్శి కోతి దాస్, మండల వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెడతాల ఎల్లారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రాజేష్ గౌడ్, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు బిరెడ్డి ఇన్నారెడ్డి, వార్డు ఇన్చార్జులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు .

# సేవలోనే కాదు, క్రీడలోనూ ప్రతిభ

**మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి**



**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 01(జనంసాక్షి):** ఆగస్టు నెలలో తెలం గాణ యోగాసన అసోసియేషన్ ఆద్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి సీనియర్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ 2025లో వనజ పాల్గొంది. దీంట్లో ట్విస్టింగ్ బాడీ, ఫార్వర్డ్ బెండింగ్ ఈవెంట్ లలో మహిళా వనజ మొదటి స్థానం సాధించింది. దీంతో జిల్లాకు చేరుకున్న ఆమెను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ,.. "పోలీసు సేవలతో పాటు క్రీడా రంగంలో కూడా ప్రతిభను కనబరచడం ఒక గర్వకారణమన్నారు. వనజకు ఉన్న కృషి, క్రమశి క్షణ, పట్టుదల మనందరికీ ఆదర్శప్రాయమైనవి అన్నారు.. పోలీసు విభా గం తరపున ప్రతిభావంతులైన సిబ్బందికి ఎల్లప్పుడూ తన నుంచి ప్రో త్సాహం అందించబడుతుంది ఎస్పీ వెల్లడించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయి విజయాలను సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# జాతీయస్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కి ఎంపికైన కేజీఆర్ స్కూల్ విద్యార్థి



**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** ఇటీవల గద్వాల జిల్లా ఉత్తనూర్ లో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కట్ బాల్ టోర్నమెంట్ లో 75 జూనియర్ ఛాంపియన్ షిప్ టీంకి మెరుగైన ప్రతిభ కనబరిచిన కేజీఆర్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న వడ్డేపల్లి సుధన్వి జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. జగిత్యాల జిల్లా నుంచి జాతీయస్థాయికి తమ విద్యార్థి ఎంపిక కావడం ఆనందంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి విద్యార్థిని అభినందించారు. జాతీయ స్థాయి పోటీలు ఈనెల సెప్టెంబర్ 2 నుంచి 9వ తేది వరకు పంజాబ్ లోని లూథియానా లో జరగనున్నాయి. స్కిర్మీస్ బాస్కట్ బాల్ అకాడమీ ఫౌండర్ శ్రీరామ్, సంపత్, విజ్ఞాన్, ఇచ్చిన కోచింగ్ లో ప్రతిభను కనబరిచి నేషనల్ బాస్కట్ బాల్ టోర్నమెంట్ టీంకు సెలక్ట్ అయ్యానని విద్యార్థిని పేర్కొన్నారు. జగిత్యాల నుంచి సుధన్వి నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనను౦ది. విద్యార్థి నేషనల్ టోర్నమెంట్ కు ఎంపిక కావడంతో పలువురు అభినందించారు.

# వర్షాకాలం వరద ముప్పుపై ఫిర్యాదులు

- కాలువల ఆటంకాలు తొలగించాలంటూ వినతులు
- హైడ్రా ప్రజావాణికి 43 ఫిర్యాదులు



**హైదరాబాద్, సెప్టెంబరు 01 (జనంసాక్షి) :** వర్షాకాలం తమ కాలనీలలో వరద, మురుగు నీరు వచ్చి చేరుతోందని పలు కాలనీ నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మురుగు నీటి కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకుండా.. వదిలేయడంతో ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు. మురుగునీటి కాలువలకు ఎక్కడికక్కడ ఆటంకాలు సృష్టించడంతో వర్షం వచ్చినప్పుడు తమ నివాస ప్రాంతాలు నీట మునిగిన దృశ్యాలను చూపించి.. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 5లో వీధి నంబరు 1లో లే ఔట్ ప్రకారం 60 అడుగుల రహదారి ఉండగా ఇప్పుడు కేవలం 20 అడుగుల దారే మిగిలిందని ఓ మాజీ కేంద్ర అధికారి ఫిర్యాదు చేయగా.. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి విలేజీలో ఉన్న చిన్న, పెద్ద చెరువు కబ్జాలను నియంత్రించాలని ముప్పాస్ గ్రీన్ గ్రాండ్యుర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చుట్టు పక్కల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, .. మురుగు నీటిని చెరువులోకి వదిలేయడం వల్ల దుర్గం ధంగా మారుతోందని ఫిర్యాదులో ప్రతినిధులు పేర్కొన్నారు. ఒకప్పుడు ఎంతో ఆహ్లాదంగా జీవకో టికి ప్రాణాధారంగా ఉండే ఈ చెరువులో చేపలు చనిపోయి తేలుతున్నా యన్నారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 43 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యా దులను హైడ్రా కమిష నర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి, సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

# అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలి

**ఆస్పిరేషన్ నర్వ బ్లాక్ పై సమీక్షించిన కలెక్టర్**



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శాఖల వారీగా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో యాస్పిరేషన్ నర్వబ్లాక్ పై జిల్లా అధికారులు, నర్వ మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో ఉత్తమ పద్ధతుల చర్చ, వినూత్న ప్రాజెక్టు ప్రతిపాదన సమర్పణ సమావేశం నిర్వహించారు. కీలక పనితీరు సూచికల సంతృప్తత కోసం, ఇన్‌కమిటీని మెరుగుపరచడానికి నర్వ బ్లాక్‌లో అమలు చేయడానికి వినూత్న ఆలోచనలను సమర్పిం చాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.నర్వ మండలంలో రైతుల ఆదాయం పెంపుదల ఆలోచనలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పించే ప్రాజెక్టులు, నీటి సంరక్షణ పద్ధతులు, పాడి ప్రాజెక్టులు సమర్పించాల ని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ నెల 3న నీతి అయోగ్ సీఈవోతో వీడియో కాన్ఫరెన్స్ ఉందని, అంతలోపు వి నూత్న ప్రాజెక్టు ప్రతిపాదనలను శాఖల వారీగా సంబంధిత అధికారులు పంపించాలని కోరారు. ఈ నెల5న డీపీఆర్‌ను పంపించాల్సి ఉంటుందని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శైలేష్ కుమార్, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్, మిషన్ భగీరథ డీ ఈ రంగారావు, జిల్లా పంచాయతీ అధికారి ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అమరవీల స్తూపానికి జలాభిషేకం

**మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అరెస్ట్**



**చిన్నశంకరంపేట సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** తెలంగాణ అమరుల ఆత్మకు శాంతి కలగాలని టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై రాష్ట్ర ప్రభుత్వం అనుచిత వ్యాఖ్యతో తెలంగాణ అమరవీరుల ఆత్మ గోషిస్తుందని టిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో టిఆర్ఎస్ జిల్లా నాయకురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ చేగుంట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న చిన్న శంకరంపేట స్థానిక ఎస్సై నారాయణ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించారు. మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, వినకపోవడంతో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, నార్సింగ్ మండల అధ్యక్షులు కమ్మరి బాబు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అవినీతిని సిబిఐకి అప్పగించడంతో బిఆర్ఎస్‌లో వణుకు

- ఎన్ని డ్రామాలు చేసిన చివరకు జైలుకు వెళ్ళక తప్పదు
- సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణకు సీబీఐ కి అప్పజెప్పడంతో బిఆర్ఎస్ నాయకుల్లో వణుకు మొదలైందని ఎలాగైనా ప్రజలను గందరగోళంలో పడేయాలని డ్రామాలకు తెర లేపారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మానేర్ డ్యాం నీళ్లు తీసుకొచ్చి కాళేశ్వరం జలాలు అంటూ అమరవీరుల స్తూపం పై నీళ్లు చల్లి అమరవీరులను అవమానపరిచారని అందుకే అమరవీరుల స్థూపానికి పాలాభిషేకం చేశామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ అన్ని ఆధారాలు బయట పెట్టిందని కాళేశ్వరం ప్రాజెక్టులోని మిగితా బ్యారేజీలు లింక్ కెనాల్ లలో కూడా నాసిరకం నాణ్యత లోపం ఉందని స్పష్టంగా పేర్కొన్నదని నరేందర్ రెడ్డి తెలిపారు. ఇన్నాళ్లు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఆహా ఓహో అని పొగడిన బిఆర్ఎస్ నాయకులకు అవినీతి బండారం బయటపడుతుండడంతో డ్రామాలు మొదలుపెట్టారని నరేందర్ రెడ్డి అన్నారు. ఎన్ని డ్రామాలు చేసినా చివరకు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జైలుకు వెళ్ళక తప్పదని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం లో ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, సమద్ నవాబ్, వెన్న రాజమల్లయ్య, దండి రవీందర్, అక్బర్ అలీ, సలీం, కుర్ర పోచయ్య, వంగల విద్యాసాగర్, ఎండి చాంద్ పాషా, నెల్లి నరేష్, బషీర్, మహమ్మద్ భారీ, షభానా మహమ్మద్, అస్థాపురం రమేష్, కుంభాల రాజ్ కుమార్, ముల్కల కవిత, షెహెన్షా, అస్థాపురం తిరుమల, సుదర్శన్, ఎల్లారెడ్డి, కిరణ్ రెడ్డి, లింగమూర్తి, జమీల్ పాల్గొన్నారు.

# సింగూర్ బ్యాక్ వాటర్ తో తీవ్ర నష్టం



**న్యాల్ కల్, సెప్టెంబర్ 01, (జనంసాక్షి) :** జూలై, ఆగస్టు మాసంలో కురిసిన భారీ వర్షాలతో మంజీరా నది, సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడం, సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తో మండలంలోని వివిధ ముంపు గ్రామాల్లోని పట్టా భూముల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరిందని, పలువురు రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని వాపోయారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమానికి మండలంలోని చీకూర్తి గ్రామానికి చెందిన రైతు జనార్దన్ రెడ్డి.."ప్రజావాణి"కి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టి గురించి బాధిత రైతులను ఆదుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఇటుక బట్టీలను సీజ్ చేయండి

- ఇటుక బట్టీల నిర్వాహకులపై ప్రజావాణిలో ఫిర్యాదు



**జమ్మికుంట,సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ శివారులో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని సోమవారం జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన దొగ్గల ప్రకాష్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ గడ్డం శంకర్ కి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ మున్సిపల్ కు కూతవేటు దూరంలో ఉన్న మండలంలోని మడిపల్లి గ్రామ శివారులో 401, 407, 408, 409 సర్వే నంబర్లలో సుమా రు 10 ఎకరాల వ్యవసాయ భూమిలో జమ్మికుంట తహసిల్దార్ నుండి నాలా పర్మిషన్ తీసుకోకుండా, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండా ఇటుక బట్టీల నిర్వహణ చేపడుతున్న విషయంపై రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ కి ఫిర్యాదు చేసినట్లు ప్రకాష్ తెలిపారు. జమ్మికుంట మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ చేపడుతున్నప్పటికీ సంబంధిత నిర్వాహకులపై తగు చర్యలు తీసు కోవాలని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఇటుక బట్టీల నిర్వాహకులకు పూర్తిస్థాయిలో అనుమతులు ఉండేవిధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవసాయానికి ఉపయోగపడే భూమిలో ఇటుక బట్టీలు నిర్వహిం చడం చట్ట విరుద్ధమని ఆయన అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.ఇట్టి ఫిర్యాదుపై స్థానిక తహసిల్దార్ దృష్టికి తీసుకు వెళ్లి దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితగు చర్యలు తీసుకుంటామని ఆర్ఐ శంకర్ చెప్పినట్లు ప్రకాష్ తెలిపారు.

# 'చిట్టి' చేష్టలకు మిక్కిలి అండదండలు!

- బాధితులవుతున్న ఖమ్మం ప్రజానీకం
- ఆరా తీస్తున్న ఇంటలిజెన్స్ విభాగం




**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**
*'చిట్టి' చేతులతో స్టేషన్‌కు అన్యాయం అనే శీర్షికతో జనంసాక్షి ప్రచురించిన కథనానికి విశేష స్పందన లభించింది. ఖాకీ యూనిఫార్మ్‌ను అడ్డుపెట్టి చేసిన అవినీతిని ప్రజలు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. ఈ కథనంపై పోలీసు ఉన్నతాధికారులు పలు కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఇప్పటికే చిట్టి చేతులు చాచి పొందిన అవినీతి వ్యవహారంపై ఇంటి లిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. బిఆర్ఎస్ హాయాంలో పనిచేసిన పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో వసూళ్లు చేసిన తీరుపై సమగ్ర విచారణ జరుపుతున్నారు.*

ప్రస్తుతం పనిచేస్తున్న మహిళ స్టేషన్‌లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించిన కేసులూ, పెండింగ్‌లో ఉంచిన కేసులూ, వాటి నేపథ్యంపై పోలీస్ ఉన్నతాధికారులు రిపోర్టు అడిగినట్లు సమాచారం. ఖమ్మం జిల్లాతో ఎలాంటి సంబంధం లేకపోయినా నెల్లూరు జిల్లా వాస్తవ్యుడైనప్పటికీ ఇక్కడ ఇంటి నిర్మాణం చేపట్టడానికి గల కారణంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. మోకిలాలో, శ్రీరామ్ హిల్స్ సహా అనేకచోట్ల భారీగా ఆస్తులు సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుత పోస్టింగ్ కాకుండా మరో పోస్టింగ్ కోసం "విష" ప్రయత్నాల్లో ఉన్నాడనీ విశ్వసనీయ సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో పోలీస్ ఉన్నతాధికారులు ఇతని అక్రమ సంపాదన సమగ్ర విచారణ జరపాల్సిన ఆవశ్యకత ఉంది. అనేకమందిలాగే ఇతను బిఆర్ఎస్‌కు ఊడిగం చేసిన సంగతి అందరికీ తెలిసినా.. ఆయనపై చర్యలకు ఎందుకు పూనుకోవడం లేదో పెద్దలే తేల్చాలి. మిగతా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పోలీసులపై వివక్ష కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి. తప్పుచేసిన మనోడనుకుంటే కాపాడుకుంటూ మిగతావారిని బలిచేస్తారా అనే ప్రశ్న ఇతరుల్లో తలెత్తుతోంది. అనేకమంది ఖాకీలు బిఆర్ఎస్‌తో అంటకాగినందుకు పలుచోట్ల లూప్ లైన్లలో శిక్ష అనుభవిస్తున్నారు. ఈయన మాత్రం వేరే జిల్లాకు బదిలీపై వెళ్లినట్టే వెళ్లి మళ్లీ ఈ జిల్లాకే వచ్చి పోస్టింగు పొందడం వెనుక ఎవరున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న..!

**చెలామణిలో మళ్లీ వాళ్లే..**

మాజీ డిసిపి బోస్, మాజీ రిటైర్డ్ ఏసీపీలకు నేటికి చాకిరి చేస్తున్న వారెందరో ఉన్నారు. వాళ్లు నేడు పెద్ద మనుషుల్లాగా చెలామణి అవుతున్నారు. పోస్టింగుల విషయంలో తాము చెబితేనే వస్తాయని పైరవీలు మొదలుపెట్టారు. ప్రత్యేక్షంగా జోక్యం చేసుకోకుండా అర్ధరాత్రి ఫోన్ కాల్స్ మాట్లాడే వ్యక్తులతో మాట్లాడి పనయ్యే మార్గాలను, వ్యక్తులను ముందుపెడుతున్నారు. జిల్లాతో సంబంధంలేని అవినీతి ముఠా రాజకీయ జోక్యం వల్ల మిగతావర్గాలు అన్యాయానికి గురౌతున్నాయి. కాంగ్రెస్ ఓ వర్గం బిఆర్ఎస్‌కు వెట్టి చాకిరీ చేసినవారితో అంటకాగుతున్నారు. దానికి ప్రధానంగా సామాజిక కోణం అన్నట్లు స్పష్టం అవుతుంది. కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేసిన వర్గాలు కనుమరుగైయ్యాయి. పనిచేయని పటాలాలన్ని మార్కెట్‌లో చెలామణి అవుతున్నాయి. మళ్లీ గులాబీ వాసన రావడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

**కేసులు కట్టినోళ్లకే కీలక పోస్టింగులా?**

అమాత్యుల వారికి తెలియకుండా కింది స్థాయిలో ఉన్న ఒకరిద్దరు ఇలాంటి బ్రోకర్ పనులు చేస్తున్నారు తప్పా నిఖార్సైన కాంగ్రెస్ శ్రేణులు బిఆర్ఎస్‌తో సత్సంబంధాలున్న వారి పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. బిఆర్ఎస్ ర్యాలీలు నిర్వహిస్తే పట్టుకెళ్లి బలవంతంగా కేసులు పెట్టిన వారు ఈరోజు మళ్లీ కీలక పోస్టింగులు పొందాలని చూడటం సంభ్రమశ్చర్యాలకు గురిచేసే అంశం. పోలీస్ శాఖలో అనేకమంది కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, కావాలని కోరుకున్నారు. అలాంటివారు కనీసం దరిదాపుల్లో లేకుండా పోయారు. అవినీతి చిట్టా ఉన్నవారిని బిఆర్ఎస్‌తో బంధుత్వం ఉన్నవారిని దూరం పెట్టుకుంటే అదే 50వేలనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తెరగాలి. 'చిట్టి' చేతుల అవినీతిని ఎడగడితే ఆయనకు కోపం వచ్చింది. అసలే వివాదాలు సృష్టించుకోవడం ఆయనకు మిక్కిలి సరదా. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పదేపదే చెబుతున్న సదరు 'సారు'.. తనపై వార్త రాయగానే జనంసాక్షి రిపోర్టర్‌కు ఫోన్లు చేసి బెదిరించే పరిస్థితి వచ్చింది. మరొక్క వార్త రాస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు కూడా. ఈ పద్ధతి ఇలాగే కొనసాగిస్తే కాంగ్రెస్ పెద్దలు కలలు సాకారమయ్యే ఛాన్సే లేదని సదరు నాయకుడికి బోధపడాలి. దీనిపై జిల్లా మంత్రులూ ఆరాతీయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# నిఖార్సైన తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపిద్దాం

- ఉపరాష్ట్రపతి అభ్యర్థి పరిచయ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు



**హైదరాబాద్, సెప్టెంబరు 01 (జనంసాక్షి) :** నిఖార్సైన తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారికి తోడు నిలుద్దామని... భారత ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఆత్మప్రబోధానుసారం ఓటు వేసి ఆయన్ను గెలిపిద్దామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పరిచయ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రత్యేకంగా కలిసి... సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయనతో పాటు లంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఢిల్లీలో తెలుగు రాజకీయ నాయకుల హవా క్రమంగా తగ్గిపోతున్న తరుణంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి ఎన్నిక పోటీలో ఉండటం మన అందరికీ సంతోషకరమైన విషయమన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు, పుచ్చలపల్లి సుందరయ్య, నీలం సంజీవరెడ్డి , వి.వి.గిరి, పీవీ నరసింహరావు, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు, ఎన్టీ రామారావు తర్వాత మన తెలుగువారిని నిలుపుకోవాల్సిన బాధ్యత సాటి తెలుగు బిడ్డలుగా మన అందరిపై ఉన్నదని గుర్తు చేశారు. ప్రస్తుత మోడీ పాలనలో దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలన్నీ ప్రమాదంలో పడ్డాయని... అందుచేత, రాజ్యాంగం మీద సంపూర్ణ అవగాహన... దాన్ని ఆకలింపు చేసుకున్న వ్యక్తినే ఇండియా కూటమి బరిలోకి దింపిందని చెప్పారు. భారత రాజ్యాంగం పరిరక్షించబడాలంటే... ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలవాల్సిన అనివార్యత ఉందని గుర్తు చేశారు. అంత న్యా కోవిదుడి గెలుపుకోసం తాము కృషి చేస్తామని మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు.

# బీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదం


**పాలమూరులో కాంగ్రెస్ నాయకుల సంబరాలు**



మహబూబ్ నగర్ సెప్టెంబర్ 01(జనం సాక్షి ) : బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో పాస్ కావడంపై సోమవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. స్థానిక న్యూటౌన్ లోని మల్లికార్జున్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, నాయకులు ఎన్పీ.వెంకటేశ్, సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, అజ్మత్ అలీ, అవేజ్, షబ్బీర్ అహ్మద్, గంజి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిపై కట్టుదిట్టమైన నిఘా పెట్టాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 1 జనంసాక్షి :**
వనపర్తి జిల్లాలో గంజాయి,ఇతర మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేయడం కానీ వినియోగించడం కానీ జరుగకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.సోమవారం ఐ.డి. ఒసి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి నార్కోటిక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల నుండి నివేదిక తీసుకోవడంతో పాటు బాధ్యతలను అప్పగించారు.మాదక ద్రవ్యాల సరఫరా పై పాఠశాలలు,కళాశాలల పరిసరాల్లో ఉన్న క్యాంటీన్ లు, పాన్ షాప్‌లు, వైన్ షాపులలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెట్టాలని ఆబ్కారీ,డ్రగ్ ఇన్స్పెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలను క్రియాశీలంగా మార్చి ప్రతి నెల మొదటి శుక్రవారం యాంటీ డ్రగ్ సమావేశాలు నిర్వహించి విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు జరిగే విధంగా చూడాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు.డిఎస్పీ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో 6 కేసులు నమోదు అయినట్టు తెలిపారు.ఇందులో వనపర్తి పట్టణంలో 2, గోపాల్ పేట మండల పరిధిలో 2,పెబ్బేరులో 2 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలు వినియోగించే వారిపై, సరఫరా చేసే వారిపై, గంజాయి పండించే వారిపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల శిక్షణ పొందిన పోలీస్ శునకాలు మాదక ద్రవ్యాలను సులువుగా గుర్తిస్తున్నాయని వీటి సహాయంతో అనుమానం ఉన్న ప్రతి చోట తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అనుమానం వస్తే కళాశాలల్లో ను శునకాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య, ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చెరువుల పునరుద్ధరణ వేగంగా జరగాలి

**క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్**

**హైదరాబాద్, సెప్టెంబరు 01 (జనంసాక్షి) :**
నగరంలోని చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా జరగాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అధికారులను ఆదేశించారు. మొదట విడత చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణ త్వరగా పూర్తి కావాలన్నారు. ఈ క్రమంలో ఇటీవల అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుక్‌నుద్దౌలా చెరువులను సందర్శించిన హైడ్రా కమిషనర్ సోమవారం సున్నం చెరువును పరిశీలించారు. అలాగే నార్సింగ్ వద్ద సీఎస్ ఆర్ (సామాజిక బాధ్యత) లో భాగంగా తత్వ రియల్ ఎస్టేట్ సంస్థ చేపట్టిన ముష్కి చెరువును కూడా సందర్శించారు. సున్నం చెరువులో డెబ్రీస్‌ను తొలగించే పనులను పర్యవేక్షించారు. చెరువులోకి వరద నీరు నేరుగా చేరేందుకు వీలుగా వెంటనే ఇన్‌లెట్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువు పై భాగంలోని ప్రాంతాల్లో వరద సాఫీగా కిందకు సాగడంలేదనే ఫిర్యాదుల నేపథ్యంలో చెరువు ఇన్‌లెట్ల పనుల ఆవశ్యకతను వివరించారు. అలాగే మురుగు కాలువ డైవర్షన్ పనులు కూడా పూర్తి కావాలన్నారు. ఈ వర్షాకాలంలోనే చెరువుల పునరుద్ధరణ జరగాలని సూచించారు.

**సీఎస్ ఆర్ నిధులు సద్వినియోగం కావాలి..**

సీఎస్ ఆర్ (సామాజిక బాధ్యత) కింద పలు సంస్థలు సమకూరుస్తున్న నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు సూచించారు. నార్సింగ్, మణికొండ మున్సిపాలిటీలో సీఎస్ ఆర్ కింద అభివృద్ధి చెందుతున్న ముష్కి చెరువును పరిశీలించారు. ముష్కి చెరువు బండ్ పేరిట ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో పోసిన మట్టిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశించిన హైడ్రా కమిషనర్ ఆ పనుల్లో జాప్యం జరగకుండా హైడ్రా మిషనరీని కూడా దించాలని అధికారులకు సూచించారు. చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని స్థానికులు ఈ సందర్భంగా కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. చెరువులో మురుగు నీరు కలవకుండా చూడాలని.. చెరువు బండ్‌పై భారీమొత్తంలో మొక్కలను నాటి.. గ్రీనరీ అభివృద్ధి చేయాలన్నారు. పార్కును కూడా అభివృద్ధి చేస్తే ఇక్కడ అనేక నివాసప్రాంతాలవారికి ఎంతో వెసులుబాటుగా ఉంటుందని కమిషనర్‌ను కోరారు.

**ఉత్సవాలకు బతుకమ్మ కుంట సిద్ధం కావాలి..**

సెప్టెంబరు 21న బతుకమ్మ ఉత్సవాలు భారీయెత్తున జరగనున్న నేపథ్యంలో అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణ, సుందరీకరణ పనులు త్వరగా పూర్తి కావాలని సూచించారు. చెరువు చుట్టూ సుందరీకరణతో పాటు.. అందరూ కూర్చొని సేదదీరేవిధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అలాగే పాతబస్తీలోని బమ్రుక్‌నుద్దౌలా చెరువు పునరుద్ధరణ కూడా వేగం కావాలని సూచించారు. చెరువులోకి వర్షపు నీరు సాఫీగా సాగేందుకు ఇన్‌లెట్లను అభివృద్ధి చేయాలన్నారు. మొదటి విడతగా చేపట్టిన 6 చెరువులలో కూకట్‌పల్లి నల్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మ చెరువుల అభివృద్ధి దాదాపుగా పూర్తి అవ్వగా.. మిగతా చెరువులను కూడా ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని సూచించారు. .



# ఖానాపురం హవేలీ ఎస్ఐ ఔదార్యం

**దహన సంస్కారాలకు ఆర్థిక సాయం**

**ఖమ్మం, (జనం సాక్షి):** పాలేరు నియోజకవర్గంలోని 59వ డివిజన్ దానవాయిగూడెం కాలనీలో విషాదం నెలకొంది. స్థానికుడు బొడ్డు కృష్ణ సోమవారం ఉదయం నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవ శాత్తు కిందపడిపోవడంతో తలకు రాయి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పంచనామా నిర్వహించేందుకు అక్కడికి చేరుకున్న ఖానాపురం హవేలీ ఎస్ఐ శ్రావణ్ మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబ పరిస్థితులు స్థానికుల ద్వారా తెలుసుకుని దహన సంస్కారాలకు తనవంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా కృష్ణ తదితరులు కూడా అక్కడ పాల్గొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఎస్ఐ ఔదార్యానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇన్‌స్టా రేపిన చిచ్చు.. కత్తితో భార్యపై దాడి

**జగద్గిరిగుట్ట :** వాళ్లిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యాభర్తలు. కొన్నేండ్లు సజావుగానే కలిసి కాపురం చేశారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వారి కాపురంలో చిచ్చురేపింది. భార్యపై భర్త అనుమానం పెంచుకున్నాడు. కత్తితో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత తనను తాను కత్తితో గాయపర్చుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని జగద్దిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది.




హైదరాబాద్ : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని, పారితోషకాలు తగ్గించాలని దుర్మార్గమైన ఆలోచన విరమించుకోవాలని, కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం 18000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని తదితర సమస్యలపై హైదరాబాద్‌లోని కోఠి హెల్త్ డైరెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాకు భారీ సంఖ్యలో హాజరైన ఆశా కార్యకర్తలు, ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర, జిల్లాల నాయకులు

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గద్వాల జిల్లా ఎన్నికల ప్రమాణోత్సవం

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబరు 1 (జనం సాక్షి) :**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా పాలకమండలి సభ్యుల ఎన్నికలు ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలి 2025-2028 మూడేళ్ల పదవీకాలానికి గాను జరిగిన ఎన్నికలు, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో విజయవంతంగా పూర్తి చేయబడిందని తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు. ఈ ఎన్నికల్లో సంగాల అయ్యప్ప రెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా జి.రమేష్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యునిగా, డిఎండి తాహిర్ వైస్ చైర్మన్‌గా, ధనలక్ష్మి ఖజాంచీగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.జిల్లా కార్యనిర్వాహక సభ్యులుగా కరాటే శ్రీహరి,ఎండీ అప్సర్ పాషా,చాగాపురం లక్ష్మీనారాయణ గౌడ్,బండారి పాల్ సుధాకర్, వరదా రవికుమార్, గంగాధర్ గౌడ్, జయరామయ్య, మోహన్ రావు,అక్బర్ బాషా, నల్లా రెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు. తదనంతరం కొత్తగా ఎన్నికైన పాలకమండలి సభ్యులను ఎన్నికల అధికారి సొసైటీ సభ్యులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా అభినందించారు.

# డీజేలకు స్వస్తి పలికి, సాంప్రదాయ పద్ధతిలో పండగలు

**జిల్లాలో 8 డీజేలు సీజ్ : ఎస్పీ యోగేష్ గౌతమ్**



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):** నారాయణపేట జిల్లాలో డీజేలకు స్వస్తి పలికి, సాంప్రదాయ పద్ధతిలో తమ పండగలు జరుపుకోనీ ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నా రు. సుప్రీంకోర్టు ఆదేశాల మేర కు శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని నారాయణపేట జిల్లా పరిధిలో డీజేలను నిషే ధించడం జరిగిందని తెలి పారు. డీజే వలన శబ్ద కాలుష్యం పెరిగి చిన్న పిల్లలు విద్యార్థులు, వృద్ధులు, రోగు లు, తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని, హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఉందన్నారు. అలాగే డీజే సంస్కృతి యువ తలో తప్పుదారి పట్టించే పరిస్థితులను సృష్టిస్తుందని అందువల్ల డి జేల వినియోగా న్ని పూర్తిగా జిల్లాలో నిషేధిం చడం జరిగిందని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండగల సందర్భంగా జిల్లా పరిధిలో పలుమార్లు హిందూ ముస్లిం మత పెద్దలతో శాంతి సమా వేశాలు ఏర్పాటు చేసి డీజేలు నిషేధించడమైనదని తెలిపి, ఆర్డిఓ ఆర్డర్ కాపీ అందరికీ ఇచ్చిన కొందరు కావాలని డీజే లను పెట్టినందున జిల్లా పరిధిలో నారాయణపేట టౌన్ లో 2, రూరల్ పోలీస్ స్టేషన్లో 3, దామరగిద్దలో 2, మద్దూర్ లో 1 మొత్తం 8 డీజే లను సీజ్ చేయడం జరిగింద ని ఎస్పీ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుండి నారాయణపేట జిల్లాకు డిజెలు రాకుం డా మొత్తం ఐదు బోర్డర్ చెక్పో స్టను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎవరై నా డీజే లు పెడితే వాటిని సీజ్ చేసి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకో వడం జరుగుతుందని హెచ్చ రించారు.సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి డీజేలను చూపించి నాలుగు బాక్సుల కొద్దీ ఎక్కువ సౌండ్ బాక్స్ లు ఉన్న వాటిని సీజ్ చేస్తామని ఎస్పీ తెలిపారు.జిల్లా ప్రజల కు ఎస్పీ విజ్ఞప్తి చేస్తూ డీజె ల సంస్కృతికి స్వస్తి చెప్పి మన సాంప్రదాయ పద్ధతిలో పండు గలు జరుపుకుందాం అని కోలాటం, బ్యాండ్ డబ్బులతో ఉత్సవాలను నిర్వహించు కోవాలని డీజెలను విడనాడి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# యువకులను చితకబాదిన గట్టుప్పల్ ఎస్సై

- వికలాంగుడి అరచేతులపై, అరికాళ్లపై కర్రలతో దాడి
- అనుమతి లేకున్నా డీజే ఎలా పెడుతారంటూ ప్రతాపం
- రాత్రంతా పోలీస్‌స్టేషన్‌లోనేఉంచి ఇబ్బందులు పెట్టిన వైనం



**మర్రిగూడ/గట్టుప్పల్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :**
యువకులను రాత్రంతా స్టేషన్‌లోనే ఉంచి దాడిచేసిన ఘటన గట్టుప్పల్ మండలంలో చోటుచేసుకుంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా వారిని రాత్రంతా స్టేషన్‌లో ఉంచి ఇబ్బందులు పెట్టిన వైనమిది. వివరాల్లోకెళ్తే.. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలంలో నామపురంలో గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ యువకులు నిమజ్జనం నిర్వహించారు. అనుమతి లేకున్నా గణేష్ ఉత్సవ కమిటీ ఆర్గనైజర్ డీజేని ఏర్పాటు చేశాడు. పోలీసులకు సమాచారం అందడంతో గట్టుపల్ ఎస్సై సంజీవరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని డీజే వాహనంతో పాటు డీజే నిర్వాహకులను గట్టుప్పల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాత్రంతా తీవ్రంగా కొట్టారని, చిత్రహింసలు పెట్టారని బాధితులు వాపోతున్నారు. ఒకరు వికలాగుండైనప్పటికీ కనికరం చూపకుండా ఎస్సై దాడి చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. బయట చెపితే అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తానని బెదిరించాడని ఆవేదనకు గురవుతున్నారు. బూతు మాటలు తిడుతూ కనీసం తాగడానికి నీళ్లు, భోజనం కూడా పెట్టకుండా రాత్రంతా అరికాళ్లపై కొట్టారని కన్నీంటి పర్యంతమవుతున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆర్గనైజర్‌ను వదిలివేయడంపై అనేక ప్రశ్నలు వస్తున్నాయి. అధికార పార్టీకి చెందినవారు కావడంతోనే కేసు నమోదు చేయలేదని స్థానికులు గుసగుసలాడుతున్నారు.

యువకులను చితకబాదిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.


జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
2 సెప్టెంబర్ 2025




2009లో సల్వాజుడుం అరాచకాలపై ఎంఎం రహమాన్ ఫీల్డ్ విజిట్ చేసి రాసిన 'చలో చత్తీస్‌ఘడ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

## నిస్కర్ష, నిక్కచ్చితనం జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యక్తిత్వం

**కె శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్**



ప్రస్తుతం భారత రాజ్యాంగం ప్రమాదంలో పడే ఘంటికలు కనిపిస్తున్నాయి. దాని ప్రజలు, మేధావులు కాపాడుకునే ప్రయత్నం చేయాలి. ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపైన అదే రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై అర్బన్ నక్సలైట్ అంటూ వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు. రాజ్యాంగ స్ఫూర్తి, గెలుపు ఓటములు. కానీ ఉప రాష్ట్రపతి ఎన్నిక ఓ మంచి చర్చకు దారితీసింది. చాలా అంశాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. ప్రజాస్వామిక అంశాలను నిస్కర్షగా, నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా వ్యక్తపరచడంలో సుదర్శన్ రెడ్డి వెనుకాడరు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ స్వరూపాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముందుకొచ్చిన సుదర్శన్ రెడ్డికి అభినందనలు.

# దేశం మొత్తం జస్టిస్ సుదర్శన్‌రెడ్డివైపే .. చూస్తోంది

## ఉపరాష్ట్రపతిగా గెలిపించాలని ఎంపీలందరికీ లేఖలు

### విలువలూ.. రాజ్యాంగమూ.. ప్రజాస్వామ్యానికి ఓటువేయండి

### జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా పౌర సమాజం తీర్మానం

### ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని రౌండ్‌టేబుల్‌లో వక్తల పిలుపు

## రాజ్యాంగాన్ని కాపాడేందుకు తెలుగు బిడ్డకు ఓటేయాలి

**బిఎస్ రాములు, తెలంగాణ తొలి బిసి కమిషన్ చైర్మన్**



రాజ్యాంగం వల్ల మనిషి స్వేచ్ఛగా ఉన్నాడు. ఈ దేశం భిన్నత్వంలో ఏకత్వం. కానీ ఆరెస్సెస్ భావాజాలాన్ని విపరీతంగా ప్రచారం చేస్తూ చదువుకున్న వారిని కూడా మానసిక వికలాంగులుగా మార్చేస్తున్నారు. మనుషులను విడదీసి పాలిస్తున్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వడం స్వేచ్ఛ, సమానత్వంకు మద్దతు పలికినట్టే. పార్లమెంటు సభ్యులకు, అన్ని పార్టీలకు నా విజ్ఞప్తి ఏంటంటే.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటం కోసం తెలుగు బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటువేయండి. ఉపరాష్ట్రపతిగా పార్టీలకతీతంగా ఎన్నుకోండి. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందంటే సరైన సుదర్శన్ రెడ్డి సరైన అభ్యర్థి అన్నట్టు.

## సల్వాజుడుం తీర్పు రాజ్యాంగ బద్ధమైన తీర్పు

**ఎన్ .వేణుగోపాల్, వీక్షణం ఎడిటర్**



సల్వాజుడుం విషయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పు రాజ్యాంగ బద్ధమైన తీర్పు అని సీనియర్ జర్నలిస్టు ఎన్ వేణుగోపాల్ అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఫాసిజం విధానాలను అవలంబిస్తుందని, సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా ప్రకటించగానే సంబంధం లేని మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు. అర్బన్ నక్సలైట్‌ను ఓడించండి అని మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వడం చూస్తే అమిత్ షాకు భయం పట్టుకుందన్నారు. సల్వాజుడుం తీర్పు ఇవ్వకపోతే 20 ఏళ్ల క్రితం నక్సలైట్లు ఖతమయ్యే వారని మీడియాలో ఏవిధంగా మాట్లాడతారని ప్రశ్నించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు అనుభవిస్తున్నవారు రాజ్యాంగానికి కంకణబద్ధులై ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును ఎలా తప్పుబడతారని షా వ్యాఖ్యలపై మండి పడ్డారు. ఎంపీలందరూ ఆరెస్సెస్‌వైపు ఉంటారా? ఆత్మప్రబోధానుసారం ఉంటారా? ఆలోచించుకోవాలి.

## ఓటు వేయకుంటే 'తెలుగు ఆత్మగౌరవం' ఇక నిషేధమే

**ఎంఎం రహమాన్, సీనియర్ పాత్రికేయులు**



ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిలబడ్డారు కాబట్టే దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. తెలుగు రాష్ట్ర పార్టీలు కచ్చితంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటువేయాలి. లేకపోతే తెలుగువాడి ఆత్మగౌరవం అనే పదం వాడటానికి వీల్లేదు. ఆయనకు ఓటు వేయకపోతే నిషేధంలోకి వెళ్లిపోతుంది. వెంకయ్య నాయుడి విషయంలో ఆత్మగౌరవం గుర్తుకొచ్చిన ప్రతి ఒక్కరూ, ప్రతి పార్టీ జస్టిస్ సుదర్శన్ రెడ్డి విషయంలో ఎందుకు పక్కకుపోయాయో..? దీన్ని తెలుగు రాష్ట్రాలు.. మరీ ముఖ్యంగా తెలంగాణ సమాజం కచ్చితంగా ప్రశ్నిస్తుంది. ఉపరాష్ట్రపతిగా ఆయనకు మద్దతు ఇవ్వనివారు 'తెలుగువాడు.. ఆత్మగౌరవం' అంటూ మాట్లాడే నైతిక అర్హత కోల్పోయినట్టే.

## ప్రజాస్వామ్యానికి దక్కిన గౌరవం

**విరహత్ అలీ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు**



సల్వాజుడుం తీర్పును బీజేపీ ప్రచార అస్త్రంగా వాడుదామనుకుంటోంది. కానీ దేశవ్యాప్తంగా సల్వాజుడుం తీర్పుపై చర్చ మొదలైంది. అమిత్ షా వల్ల ఇది సాధ్యమైంది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మంచి తీర్పు ఇచ్చారనే చర్చ సాగుతోంది. ఆయన ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికవడమంటేనే ప్రజాస్వామ్యానికి దక్కిన గౌరవం. అటువంటి వ్యక్తులుంటే అణగారినవర్గాల గొంతుక ఫరిడవిల్లుతుంది.

## జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం ప్రజాస్వామ్యానికి సూచిక

**రాఘవాచారి, పాలమూరు అధ్యయన వేదిక**



సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును తప్పుబట్టడం సమంజసం కాదు. ఆ తీర్పును తప్పుబట్టే ముందు దానిని పూర్తిగా చదవాలి. గతంలో తమపై వచ్చిన కోర్టుల తీర్పులను ఇందిరాగాంధీ, జయలలిత కూడా ఏనాడూ తప్పుబట్టలేదు. రాజ్యాంగబద్ధమైన వారికి మాత్రమే ఓటువేయాలి. రాజ్యాంగేతర శక్తులకు ఓటు వేయొద్దు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం దేశంలో కనీస ప్రజాస్వామ్యం ఉందనే ప్రయత్నం. ప్రస్తుతం ప్రజాస్వామ్యానికీ, ఫాసిజానికి మధ్య సంఘర్షణ కొనసాగుతోంది. ఇందులో మనవంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది.

## ఇదొక మంచి సదావకాశం

**సయ్యద్ రఫీ, ఫిల్మ్ డైరెక్టర్**



ఇంత చర్చకు దారితీయించిన అమిత్ షాకు ధన్యవాదాలు. మన ఎంపీలు రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి. గుండె మీద చెయ్యి వేసుకుని ఓటువేయాలి. కొంతమంది కేసుల్లో ఇరుక్కుపోయి వాషింగ్ పౌడర్ నిర్మాలాగా మారుతున్నారు. అలాంటివారు మీ ఓటు ద్వారా సరైన అభ్యర్థిని ఎన్నుకోండి. మంచి పనిచేసేందుకు ఇదొక సదావకాశంగా భావించాలి.

## రాజ్యాంగాన్ని నమ్మేవారు బీఎస్‌రెడ్డికి ఓటేయాలి

**ప్రొఫెసర్ డీఎన్**



అమిత్ షా తన వ్యాఖ్యలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డిని తగ్గించేందుకు యత్నించారు. కానీ జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాత్రం ఎన్‌డీయే అభ్యర్థి గురించి ఇప్పటిదాకా మాట్లాడలేదు. ఎన్‌డీయేలో ఉన్నవాళ్లు కూడా మీ అంతరాత్మను అడిగి ఓటు వేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగపు విలువలను నమ్మేవారు కచ్చితంగా జస్టిస్ బీఎస్ రెడ్డికి మద్దతు పలకాలి.



ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ వేసిన జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి ఆర్ట్ చిత్రం బహూకరిస్తున్న జనంసాక్షి ఎడిటర్ ఎంఎం రహమాన్

## ప్రకృతి శత్రువులు మోడీ, అమిత్ షా

**పాశం యాదగిరి, సీనియర్ జర్నలిస్టు**



ఈ ఎన్నికల్లో మోడీకి ఓటమి భయం పట్టుకుంది. ఓటమి భయంతోనే ఈ మాటలు మాట్లాడుతున్నారు. ఆపరేషన్ కగార్ ద్వారా అడవిలోని ఖనిజ సంపదను అమెరికాకు పంపించేందుకు మోడీ, షా ఇదంతా కొనసాగిస్తున్నారు. ఆదివాసీలను చంపాలనేదే బీజేపీ పాలసీ. అడవి ఉంటేనే వర్షాలు ఉంటాయి. ప్రకృతి ఉంటేనే మానవుడు ఉంటాడు. మోడీ, అమిత్ షా ప్రకృతి శత్రువులు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి సోషలిస్టు. కావున ఆయనకు మద్దతు తెలపాల్సిన బాధ్యత మనదే.

## ఆత్మతో ఆలోచించి ఓటువేయాలి

**అన్వర్ ఖాన్**



రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలు పౌరసమాజం తరపున జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటువేయాలి. రాజ్యాంగానికి, మనువాదానికి ఇది పోరాటంగా భావించాలి. ప్రజలు ఎన్నుకున్నవారు రాజ్యాంగానికి కట్టుబడిన వ్యక్తులకు మద్దతు పలకాలి.




## ప్రజాస్వామ్యాన్ని బతికించుకుందాం

**సాగరాబేగం**



రాజ్యాంగాన్ని గౌరవించే వ్యక్తికి, రాజ్యాంగాన్ని కించపరిచేవారికి మధ్య జరుగుతున్న పోటీ ఇది. సుప్రీం తీర్పును కూడా వక్రీకరించి మాట్లాడుతున్నారంటే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ ఆయనకు ఓటు వేయాలి.

## ప్రమాణం చేసిన వ్యక్తులు ఎటువైపో తేల్చుకోవాలి

**పీఎల్ విశ్వేశ్వరరావు**



బీజేపీ పాలనలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలు దుర్వినియోగం అవుతున్నాయి. మానవహక్కులు ఉల్లంఘించబడుతున్నాయి. ఆదివాసీ హక్కులను కాలరాస్తోంది బీజేపీ. వారిపై దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నాయి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన వ్యక్తులు, రాజ్యాంగాన్ని కాపాడే వ్యక్తులకు మద్దతు తెలపాలి.

## ఎంపీలు నిజాయితీ చాటుకోవాలి

**ప్రొఫెసర్ వనమాల**



జస్టిస్ సుదర్శన్ రెడ్డి సోషలిస్టే కాదు, గొప్ప మానవతావాది. ఆయన అభ్యర్థిత్వాన్ని సమర్థించాలి. అయితే, పార్లమెంటు సభ్యులు గతంలో చేసిన పాపాలను జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటువేసి కడుక్కోవాలి. మీ నిజాయితీని చాటుకోండి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370